ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
వరంగల్
: fb.com/vaartha Digital
Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 89 పేజీలు: 8+16 వెల: 6.50




ఇక మంచివాడిగా ఉండబోను
ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు



బుధవారం టెన్త్ ఫలితాలను విడుదల చేస్తున్న ప్రభుత్వ సలహాదారు కేశవరావు

# బాలికల హవా

## 96.26 శాతంతో టెన్త్‌లో పైచేయి
## బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత
## ములుగు ఫస్ట్, హైదరాబాద్ లాస్ట్
## గతేడాది కంటే పెరిగిన పాస్ పర్సంటేజ్
## జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
## ఫలితాలు విడుదల చేసిన కె కేశవరావు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 29:** తెలంగాణ రాష్ట్రంలో మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించిన 10వ తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేశారు. పరీక్షలకు హాజరైన వారిలో 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫెయిలైన విద్యార్థులకు జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నారు. ఎస్ఎస్‌సి ఫలితాలను బుధవారం ఎస్‌సీఈఆర్‌టీ క్యాంపస్‌లోని గోదావరి ఆడిటోరియంలో ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ పివి శ్రీహరి పాల్గొన్నారు. ఫలితాలను విడుదల చేసిన అనంతరం కె కేశవరావు మాట్లాడుతూ.. 10వ తరగతిలో ఉతీర్ణులైన విద్యార్థులందరికీ >>2

## బెంగాల్‌లో రెండో విడత ఉద్రిక్తం
## 91.47% శాతం పోలింగ్ 2

# బెంగాల్‌లో ఎన్డీయే!

డీలా పడిన దీదీ!



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** బెంగాల్‌లో రెండో విడత పోలింగ్ ముగిసిన వెంటనే దేశంలో ఐదు రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో వివిధ పార్టీల బలాబలాలపై ముందస్తు అంచనాలు వెల్లడి అయ్యాయి. >>2

కేరళలో యుడిఎఫ్
తమిళనాడులో డీఎంకె
పుదుచ్చేరిలో ఎన్నార్సీ బిజెపి
అసోంలో మళ్లీ బిజెపి
ఎగ్జిట్‌పోల్స్ వెల్లడి



బుధవారం కాశీలో ప్రధాని మోడీ

# హరహర మహాదేవ్!

## దేశ ప్రజల ఆనందం కోసం విశ్వనాథుని ప్రార్థించా
## కాశీలో ప్రధాని ప్రత్యేక పూజలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** వారణాసిలో బుధవారం ప్రధానమంత్రి సందడి చేశారు. ఉదయంలో కాశీ విశ్వనాథ >>2

# వడివడిగా తుమ్మిడిహెట్టి

## 150 మీటర్ల ఎత్తు నిర్మిస్తే
## 10 టిఎంసిల నీరు వినియోగం
## మహారాష్ట్రను ఒప్పించేందుకు
## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ
## ముంపు పరిహారానికి ప్రభుత్వం సిద్ధం
## బ్యారేజ్ నిర్మాణంపై సమీక్షలో సిఎం రేవంత్



తుమ్మిడిహెట్టిపై సమీక్షలో సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్29:** తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టే కార్యాచరణ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఎంసీహెచ్ ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,నీటి పారుదలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ ఇంజనీర్లు, నిపుణులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రాజ్యసభ ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్,నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తుమ్మిడి హెట్టి బ్యారేజ్‌ని ఎంత ఎత్తున నిర్మించాలి.. ఎంత ఎత్తు నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే వీలుందని ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ మీద ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం >>2

# కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం



## 'జనఆగ్రహ సభ' పోస్టర్‌ను విడుదల చేసిన రాష్ట్ర పార్టీ చీఫ్ రాంచందర్‌రావు
## ప్రధాని మోడీ సభకు భారీ ఏర్పాట్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకురావాలని, డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడాలని ప్రజలు ఆశిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. మే 10వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన "జనఆగ్రహ సభ" పోస్టర్‌ను బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా.ఎన్.గౌతం రావు, వీరేందర్ గౌడ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, రాష్ట్ర కార్యదర్శి భరత్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాహుల్ తదితరులు పాల్గొన్నారు. పోస్టర్ విడుదల చేసిన అనంతరం ఎన్.రాంచందర్ మాట్లాడారు. మే 10వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు రానున్న సందర్భంగా, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభ జన ఆగ్రహ సభ పోస్టర్‌ను ఆవిష్కరించామన్నారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్రధాని పర్యటన ఏర్పాట్లు, వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో దాదాపు రూ. 7,700 కోట్ల నుంచి రూ. 8,000 కోట్ల వరకు అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న జన ఆగ్రహ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని తొలిసారిగా తెలంగాణకు రావడం విశేషం అన్నారు. తాను రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా రాష్ట్రానికి విచ్చేయడం ఆనందంగా ఉందని, ఎయిర్‌పోర్టు వద్ద ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం సభా వేదికకు >>2



బుధవారం ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొంటున్న ఎల్ అండ్ టి బృందం

# సర్కార్ చేతుల్లోకి మెట్రో

## ఎల్ అండ్ టితో పూర్తయిన ఒప్పందం
## రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదలీ..
## ఇక మెరుగ్గా మెట్రో విస్తరణ పనులు, ప్రణాళిక, సేవలు
## సిఎం రేవంత్‌రెడ్డితో ఎల్ అండ్ టి చైర్మన్ సుబ్రమ్మాణ్యన్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్29:** ఇప్పటి వరకు ఎల్ అండ్ టీ ఆధీనంలో ఉన్న మెట్రో రైలును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 1ను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఈ మేరకు ఎల్ అండ్‌టీతో కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో హెచ్ఎంఆర్ఎల్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టి, ఎల్‌టిఎంఆర్‌హెచ్ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో సమావేశమయ్యారు. >>2

# గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ హబ్‌గా హైదరాబాద్

## రెడీ టూ వర్క్ ఫోర్స్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం బలోపేతంపై ప్రత్యేక దృష్టి: మంత్రి శ్రీధర్‌బాబు



హైనెకెన్ బిజినెస్ సర్వీసెస్ ఇండియా ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** హైదరాబాద్‌ను గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జిసిసి)ను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా... స్ట్రాటెజిక్ ఇన్నోవేషన్స్, హై వాల్యూ ప్రొడక్టివిటీకి కేంద్రాలైన గ్లోబల్ వాల్యూ సెంటర్ల(జివిసి)గా మార్చేలా సమగ్ర రోడ్డు మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్రూయింగ్ కంపెనీ హైనెకెన్ నానక్ రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో హైనెకెన్ బిజినెస్ సర్వీసెస్ ఇండియా పేరిట 76వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన జిసిసిని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైనెకెన్ లాంటి దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను ఎంచుకోవడం ఇక్కడి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, రెడీ టూ కొలాబరేట్, రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల విధానాలకు, పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమన్నారు. హైదరాబాద్ కేవలం ఐటీ డెస్టినేషన్‌గా కాకుండా ప్రపంచ శ్రేణి వ్యాపార పరిష్కారాలకూ చిరునామాగా మారుతోందన్నారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజాల మొదలు మ్యానుఫ్యాక్చరింగ్, కన్స్యూమర్ గూడ్స్ కంపెనీల వరకు తమ వ్యూహాత్మక కేంద్రాల ఏర్పాటు కోసం హైదరాబాద్‌నే మొదటి ప్రాధాన్యతగా ఎంచుకుంటున్నాయన్నారు. ఆ జాబితాలో 150 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన హైనెకెన్ కూడా చేరడం వల్ల ప్రపంచ పటంలో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమవుతుందన్నారు. మరిన్ని అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించేలా >>2



## 25% రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్!
### జులై 31 వరకు దరఖాస్తుకు అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాత వార్త:** అనుమతి లేని లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) ఛార్జీల్లో 25శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే నెల మే1 నుండి జూలై 31 వరకు ఈ రాయితీ అమలులో ఉండనుంది. గత >>2

# అటు ఎండ.. ఇటు వాన

## వచ్చే మూడు రోజులు పెరగనున్న ఉష్ణోగ్రతలు
## పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు




**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎండలు నిప్పులు కురిపిస్తున్నాయి. వడగాల్పుల తీవ్రతకు జనం విలవిలలాడుతున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. ప్రధానంగా నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతూ ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా తీవ్రమైన వేడి, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని, అదే సమయంలో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇటు మండే ఎండలు, అటు ఈదురుగాలులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, >>2



# పెట్రోలు కొరత లేదు

## తప్పుడు ప్రచారం చేయకండి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుందని, అంతకుముందు ఎల్‌పిజి కొరత ఉందని కూడా ఇలాంటి ప్రచారం జరిగిందని, అయితే వాస్తవానికి ఎక్కడా కొరత లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా లభ్యత పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులతో దిల్ కుషా గెస్ట్ హౌస్ లో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో సాధారణంగా రోజుకు సుమారు 6400 కిలోలీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతుందని, కానీ ప్రస్తుతం అది 10,300 కిలోలీటర్లకు పెంచాంమన్నారు. హైదరాబాద్ నగరంలో సాధారణంగా 3200 కిలోలీటర్లు సరఫరా ఉండగా, ఇప్పుడు దాన్ని 6400 కిలోలీటర్లకు పెంచామని, ఇదే విధంగా డీజిల్ విషయంలో సాధారణంగా 8000 కిలోలీటర్లు ఉండే సరఫరాను ప్రస్తుతం 15,500 కిలోలీటర్లకు, కొన్ని రోజుల్లో 19,300 కిలోలీటర్ల వరకు పెంచామన్నారు. ఇంత భారీగా సరఫరా పెంచుతున్నప్పటికీ కొరత ఉందని చెప్పడం సరికాదన్నారు. మొత్తం 4325 పెట్రోల్ పంపుల్లో ఉదయం వరకు 106 పంపుల్లో మాత్రమే తాత్కాలికంగా స్టాక్ సమస్య కనిపించిందన్నారు. అది కూడా సరఫరా ఆలస్యం, ముందస్తు చెల్లింపులు చేయకపోవడం వంటి కారణాల వల్లే సమస్య ఉందన్నారు. ప్రస్తుతం ఆ సమస్యను కూడా పరిష్కరిస్తున్నాం.మన దేశం పెట్రోలియం ఉత్పత్తుల్లో సుమారు 88శాతం ఇతర దేశాలపై ఆధారపడి ఉందని, ప్రపంచ వ్యాప్తంగా కొన్ని భౌగోళిక పరిస్థితుల వల్ల క్రూడ్ ఆయిల్ సరఫరాలో ఇబ్బందులు ఉన్నప్పటికీ, భారత ప్రభుత్వం అనేక దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటూ దేశంలో ఎక్కడా కొరత రాకుండా చర్యలు >>2



బుధవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన డిజిపి ఆనంద్

# సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన నూతన డిజిపి ఆనంద్

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** నూతన డిజిపి సి.వి ఆనంద్ బుధవారం నాడు సిఎం రేవంత్ రెడ్డిని బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కమాండ్ కంట్రోల్‌లో ఉన్నతాధికారులతో సిఎం సమావేశం అవుతున్న సమయంలో ఆనంద్ కలి శారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డికి ఆయన పుష్పగుచ్ఛం అందించారు. మంగళవారం నాడు కొత్త డిజిపిగా ఆనంద్‌ను సర్కారు నియ మించడం తెలిసిందే. ఈ నియామకం తరువాత సిఎంను ఆనంద్ కలువడం ఇదే తొలిసారి. కాగా ఆనంద్ శుక్రవారం నాడు బాధ్యతలు చేబడు తున్నారు.

# హరహర మహదేవ్!

>> ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వెలుపలకు వస్తూ ప్రజలకు అభివాదం చేశారు. ఇందుకు సంబంధించి ప్రధాని మోడీ 'ఎక్స్'లో ఫొటోలు, వీడియోలు షేర్ చేశారు. వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయంలో పూజలు నిర్వ హించి, దేశంలోని పౌరులందరికీ ఆనందం, సుసంపన్నత, ఆరోగ్య కరమైన జీవితం లభించాలని భోలేనాథుడిని ప్రార్థించినట్లు ప్రధా నమంత్రి నరేంద్రమోడీ తెలిపారు. "హర హర మహదేవ్! కాశీలోని బాబా విశ్వనాథ ఆలయంలో దర్శనం చేసుకుని, పూజలు నిర్వహించే అదృష్టం నాకు లభించింది. ఇక్కడ, దేశంలోని పౌరులందరికీ ఆనందం, సుసంపన్నత, ఆరోగ్యకరమైన జీవితం ప్రసాదించాలని భోలేనాథుడిని ప్రార్థించాను. అమ్మఅన్నపూర్ణ, అమ్మగంగాదేవి దర్శ నం నాకు అపారమైనమనశ్శాంతిని కలిగించింది. వారికృప అందరి లోనూ సానుకూల శక్తిని నింపాలని ఆశిస్తున్నాను! కాశీ ప్రజలకు మరోసారి నా వందనాలు" అంటూ ఎక్స్‌లో ప్రధాని రాసుకొచ్చారు.

# వడివడిగా తుమ్మిడిహెట్టి

>> దాదాపు 11 వేల కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పటికే కొన్ని చోట్ల కాల్వల నిర్మాణం కూడా జరిగింది. ఇప్పటికే 71.5 కిలోమీటర్ల కెనాల్ వర్క్ జరిగిందని అధికారులు సీఎంకు వివరించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల నీటిని వినియోగించుకునే వీలుంటుందని, తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయని సూచించారు. ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలన్నిటిని సద్వినియోగం చేసుకునేందుకు 150 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మించాలని నిపుణులు సూచించారు. గతంలో జరిగిన చర్చల ప్రకారం మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తు నిర్మించేందుకు అంగీకరించిందని, 152 మీటర్ల ఎత్తు నిర్మిస్తే మహారాష్ట్ర పరిధిలో ముంపు ప్రభావం ఉంటుందని మధ్యేమార్గంగా 150మీటర్ల ఎత్తు నిర్మిస్తే తక్కువ ఖర్చుతో నీటిని తీసుకునే వీలుందని ఇంజనీరింగ్ నిపుణులు సూచించారు. ఈ బ్యారేజ్ నిర్మాణం చేపడితే ఆదిలాబాద్‌తో పాటు తెలంగాణలో మెట్ట ప్రాంతాల రైతులకు సాగు తాగు నీరు అందుతుందని, తక్కువ ఖర్చుతో గ్రావిటీ పై శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తెచ్చుకునే వీలుంటుందని సీఎం చెప్పారు. ప్రాజెక్ట్ ప్రాధాన్యత దృష్ట్యా వెంటనే మహారాష్ట్రతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని, ఎక్కడైనా ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నందున ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వెంటనే లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సీఎం సూచించారు. సమీక్ష సమావేశం ముగిసిన వెంటనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నారు. గురువారం కేంద్ర మంత్రి అపాయింట్మెంట్ తీసుకొని నేరుగా కలిసి చర్చించే బాధ్యతను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి అప్పగించారు, తుమ్మిడిహెట్టి బ్యారేజ్ అవసరం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ రైతుల తరపున విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా చేపడుతున్న జియో టెస్టింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు.

# 25% రాయితీతో ఎల్ఆర్ఎస్!

>> బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్ఆర్ఎస్ కార్యక్రమం కింద ప్లాట్ల క్రమబద్ధీకరణకు లక్షల్లో దరఖాస్తులు వచ్చాయి. అయితే 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కీమ్ ద్వారా 15వేల కోట్ల ఆదాయం ఆదాయం సమకూరుతుందని భావించింది. ప్రస్తుతం 50శాతం దరఖాస్తులు పెండింగ్ ఉండడంతో ఛార్జీల్లో తాజాగా 25శాతం రాయితీ కల్పించి పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తుందని భావిస్తోంది. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ పరిధిలోని మినహా మిగిలిన స్థలాలకు ఎల్ఆర్ఎస్ స్కీం అమలు కానుంది. 2020 ఆగస్టులో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తెరపైకి తీసుకువచ్చింది. అప్పట్లోనే దాదాపు 25 లక్షల వరకు అప్లికేషన్లు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అప్లికేషన్లు వచ్చాయి. ఏడెనిమిది లక్షల దరఖాస్తులు మినహా మిగిలినవన్నీ పెండింగ్‌లోనే ఉన్నట్లు సమాచారం.

# కవితకు టిఆర్ఎస్ షాక్..

## పార్టీ పేరును రిజిస్టర్ చేయవద్దని ఇసికి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్29:** తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కవితకు తెలంగాణ రాజ్య సమితి (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షుడు తుపాకుల బాలరంగం షాకిచ్చారు. కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారడంతో బాలరంగం తన పార్టీని 2023లో రిజిస్టర్ చేయించారు. ఈ నేపథ్యంలో కవిత ఖటీఆర్ఎస్ఖ పార్టీని రిజిస్టర్ చేయవద్దని, అలా చేస్తే తన పార్టీకి నష్టం జరుగుతుందని ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. తన టీఆర్ఎస్ పార్టీని ఎన్నికల సంఘం 2023లో రిజిస్టర్ చేసినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్యాస్ సిలిండర్ గుర్తుతో పది నియోజకవర్గాల్లో పోటీ చేసినట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన తుపాకుల బాలరంగం టీఆర్ఎస్ సంక్షి ప్తనామంతో పార్టీని స్థాపించారు. బహుజ నులకు రాజ్యాధికారం లక్ష్యంగా పార్టీని స్థాపించారు. కవిత నాలుగు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. పాతికేళ్ల క్రితం కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ సంక్షి ప్త నామం వచ్చేలా

# ఇక మంచివాడిగా ఉండబోను..

## ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు

**వాషింగ్టన్, ఏప్రిల్ 29:** ఇరాన్‌తో చర్చలు ప్రతిష్టంభనపరంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లో అసహనం పెరిగిపోతోంది. చర్చల పరంగా ముందుకురాకపోతే ఇక నుంచి తాను మంచివాడిగా ఉండనని ప్రకటించారు. అంతే కాకుండా రైఫిల్ పట్టుకున్నట్లు ఉన్న ఫొటోను ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఆ దేశానికి ఆయన మరోసారి హెచ్చరిక జారీ చేశారు.

చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోందని విమర్శించారు. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదని అన్నారు. ఈ విషయంలో వారు తెలివిగా వ్యవహరిస్తే బాగుంటుందని అన్నారు. ఇక మీదట తాను అంత మంచివాడిగా ఉండనని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం, అమెరికాఇరాన్ మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంబన నెలకొన్న నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. ఇస్లామాబాద్‌లోజరిగిన చర్చలు విఫలం కావడం, హర్మూజ్ జలసంధిలో నౌకలన్నిటినీ అమెరికా దిగ్బంధం చేయడం, విదేశీ నౌకలపైనా చర్యలకు ఉపక్రమించడం వంటి చర్యలతో ఇరాన్ హర్మూజ్‌ను మూసివేసినట్లు ప్రకటించింది.

తాజాగా హర్మూజ్‌ను తెరుస్తామని, చర్చల పరంగా తాము సిద్ధమేనని అయితే యుద్ధం వెంటనే విరమించి బలగాలను తరలించాలని, నౌకాశ్రయాల్లో అమెరికా బలగాలుతప్పించాలంటూ మూడు షరతులు పెట్టింది. అణు తయారీపై చర్చలను వాయిదా వేయాలని కూడాచెప్పడంతో అమెరికాకు సుతరామూ ఇష్టంలేదు. స్పష్టమైన అజెండాతో వచ్చేంత వరకూ కాల్పుల విరమణ కొనసాగుతుందని ప్రకటించినట్రంప్ ఈలోపు ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధంచేస్తున్నారు. దీనితోఇరాన్ చర్చలకు సుతరామూ ఇష్టపడటంలేదు. అయితే తాజాగా హర్మూజ్‌ను ప్రారంభిస్తామని, యుద్ధవిరమణ పాటించాలంటూ ఇరాన్ నుంచి కొత్త అజెండా ఎదురయినా ట్రంప్ మాత్రం తన అజెండాపైనే కొనసాగుతున్నారు. అందుకు అనుగుణంగానే బుధవారం ట్రూత్‌లో గన్‌తో ఉన్న ఫొటోను పోస్టుచేసి ఇకపై తాను మంచివాడిగా ఉండబోనని స్పష్టంచేయడం గల్ఫ్‌లో మరింత ఉద్రిక్తతలకు తావిస్తోంది.

## వారం - వర్జ్యం

30-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, భరణి కార్తె
చతుర్దశి రా. 9.14
చిత్త రా. 2.17
వర్జ్యం : ఉ. 8.57-ఉ. 10.41
దు. ఉ. 9.57-ఉ. 10.48,
2) మ. 3.03-3.54
రాహుకాలం - మ. 1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామితో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. మిత్రులను కలుస్తారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**వృషభం:** ఫలితాన్ని ఆశించకుండా కృషిచేసి మంచి ఫలితాలు సాధిస్తారు. తనఖా వస్తువులు విడిపిస్తారు. వస్త్ర లాభం.

**మిథునం:** రాజకీయ రంగంలోని వారికి అనుకూలంగా వుంది. ఆదాయ మార్గాలు మెరుగుపరుతాయి. బంధువుల కలయిక.

**కర్కాటకం:** చేపట్టిన కార్యక్రమాలలో విజయంసాధిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** దూరప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగులకు పదోన్నతులు వుంటాయి.

**కన్య :** విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. నూతన విద్యావకాశాలు కలవు.

**తుల:** పొదుపు పథకాలలో వైఫల్యం చెందుతారు. టెక్నికల్ రంగంలోని వారికి అనుకూలంగా వుంది. వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** శుభకార్యాలు ముడిపడతాయి. ఉపయుక్తమైన చర్యలు చోటు చేసుకుంటాయి. విలువైన వస్తువులు కొనుగోలు.

**ధనుస్సు:** ధర్మమార్గంలో పయనిస్తారనే ఖ్యాతి లభిస్తుంది. సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

**మకరం:** ఇంటిలో పండుగ వాతావరణం నెలకొనివుంటుంది. ఎదురుచూడని అవకాశాలు లభిస్తాయి.

**కుంభం:** సోదరుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**మీనం:** ఫైనాన్స్ రంగంలోని వారు కాస్త జాగ్రత్తగా మెలగడం చెప్పదగినది. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సర్కార్ చేతుల్లోకి మెట్రో

>> సమావేశంలో లర్సెన్ అండ్ టుబ్రో లిమిటెడ్, ఎల్ అండ్ టి మెట్రో రైల్(హైదరాబాద్) లిమిటెడ్ సంస్థలతో షేర్ల కొనుగోలు ఒప్పందం(షేర్ పర్చేస్ అగ్రిమెంట్) కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్‌టిఎంఆర్‌హెచ్‌ఎల్‌కు ఉన్న వంద శాతం షేర్లను రూ.1,461.47 కోట్ల ఈక్విటీ విలువకు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఒప్పందంపై హెచ్‌ఎంఆర్‌ఎల్ తరఫున ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టి లిమిటెడ్ తరఫున డి.కె.సేన్, ఎల్‌టిఎంఆర్‌హెచ్‌ఎల్ తరఫున కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ హామీతో ఎల్‌టిఎంఆర్‌హెచ్‌ఎల్ పై ఉన్న రూ. 13,538.53 కోట్ల అప్పును (2026, ఏప్రిల్ 30వ తేదీ నాటికి) తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేస్తారు. ఈ లావాదేవీకి ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా ఐడిబిఐ క్యాపిటల్ వ్యవహరించగా, లీగల్ అడ్వైజరీ సేవలను సరాఫ్ అండ్ పార్ట్‌నర్స్ సంస్థ అందించింది. హైదరాబాద్‌లో ఎల్ అండ్ టి మెట్రో రైల్(హైదరాబాద్)లిమిటెడ్ సంస్థల 2017, నవంబర్ నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 కిలోమీటర్ల నెట్‌వర్క్‌తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-।ను నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మెట్రో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 86 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్-1, ప్రతిపాదిత ఫేజ్-2 నెట్‌వర్క్ రూపకల్పన, పనులు, ప్రణాళిక, అమలు, సేవల అందజేతలో సమన్వయం సాధ్యమవుతుంది. భవిష్యత్‌లోనూ హైదరాబాద్ నగరానికి మరింత సమగ్ర, ఆధారపడదగిన, ప్రయాణికులకు అనుకూలమైన మెట్రో రైలు నెట్‌వర్క్ ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కాగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో రైలును స్వాధీనం చేసుకునే ఒప్పందానికి ముందుగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఎల్ అండ్ టీ ఛైర్మన్, ఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారిద్దరి మధ్య చర్చలు జరిగాయి.

# బిజినెస్ సర్వీసెస్ హబ్‌గా హైదరాబాద్

>> రెడీ టూ వర్క్ ఫోర్స్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం బలోపేతంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. తెలంగాణను కేవలం ఒక ఉత్పాదక కేంద్రంగానే కాకుండా, గ్లోబల్ నాలెడ్జ్ ఎకానమీలో కీలక భాగస్వామిగా నిలబెట్టాలనే లక్ష ్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. తాజాగా ప్రారంభమైన హైనెకెన్ జిసిసి ఫైనాన్స్, డిజిటల్, టెక్నాలజీ, అనలిటిక్స్ రంగాల్లో గ్లోబల్ సర్వీసులను అందించే ఒక స్ట్రాటజిక్ సెంటర్‌గా పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం 300 మందికి పైగా నిపుణులకు ఇక్కడ ఉపాధి లభిస్తుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 1600కు చేరుకుంటుందన్నారు. హైనెకెన్ స్ఫూర్తితో తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, హైనెకెన్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ మెంబర్ హెరాల్డ్ వాన్‌డెన్ బ్రోక్, చీఫ్ పీపుల్ ఆఫీసర్ యోలాండా తలామో, చీఫ్ డిజిటల్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ రోనాల్డ్ డెన్ ఎల్జెన్, హేనెకెన్ బిజినెస్ సర్వీసెస్ సీనియర్ డైరెక్టర్ ఆకోస్ మగ్యారీ, యూబీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ వివేక్ గుప్తా, చీఫ్ కార్పోరేట్ అఫైర్స్ ఆఫీసర్ గరిమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలు కొరత లేదు

>> తీసుకుంటుందన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు, సోషల్ మీడియా ద్వారా ధరలు పెరుగుతాయని తప్పుడు ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో భయం నెలకొంది. దాని కారణంగా అవసరానికి మించి నిల్వ చేసుకోవడం జరుగుతుందని, ఇది పరిస్థితిని మరింత కష్టతరం చేస్తుందన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. అవసరమైనంత మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఇళ్లలో పెట్రోల్ నిల్వ చేయవద్దని సూచించారు. ఇది ప్రమాదకరం, ముఖ్యంగా వేసవిలో అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, బల్క్ వినియోగదారులు (ఇండస్ట్రీస్, కంపెనీలు) రిటైల్ పెట్రోల్ బంకుల వద్ద కొనుగోలు చేయకుండా, నేరుగా ఆయిల్ కంపెనీలకు ఇండెంట్ ఇవ్వాలన్నారు. 24 గంటల్లో సరఫరా చేసే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, కొందరు బల్క్ యూజర్లు రిటైల్ బంకుల వద్ద కొనుగోలు చేయడం వల్ల సాధారణ వినియోగదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అలాగే ఆటో ఎల్పిజి విషయంలో ప్రభుత్వ రంగ కంపెనీలు సరిపడా సరఫరా చేస్తున్నాయి. కొన్ని ప్రైవేట్ సరఫరాల్లో మాత్రమే తాత్కాలిక సమస్యలు ఉన్నాయి. దేశంలో లేదా తెలంగాణలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీలు కలిసి పరిస్థితిని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి. ఏదైనా సమస్య ఉంటే అధికారిక హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలి. తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రజలు ఆందోళన చెందవద్దు. అవసరానికి మించి నిల్వ చేయవద్దు. దేశంలో సరిపడా నిల్వలు ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ అవసరమైనంత పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంటుందన్నారు.



బుధవారం కోల్‌కతాలో ఓటు వేసిన అనంతరం సిరా గుర్తును చూపిస్తున్న బిజెపి నాయకుడు, నటుడు మిథున్ చక్రవర్తి

# బాలికల హవా

>> శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మంచి కోర్సును ఎంచుకొని, లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఎస్ఎస్‌సి ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 94.07 శాతం పాసయ్యారు. పరీక్షలకు 5,28,309 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా వారిలో 5,26,166 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలకు హాజరైన వారిలో 4,97,312 మంది పాసయ్యారు. ఎగ్జామ్స్ రాసిన వారిలో 95.15 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పాస్ పర్సంటేజ్ పెరిగింది. గత ఏడాది 92.78 శాతం ఉత్తీర్ణత శాతం ఉండగా.. ఈ ఏడాది అదికాస్త 95.15 శాతానికి పెరిగింది. మార్చి నుంచి ఏప్రిల్ వరకు జరిగిన పరీక్షలకు 5,28,309 మంది నమోదు చేసుకోగా వారిలో 5,26,166 మంది హాజరయ్యారు. వారిలో 5,16,815 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 9351 మంది ఒకసారి ఫెయిలైన విద్యార్థులున్నారు. పాసైన వారిలో 4,91,774 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉండగా 5,538 మంది ఒకసారి ఫెయిలైన వారున్నారు. ఎస్ఎస్‌సి ఫలితాల్లో ములుగు జిల్లా 99.30 శాతంతో రాష్ట్రంలోనే అత్యధిక ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. 89.23 శాతంతో హైదరాబాద్ జిల్లా అత్యల్ప ఉత్తీర్ణతతో చివరి స్థానంలో ఉంది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, ప్రభుత్వ పాఠశాలల్లో 86.18 శాతం, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 93.53 శాతం, మోడల్ స్కూల్స్‌లో 97.83 శాతం, కేజీబీవీ పాఠశాలల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రైవేటు పాఠశాలల్లో 95.81 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఆరు ప్రైవేటు పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఏడాది మొత్తం 75,731 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా వాటిల్లో 2,065 జిల్లా పరిషత్ పాఠశాలలు, 65 ప్రభుత్వ పాఠశాలలు, 83 మోడల్ స్కూల్స్, 290 కేజీబీవీలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మీడియంల వారీగా చూస్తే.. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 95.86 శాతంతో ఉత్తీర్ణత సాధించగా, తెలుగు మీడియంలో 89.14 శాతం మంది, ఉర్దూ మీడియంలో 86.71 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఎస్ఎస్‌సి ఫలితాల్లో విద్యాశాఖ ఈ రెండు కీలక మార్పులు చేసింది. గతంలో మాదిరిగా విద్యార్థులకు గ్రేడ్లు కాకుండా, ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు. విద్యార్థుల సౌలభ్యం కోసం తొలిసారిగా వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే సదుపాయాన్ని కల్పించారు. తమ ఫలితాలను పొందాలనుకునే వారు 80969 58096 అనే వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపి ఎస్ఎస్‌సి రిజల్ట్స్ అని మెసేజ్ పంపితే చాలు ఫలితాలు వస్తాయి. ఫెయిలైన విద్యార్థులకు జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనుండగా.. నేటి(గురువారం-ఏప్రిల్30) నుంచి మే 14 వరకు ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించారు.

# అటు ఎండ.. ఇటు వాన

>> చిన్నపిల్లలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో రైతులు తమ పంట ఉత్పత్తులను అకాల వర్షాల బారి నుండి కాపాడుకోవాలని, వర్షం కురిసే సమయంలో చెట్ల కింద ఉండొద్దని సూచిస్తున్నారు. ఉపరితల చక్రవాత ఆవర్తనం నుండి ఏర్పడిన ద్రోణి రాయలసీమ నుండి కొమరిన్ ప్రాంతం వరకు, దక్షి ణ అంతర్గత కర్ణాటక, తమిళనాడు మీదుగా సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ప్రయాణిస్తోందని, దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు కొన్ని జిల్లాల్లో గురువారం, శుక్రవారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ) వేగంతోపాటు వడగళ్లతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

# బెంగాల్‌లో ఎన్డీయే!

>> వివిధ సంస్థలునిర్వహించిన ఎగ్జిట్‌పోల్స్‌లో బిజెపి ఎన్డీయే మిత్రపక్షాలు కొన్నిచోట్ల ఆధిక్యంలో ఉంటాయని చెపితే తమిళనాడులో డిఎంకె, కేరళంలో యుడిఎఫ్‌లు సర్కారు ఏర్పాటుచేస్తాయన్న అంచనాలు వెల్లడించాయి. రెండోవిడతగా పశ్చిమబెంగాల్‌లోజరిగిన పోలింగ్‌లో కూడా తీవ్ర ఉద్రిక్తభరితంగా కొనసాగింది. 90శాతం పోలింగ్‌జరిగిందన్న అంచనాలతో ఎన్డీయే కూటమి తాము అధికారం చేపట్టడం ఖాయం అన్న దిశగా ఉంది. అలాగే అస్సోంలో హిమంతబిశ్వశర్మ నేతృత్వంలోని బిజెపి మళ్లీ సర్కారు ఏర్పాటుఖాయం అన్న రీతిలో ఉంది. వివిధ సంస్థలునిర్వహించిన ఎగ్జిట్‌పోల్స్ ఈ విధంగా ఉన్నాయి.

| పశ్చిమబెంగాల్ | బిజెపి | టిఎంసి | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| మ్యాట్రిజ్ | 146-161 | 125-140 | 6-10 | |
| పీపుల్స్ పల్స్ | 95-110 | 177-187 | 3-6 | |
| పిమార్క్ | 150-175 | 118-138 | 2-6 | |
| జెవిసి ఎగ్జిట్‌పోల్స్ | 138-159 | 131-152 | 0-2 | |
| ఛాణ్య స్ట్రాటజిస్ | 150-160 | 130-140 | 2-4 | 4-6 |
| జన్‌మత్‌పోల్స్ | 88-100 | 195-205 | 1-3 | 0-1 |

| అస్సాం | బిజెపి | కాంగ్రెస్ | ఎఐఎస్‌ఎం | ఇతరులు |
|---|---|---|---|---|
| చాణక్య స్ట్రాటజిస్ | 88-98 | 22-32 | 3-5 | |
| యాక్సిస్ మై ఇండియా | 88-100 | 24-36 | 0-3 | |
| పీపుల్స్ పల్స్ | 68-72 | 22-26 | -- | 3-5 |
| జెవిసి ఎగ్జిట్‌పోల్ | 88-101 | 23-33 | -- | 2-5 |
| మ్యాట్రిజ్ | 85-95 | 25-32 | -- | 6-12 |

| కేరళ | ఎల్‌డిఎఫ్ | యుడిఎఫ్ | బిజెపి | ఇతరులు |
|---|---|---|---|---|
| చాణక్య స్ట్రాటజిస్ | 58-64 | 72-80 | 1-3 | 2-4 |
| యాక్సిస్‌మై ఇండియా | 49-62 | 78-90 | 0-3 | -- |
| పీపుల్స్ పల్స్ | 55-65 | 75-85 | 0-3 | |
| పీమార్క్ | 62-69 | 72-79 | 0-3 | |
| మ్యాట్రిజ్ | 60-65 | 70-75 | 3-5 | |

| తమిళనాడు | డిఎంకె | ఎఐడిఎంకె | టివికె | ఇతరులు |
|---|---|---|---|---|
| చాణక్య స్ట్రాటజిస్ | 145-160 | 50-65 | 13-18 | 5-8 |
| యాక్సిస్ మై ఇండియా | 92-110 | 22-32 | 98-120 | -- |
| పిమార్క్ | 125-145 | 65-85 | 16-26 | 1-6 |
| మ్యాట్రిజ్ | 122-132 | 87-110 | 10-12 | 0-6 |
| జెవిసి | 75-95 | 128-147 | 8-15 | 00 |
| పీపుల్స్ పల్స్ | 125-145 | 65-80 | 18-24 | 2-6 |

| పుదుచ్చేరి | ఎన్నార్సీబిజెపి | కాంగ్రెస్ | డిఎంకె | టివికె |
|---|---|---|---|---|
| చాణక్య స్ట్రాటజిస్ | 17-20 | 9-13 | 0-1 | 00 |
| యాక్సిస్ మై ఇండియా | 16-20 | 6-8 | 00 | 3-7 |
| జెవిసి | 15-17 | 11-13 | 1-2 | 00 |
| పీపుల్స్ పల్స్ | 15-18 | 6-8 | 00 | 1-12 |
| కామాఖ్య అనలిటిక్స్ | 17-24 | 4-7 | 00 | 1-3 |

# బెంగాల్‌లో రెండో విడత ఉద్రిక్తం

## 91.47% శాతం పోలింగ్

**కోల్‌కత్తా, ఏప్రిల్ 29:** బెంగాల్‌లో హోరాహోరీగాజరిగిన రెండో విడత పోలింగ్‌లో భారీ ఓటింగ్‌నమోదయింది. మొత్తం ఏడు జిల్లాలోపరిధిలో 142 నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌లో ఉద్రిక్తతలు చెలరేగాయి. విపక్షనేత సువేందు అధికారి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీలమధ్య ఆరోపణలు ప్రత్యారోపణలతో మాటల తూటాలు పేలాయి. కొన్ని చోట్ల సిఆర్‌పిఎఫ్ ఇతర కేంద్ర బలగాలు అల్లరిమూకలను తరిమికొట్టడం కనిపించింది. బెంగాల్‌లో రెండో విడత పోలింగ్ స్వాతంత్ర్యం వచ్చినతర్వాత తొలిసారిగా అత్యధికంగా 92.47శాతం నమోదయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. రెండో విడతపోలింగ్‌ముగిసిన తర్వాత ఇపుడు సువేందు అధికారి, మమతా బెనర్జీల పోటీపైనే అందరూ ఫోకస్‌పెంచారు. బుధవారం పోలింగ్ రాత్రి 7.45 గంటలకు 91.66శాతం నమోదుకాగా చివరికి 92.47శాతం జరిగిందని ప్రకటించారు. మొదటి విడత పోలింగ్‌లో 93.19శాతం నమోదయినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు. 93.24శాతం ఓటింగ్ జరిగింది. పురుషులు 91.74శాతం నమోదయినట్లు తేలింది. 2011 నుంచి భవానిపూర్‌సీటు టిఎంసికి పట్టుగా ఉంది. ఇపుడు సువేందు అధికారి కూడా ఇక్కడపోటీచేస్తుండటంతో అందరి దృష్టి ఈ స్థానంపైనే పడింది. గత ఎన్నికల్లో ఈ 42 స్థానాల్లో 123 సీట్లు టిఎంసి, బిజెపి 18, వామపక్షాలు ఒకస్థానం గెలుచుకున్నాయి. రెండో విడతలో అధికంగా గ్రామీణప్రాంతంలోనే జరిగాయి. పూర్బ బర్ధమాన్‌లో 93.39శాతం, హుగ్లీలో 91.41శాతం, దక్షిణ24 పరగణాల్లో 91.45శాతం, ఉత్తర 24 పరగణాల్లో 91.39శాతం, నదియాలో 91.35శాతం పోలింగ్‌జరిగినట్లు తేలింది. బెంగాల్ షిఇఒ మనోజ్ అగర్వాల్‌మాట్లాడుతూ ఈవిఎంలు ట్యాంపరింగ్‌జరిగాయన్న ఆరోపణలున్నచోట్ల రీపోలింగ్ నిర్వహిస్తామని ప్రకటించారు. మొత్తం 77 ఈవీఎంలు ట్యాంపరింగ్‌కేసులు నమోదయ్యాయని, మే రెండోతేదీ రీపోలింగ్ ఉంటుందని సిఇఒ మనోజ్‌కుమార్ అగర్వాల్ తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం

>> చేరుకుంటారని, తెలంగాణలో బిజెపి ఒక బలమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మేధావులు, మహిళలు, యువతతో సహా అన్ని వర్గాల ప్రజలు బిజెపి వైపు ఆకర్షితు లవుతున్నారు. దేశవ్యాప్తంగా బిజెపికి మద్దతు పెరుగుతుండగా, దక్షి ణాదిలో కూడా మంచి ఫలితాలు వస్తున్నాయి. రానున్న రోజుల్లో బిఆర్ ఎస్ పార్టీ ప్రజల సమస్యలను పూర్తిగా పక్కనపెట్టి, కుటుంబ ప్రయో జనాలకే పరిమితమైపోయింది. ఇటువంటి అవకాశవాద రాజకీయాలు ఇక తెలంగాణలో పనిచేయవు. అందుకే తెలంగాణ ప్రజల ఆగ్రహాన్ని ప్రతిబింబించేలా ఈ సభకు "జన ఆగ్రహసభ" అనినామకరణం చేయ డం జరిగింది.. ఈసభకు మేధావులు, యువత, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలకాలని కోరుతున్నాను. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లోబిజెపి విజయాన్ని సాధిస్తుం దని, పుదుచ్చేరిలో అధికారంలోకి వస్తుందని విశ్వసిస్తున్నామని అన్నారు. అదే విధంగా రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి ప్రభుత్వాన్ని తీసుకువచ్చేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరుతున్నాను. బిఆర్ఎస్ పాలనలో మహిళలకు తీవ్ర అన్యాయం జరిగింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మహిళల పట్ల, యువత పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల నిరక్ష ్యంగా వ్యవహరిస్తుందని, ఈ పార్టీలకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు.

# డిజిటల్ అరెస్ట్‌పై అప్రమత్తంగా ఉండాలి:

## కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు ఏప్రిల్ 29 ప్రభాత వార్త ప్రతినిధి :** దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టు, సైబర్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒక అవగాహన వీడియోను విడుదల చేశారు. నేరగాళ్లు పోలీసులుగా , ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఈ వీడియోలో వివరించారు.

### విద్వేష ప్రసంగాల కట్టడికి

# కొత్త చట్టాలు అవసరం లేదు

**- తాము జోక్యం చేసుకునేంత శూన్యత లేదు**

**- ప్రస్తుత క్రిమినల్ చట్టాల వ్యవస్థ సరిపోతుంది**

**- సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** విద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టడానికి అదనపు ఆదేశాలు జారీ చేయడానికి భారత సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. ప్రస్తుత చట్టపరమైన వ్యవస్థ సరిపోతుందని, సమస్య చట్టాలు లేకపోవడంలో కాకుండా వాటిని అమలు చేయడంలో ఉందని పేర్కొంది. విద్వేషపూరిత ప్రసంగాల కేసులపై తమ 2023 ఆదేశాలను పాటించలేదని ఆరోపిస్తూ దాఖలైన ధిక్కార పిటిషన్లను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. కొత్త క్రిమినల్ నేరాలను సృష్టించడం పూర్తిగా శాసనసభ పరిధిలోకి వస్తుందని కోర్టు నొక్కి చెప్పింది. రాజ్యాంగ న్యాయస్థానాలు చట్టాలను వ్యాఖ్యానించగలవని, ప్రాథమిక హక్కులను పరిరక్షి ంచగలవని, కానీ అవి చట్టాలను రూపొందించలేవని లేదా కొత్త నిబంధనలను తీసుకు రావాలని పార్లమెంటును, రాష్ట్ర శాసనసభలను బలవంతం చేయలేవని కోర్టు వ్యాఖ్యానించింది. ఇప్పటికే ఉన్న పరిష్కార మార్గాలను ప్రస్తావిస్తూ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్), 2023 కింద ఉన్న చట్టపరమైన యంత్రాంగాలు ఇటువంటి నేరాలను పరిష్కరించడానికి ఇప్పటికే ఒక సమగ్ర వ్యవస్థను అందిస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. విచారణార్హమైన నేరాలలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం పోలీసుల విధి అని, చర్య తీసుకోని పక్షంలో బాధితులు ఉన్నతాధికారులను లేదా మేజిస్ట్రేట్‌లను ఆశ్రయించవచ్చని సూచిం చింది. విద్వేషపూరిత ప్రసంగంపై ఎలాంటి శాసనపరమైన శూన్యత లేదని, అమలులో ఉన్న లోపాల వల్లే ఆందోళనలు తలెత్తుతున్నాయని కోర్టు స్పష్టం చేసింది. ఎఫ్ఐఆర్‌ల నమోదు లేదా ప్రాథమిక విచారణల సమయంలో కాకుండా, కేవలం నేరాన్ని పరిగణనలోకి తీసుకునే దశలో మాత్రమే ముందస్తు అనుమతి అవసరాలు వర్తిస్తాయని కూడా అది నొక్కి చెప్పింది. తదుపరి ఆదేశాలు జారీ చేయడానికి నిరాకరిస్తూనే, విద్వేషపూరిత ప్రసంగం సామాజిక సామరస్యం, రాజ్యాం గ విలువలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ధర్మాసనం అంగీకరించింది. మారుతున్న సవాళ్ల దృష్ట్యా అదనపు చట్టపరమైన లేదా విధానపరమైన చర్యలు అవసరమవుతాయేమోనని పరిశీలించాలని అది శాసన అధికార వర్గాలను కోరింది.

# తరుగు పేరిట నిలువు దోపిడి

**అన్నదాతకు తప్పని తిప్పలు**

**క్వింటాకు 5 కిలోల దాకా కోత**

**ప్రశ్నిస్తే తూకం ఆలస్యం.. మిల్లుల్లో అన్‌లోడింగ్ కష్టం**

**ఎకరాకు క్వింటా పైగా నష్టం**

**మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అక్రమ దందా**



**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకుందామని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తే.. మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అక్రమాలు అన్నదాతలకు శాపంగా మారుతున్నాయి. వడ్లలో తేమ, తాలు, రాళ్లు ఉన్నాయనే సాకుతో క్వింటాల్‌కు 3 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారు.

ఒక బస్తాకు 41 కేజీల వడ్లు తూకం వేయాల్సి ఉండగా, 44 -45 కేజీల వరకు జోకుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి పక్షం రోజుల వరకు ఆరబెట్టి తేమ 17శాతం వరకు వచ్చాక తూకం వేసే క్రమంలో పాక్షిక నష్టం, గన్నీ బస్తాల బరువు పేరుతో అదనంగా 3 నుంచి 5 కిలోల మేర వడ్లను జోకుతుండడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసంగానైనా క్వింటాల్‌కు అయిదు కేజీల వరకు తరుగు పేరిట తూకం అంటే ఎకరా ధాన్యం సాగు చేసిన రైతు 20 క్వింటాళ్లు పండించినా ఒక క్వింటా మేర తరుగు కిందనే నష్టపోతున్నాడు. అంటే ఎకరం ధాన్యం సాగు చేసిన రైతుకు క్వింటా ధాన్యంపైగా రూ.3000 వరకు తరుగు పేరిట నష్టపోతున్నాడు. ధాన్యం నాణ్యత లేదని, రంగు మారిందని సాకులు చూపిస్తూ క్వింటాల్‌కు 3 కిలోల వరకు కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఒకబస్తా 41 కిలోల వరకు తూకం వేయాల్సి ఉండగా నిర్వహకులు 44 కిలోలకు పైగా తూకం వేస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. తూకం అక్రమాలను ప్రశ్నిస్తే కేంద్రాల్లో తూకం వేసి మిల్లులకు చేరిన తరువాత ఆన్ లోడింగ్ చేయకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంచలేక, ఆకాల వర్షం వస్తే తడిసిపోయే ప్రమాదం ఉండడంతో తప్పని పరిస్థితిలో క్వింటాల్‌కు రెండు నుంచి మూడు కిలోల కోత పెట్టినా ఒప్పుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ఒక లారీలో 600 వరకు బస్తాలు తరలిస్తే కోతలతో మిల్లర్లు, కేంద్రాల నిర్వాహకులకు సుమారుగా రూ. 25 వేల వరకు సంపాదించుకున్నట్టు రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. పంట పండించిన రైతు కంటే రైస్ మిల్లర్ల దందా బాగుందని, ఎలాంటి కష్టం లేకుండా లక్షల సంపాదిస్తున్నారని, రైతులను అధికారుల కన్నుసన్నల్లో మిల్లర్లు మోసగిస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొత్తంగా సాగు మొదలైనప్పటి నుంచి పంట తీసి మార్కెట్లో అమ్మే వరకు రైతుకు అన్ని కష్టాలే వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి తరుగు పేరిట మిల్లర్లు , కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దోపిడికి పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కోదండరాం

## మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ చెప్పలేదు

**- కోదండరాం**

**చిక్కడపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదని, తాను కూడా అడగలేదని తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. అయితే, తన పార్టీ నాయకులకు ప్రభుత్వం త్వరలోనే నామినేటెడ్ పోస్టులు ఇస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణ జన సమితి ఎనిమిదేళ్లుగా జనం పక్షాన నిలబడి నిలదొక్కుకున్నదని పేర్కొన్నారు. బుధవారం ముషీ రాబాద్ నియోజకవర్గంలోని రామ్ నగర్ గుండు, రాంనగర్ మీసేవ ప్రాం తాలలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరాం పార్టీ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడారు. నగర కమిటీ ఉపాధ్యక్షుడు పునిరెడ్డి జైపాల్ రెడ్డి, అడిక్మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య, ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, ముషీ రాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాషా, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు జస్వంత్ కుమార్, గాంధీ నగర్ డివిజన్ అధ్యక్షుడు జి రవీందర్ యాదవ్, ముషీరాబాద్ జన సమితి నాయకులు మహేష్, శంకర్ సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్, హారీశ్‌రావుపై పరువు నష్టం దావా

**కాంగ్రెస్ నేత సంపత్‌కుమార్ వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్29, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సీనియర్ నేత హరీశ్ రావులపై ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో వారిపై దావా వేశానని ఆయన బుధవారం మీడియాకు తెలిపారు. వారు తనపై, కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. మూడు నెలల క్రితం జరిగిన చిన్న సంఘటనను ఆధారంగా చేసుకుని తనపై వారు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. వారు తమ సొంత మీడియా, సోషల్ మీడియాలో తమపై అసత్య ప్రచారం చేసి, తమ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని వాపోయారు. వారు నీచ రాజకీయాలు చేస్తున్నారని, కానీ అలాంటిది సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై లేదా తనపై తప్పుడు ప్రచారాలు చేయడాన్ని తాము సహించేది లేదని అన్నారు. అందుకే కోర్టుకు వచ్చామని తెలిపారు. ప్రజాప్ర తినిధులుగా వారికి చట్టబద్ధంగా విమర్శించే, ప్రశ్నించే హక్కు ఉందని, కానీ ఇష్టారీతిన రాయవద్దని సూచించారు. ఒక కాంట్రాక్టర్ వద్ద తాను రూ.8 కోట్లు అడిగినట్లు బీఆర్ఎస్ అసత్య ప్రచారం చేసిందని సంపత్ కుమార్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ఇటువంటి రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. లేదంటే వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# సమాజంలో జైళ్ల శాఖ పాత్ర కీలకం

**డిజిపి బి.శివధర్‌రెడ్డి**

**సైదాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** సమాజంలో జైళ్ల శాఖ పాత్ర చాలా కీలకమైనదని డిజిపి బి.శివధర్‌రెడ్డి అన్నారు. చంచల్‌గూడలోని సికాలో బుధవారం ఢిల్లీ జైళ్ల శాఖ సిబ్బందికి ప్రాథమిక ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిజిపి మాట్లాడుతూ జైలు సేవ అనేది కేవలం నాలుగు గోడల మధ్య తాళాలు వేసే పనికాదని, ఖైదీలను సరిదిద్దుతూ వారిని సమాజంలోకి మంచి పౌరులుగా తిరిగి కలిపే బాధ్యత అని అన్నారు. శిక్షణను పొందుతున్న అభ్యర్థులు క్రమశిక్షణ, నిష్పక్షపాతం, వృత్తిపరమైన నైపుణ్యాలను పాటిస్తూ ఖైదీలను గౌరవంతో చూడాలన్నారు. జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర మాట్లాడుతూ ఢిల్లీ జైళ్ల శాఖ డిజి సికాపై నమ్మకం ఉంచి అక్కడి సిబ్బందిని పెద్ద ఎత్తున శిక్షణకు పంపడం గర్వకారణమని అన్నారు. సికా పాటిస్తున్న ఉన్నత ప్రమాణాలకు ఇది నిదర్శనంగా నిలుస్తుందన్నారు. సికాలో గతంలో విజయవంతంగా నిర్వహిం చిన శిక్షణ కార్యక్రమాలు, దేశవ్యాప్తంగా పొందిన గుర్తింపును డిజి వివరించారు. ఆధునిక జైలు పరిపాలన సంస్కరణాత్మక, హక్కుల ఆధారిత విధానాలవైపు సాగుతుందన్నారు. ఢిల్లీ జైళ్ల శాఖకు చెందిన మొత్తం 381 మంది ఈ ఏడాది దశలవారీగా సికాలో శిక్షణ పొందనున్నారు. దీనిలో భాగంగా బుధవారం మొదటి బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. తొమ్మిది నెలల పాటు సికాలో వీరు శిక్షణ పొందుతారు. అంతర్గత శిక్షణలో భాగంగా జైలు అడ్మినిస్ట్రేషన్, క్రిమినాలజి, విక్టిమాలజి, పెనాలజి, సైకాలజి, సోషియాలజి, సోషల్ వర్క్, క్రిమినల్ చట్టాలు, రాజ్యాంగ విలువలు, మానవ హక్కులు, జైలు పరిపాలనలో సాంకేతికతల గురించి వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. బాహ్య శిక్షణలో భాగంగా శారీరక వ్యాయామం, బిపిఆర్ అండ్ డి ప్రమాణాల ప్రకారం పరేడ్, యోగా, ద్యానంలో శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజి ఎన్.మురళిబాబు, డిఐజిలు డాక్టర్ డి.శ్రీనివాస్, ఎం.సంపత్, చంచల్‌గూడ సూపరింటెండెంట్ ఎన్.శివకుమార్ గౌడ్, చర్లపల్లి సూపరింటెండెంట్ జి.ప్రమోద్, చర్లపల్లి పిఏసి సూపరింటెండెంట్ డి.భరత్, మహిళా జైలు సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి, సికా ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, మలక్‌పేట ఏసిపి సుబ్బరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న డిజిపి శివధర్‌రెడ్డి

## జైలు నుంచి పైలట్ రోహిత్ రెడ్డి విడుదల

**మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్‌పార్టీ కేసు..**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎంఎల్ఎ, బిఆర్ఎస్ నాయకుడు పైలట్ రోహిత్ రెడ్డి బుధవారం మధ్యాహ్నాం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. రోహిత్ రెడ్డికి హై కోర్టు మంగళవారం నాడు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. గత నెల 14వ తేదీన మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల రోహిత్ రెడ్డికి చెందిన ఫాం హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్ పోలీసులు రట్టు చేయడం, ఈ సందర్భంగా రోహిత్ రెడ్డితో పాటు అ తని సోదరుడు రితేష్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ సహా 12 మందిని పోలీసులు అరెస్టు చేయడం విదితమే. ఇందులో డ్రగ్స్ సేవించిన పరిస్థితుల్లో పోలీసులపై కాల్పులు జరిపినందుకు రోహిత్ రెడ్డి అతని సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ వ్యాపారవేత్త నమిత్ శర్మలను పో లీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అప్పటి నుంచి వీరు జైల్లో వున్నారు. వీరిలో రోహిత్ రెడ్డి తరపున న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించి బెయిల్ పొందారు. బెయిల్‌కు సంబంధించిన పత్రాలను న్యాయవాదులు బుధవారం మధ్యాహ్నాం జైలు అధికా రులకు ఇచ్చిన తరువాత రోహిత్ రెడ్డిని విడుదల చేశారు. బెయిల్ షరతుల్లో భాగంగా రోహిత్ రెడ్డి పాస్‌పోర్టును పోలీసులకు అప్పగించడంతో పాటు ప్రతీ బుధవారం నాడు చేవెళ్ల పోలీసుల ఎదుట విచారణకు హాజరు కావాల్సి వుంటుంది.

## త్రైమాసిక కేసులపై ఎసిబి డిజి సమీక్ష

**కీలక కేసుల్లో ప్రతిభ కనబరచిన వారికి అవార్డుల ప్రదానం**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** ఎసిబి డిజి చారు సిన్హా బుధవారం నాడు తమ విభాగంలో ఈ ఏడాది మొదటి త్రైమాసిక కేసులపై స మీక్ష నిర్వహించారు. ప్రతీ ఏడాది మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ సమీక్షలో ఈ సంవత్సరం ఎసిబి అధికారులు మొదటి మూడు నెలల్లో అద్భుత ప్రతిభ కనబరచినందుకు డిజి చారు సిన్హా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో అవినీతిని పూర్తిగా అంతమొందించాల్సిన అవ సరం వుందని, ప్రభుత్వ సేవలు సామాన్యులకు అందే విషయంలో ఎలాంటి లంచాలు వుండకూడదని ఈ సందర్భంగా చారు సిన్హా తమ సిబ్బందిని ఆదేశించారు. అవినీతి అనేది ఎక్కడ వున్నా సమూలంగా తొలగించాల్సిందేనని, ఈ విషయంలో మరోమాట వుండ కూడదని ఆమె తెలిపారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు పెద్ద సంఖ్యలో లంచావతారులు పట్టుబడడం సంతోషకరమని ఆమె తెలిపారు. ఈ విషయంలో ఎసిబి అధికారుల కృషిని ఆమె కొనియాడారు. లంచావతారులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన అధికారులకు డిజి చారు సిన్హా అవార్డులు అంది ంచారు. భవిష్యత్తులో మరింత కష్టపడి ఎసిబికి పేరు తేవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎసిబి అధికారులు పలువురు పాల్గొన్నారు.

# టెన్త్‌లో ములుగు జిల్లా అగ్రస్థానం

**- మంత్రి సీతక్క హర్షం**



**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలవడంపట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి అద్భుత ఫలితాలు సాధించిన విద్యా ర్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన గురు వులకు, అలాగే పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించిన అప్పటి జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్, జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులను అభినందించారు. ములుగు జిల్లా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. ఇది జిల్లా స్థాయిలో సమన్వయంతో చేసిన కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షల్లో మొత్తం ఉత్తీర్ణత శాతం 95.15 శాతంగా నమోదు కావడం సంతోష కరమని తెలిపారు. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణతతో ముందంజలో ఉండగా, బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని అన్నారు. అలాగే రాష్ట్ర వ్యా ప్తంగా 5731 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని సూచిస్తోందని మంత్రి అభిప్రాయపడ్డారు. సంక్షేమ పాఠశాలల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదవడం ప్రభుత్వ పథకాల ఫలితమని తెలిపారు. పేద, వెనుక బడిన వర్గాల పిల్లలకు అందు తున్న నాణ్య మైన విద్య వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్య మయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.




## కొనసాగుతున్న పెట్రో కష్టాలు

**మెజారిటి బంకుల్లో నో స్టాక్ బోర్డులు**

**స్టాక్ ఉన్న చోట భారీ క్యూలో వాహనదారుల పడిగాపులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** తెలంగాణలో పెట్రోల్, డిజిల్ కోసం ప్రజల ఇబ్బందులు నాలుగో రోజూ కూడా కొనసాగాయి. ఒకవైపు ప్రభుత్వం నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెబుతుంటే, మరోవైపు సామాన్య వాహనదారులు బంకుల వద్ద గంటల తరబడి క్యూ కట్టాల్సి వస్తోంది. బుధవారం కూడా హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో మెజారిటీ బంకులు నో స్టాక్ బోర్డు పెట్టేశాయి. స్టాక్ ఉన్న పెట్రోల్ బంకుల్లో చాంతాడంత క్యూల్లో గంటల తరబడి ఇందనం కోసం ప్రజలు వేచి చూడాల్సి వచ్చింది. అయితే పౌర సరఫరాలశాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఇంధన సరఫరాను సాధారణం కంటే 126శాతం పెంచామని తెలిపింది. కాగా ప్రభుత్వ ప్రకటనలు ఎలా ఉన్నా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారుల అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెం, ఇల్లందు వంటి ప్రాంతాల్లో పరిస్థితి విషమంగా ఉంది. అనేక బంకుల్లో నో స్టాకు బోర్డులు దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలో కిలోమీటర్ల మేర క్యూ లైన్లు కనిపిస్తున్నాయి. అరగంట నుండి గంట వేచి చూస్తే తప్ప ఇంధనం దొరకని పరిస్థితి నెలకొంది. డాలర్ రేటు పెరగడంతో ఆయిల్ కంపెనీలు తమ నష్టాలను తగ్గించుకోవడానికి సరఫరాను కావాలనే తగ్గించాయని పెట్రో డీలర్ల అసోసియేషన్లు ఆరోపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 42,000 పెట్రోల్ బంకుల్లో దాదాపు 30వేల బంకులు స్టాక్ లేక మూతపడ్డాయని సమాచారం. ప్రభుత్వం పుకార్లను నమ్మవద్దని కోరుతున్నప్పటికీ బంకుల వద్ద బోర్డులు, క్యూలు చూస్తుంటే ప్రజల్లో ఆందోళన తగ్గడం లేదు. సరఫరా, డిమాండ్ మధ్య ఉన్న ఈ అంతరాన్ని ప్రభుత్వం తక్షణమే పూడ్చాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# 99.1 శాతంతో స్టేట్ ఫస్ట్

**సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థుల ప్రతిభ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 29:** బుధవారం విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 235 గురుకుల విద్యా సంస్థల నుండి 16,845 మంది విద్యార్థు లు పరీక్షలకు హాజరు కాగావారిలో బాలురు 6211, బాలికలు 10,634 కాగా వారిలో బాలురు 6127 మంది ఉత్తీర్ణత సాధిస్తే, బాలి కలు 10566 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం ఉత్తీర్ణత 99.1 శాతం. అందులో బాలుర ఉత్తీర్ణత శాతం 98.65 శాతం, బాలికల ఉత్తీర్ణత శాతం 99.36 శాతంగా ఉంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంస్థ సాధించిన ఈ విశిష్ట ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో సాంఘిక సంక్షేమ విద్యా సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి అద్భుత ఫలితాలు ఇతర విద్యా సంస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క విద్యార్థుల ప్రతిభను అభినందించి ప్రభుత్వం చేపడుతున్న విద్యాసంస్కరణలకు ఇది స్పష్టమైన ఫలితం అని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ .. ఈ ఫలితాలు గురుకులాల్లో ఒక చరిత్రను సృష్టించాయన్నారు. విద్యార్థుల పట్టుదల ఉపాధ్యాయులు అంకిత భావం తల్లిదండ్రుల సహకారం వల్ల ఈ అద్భుత ఫలితాలు రావడానికి అవకాశం ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న పథకాలు సదుపాయాల ఫలితాలకు పునాది అన్నారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ విజయేంద్ర బోయి విద్యార్థులకు అధికారులకు టీచింగ్ స్టాఫ్‌కు గురుకుల సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## సర్కార్ స్కూళ్ల పనితీరు భేష్

**ఉత్తమ ఫలితాలు సాధించిన టెన్త్ విద్యార్థులకు మంత్రి పొన్నం అభినందనలు**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 29:** బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్రను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5731 పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలతో పోలిస్తే ప్రభుత్వ విద్యా సంస్థలలో ఉత్తీర్ణత శాతం అధికంగా ఉంద న్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు 98.99 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించడం గర్వకార ణమన్నారు. బీసీ గురుకులాల్లోని 294 పాఠశాలల్లో 197 గురుకులాలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విద్యా రంగంలో గొప్ప ముందడుగు అని మంత్రి అన్నారు. ఈ ఫలి తాలు విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకిత భావానికి నిదర్శనమని, ఇలాంటి విజయాలు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరో హించేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి, తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షి స్తూ వారికి, ఉపాధ్యాయులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు



## జూన్ 5 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

**ఆదివారం కూడా కొనసాగనున్న పరీక్ష**

**నేటి నుంచి మే 14 వరకు ఫీజు గడువు**

**షెడ్యూల్‌ను ప్రకటించిన ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 29:** 10వ తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నారు. జూన్ 5 నుంచి 12 వరకు పరీక్షలను నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ పివి శ్రీహరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను ఆదివారం కూడా నిర్వహించనున్నారు. నేటి(గురువారం-ఏప్రిల్ 30) నుంచి మే 14 వరకు పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 5 నుంచి 12 వరకు ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నాం 12:30 గంటల వరకు నిర్వహిస్తారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఏప్రిల్ 30 నుంచి మే 14వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తులను నేటి నుంచి స్వీకరించనున్నారు. మే 14 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. రీకౌంటింగ్ ఫీజు ఒక సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు ఒక సబ్జెక్టుకు రూ.1000 గా నిర్ణయించారు.

జూన్ 5(శుక్రవారం) ఫస్ట్ లాంగ్వేజ్, జూన్ 6(శనివారం) సెకండ్ లాంగ్వేజ్, జూన్7(ఆదివారం) థర్డ్‌లాంగ్వేజ్(ఇంగ్లీష్), జూన్ 8(సోమవారం) గణితం, జూన్ 9(మంగళవారం) సైన్స్ పార్ట్-1 ఫిజికల్ సైన్స్ ఉదయం 930 గంటల నుంచి 11 గంటల వరకు, జూన్10(బుధవారం) సైన్స్ పార్ట్-2 బయలాజికల్ సైన్స్ ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు. జూన్ 11(గురువారం) సోషల్ స్టడీస్, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1(శాన్‌స్క్రిట్ అండ్ అరబిక్), జూన్12(శుక్రవారం) ఓఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2((శాన్‌స్క్రిట్ అండ్ అరబిక్) పరీక్షలను నిర్వహించనున్నారు.

## పంచాయతీ అధికారుల పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ అధికారుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జూనియర్ అసిస్టెంట్లు, జిపిఓలకు 60:40 నిష్పత్తిలో పదోన్నతులను కల్పించింది. సీనియర్ అసిస్టెంట్ పోస్టులపై జీపీవోలకు మార్గం సుగమమం చేసింది. జిల్లా స్థాయిలో రొటేషన్ విధానంలో పదోన్నతులు కల్పించనున్నారు. ఈ పదోన్నతలు ఈ ఏడాది ఫిబ్రవరి 12 నుంచి అమలులోకి వచ్చేలా నిర్ణయం తీసుకున్నారు.

వార్త

భూమి రకాన్ని పంట తెలియచేసినట్లే మనిషి చర్య అతడి వంశాన్ని తెలియచేస్తుంది.

-కురళ్

# 'చమురు' దేశాల్లో కొత్త చిచ్చు!


ఇప్పటికే చమురు సంక్షోభంలో దాదాపు అన్ని దేశాలు కుతకుతలాడుతున్నాయి. ఎటూ దిక్కుతోచని పరిస్థితుల్లో విలవిల్లాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించని అమెరికా వేసిన దుందుడుకు అడుగులే వీటికి కారణం. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, గల్ఫ్‌దేశాల్లో చిచ్చురేపుతోంది. పెట్రోలియం ఉత్పత్తుల కూటమిగా చెప్పబడే చమురు ఎగుమతి దేశాల సమాఖ్య 'ఒపెక్'నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మే నెల 1 నుంచి వైదొలగుతోంది. ఈ విషయాన్ని మంగళవారం ప్రకటించినప్పటి నుంచి ప్రపంచ ఆర్థిక రంగంలో చర్చ మొదలైంది. అంతర్జాతీయ చమురు మార్కెట్‌ను, గల్ఫ్ రాజకీయాలను ప్రభావితం చేసే పరిణామమిది. యుద్ధంలో ముఖాముఖీ తలపడుతున్న ప్రధాన దేశాలకన్నా వాటికి అటుఇటుగా సహాయ సహకారాలు అందిస్తున్న దేశాలే ఎంతో ఆందోళన పడుతున్నాయి. బాగా నష్టం పొందాయి. అమెరికాకు చేయూతనందిస్తున్న అరబ్ దేశాల మీద ఇరాన్ పెద్ద ఎత్తున దాడులు చేసి విధ్వంసం సృష్టించింది. ఈ దాడులతో ఆయా దేశాలకు కోలుకోలేని దెబ్బతగిలింది. అమెరికాకు ఏమాత్రం యునైటెడ్ అరబ్ దేశాల నుంచి సహకారం అందకుండా చేయాలనే వ్యూహంతో ఇరాన్ ఆయా దేశాల ఆర్థిక ములాలను నష్టపరచాలనే అభిప్రాయపడింది. అదే విధంగా దాడులు కూడా చేసింది. గల్ఫ్‌దేశాలు దాదాపు కుప్పకులాయి. ఆ దేశాలు కోలుకోవడం ఇప్పట్లో జరిగే పని కాదు. వాటి పునరుద్ధరణకు అమెరికా ఏ మేరకు ఆర్థిక సహాయం అందిస్తుందో చెప్పలేం. ఇరాన్ ఆగ్రహంతో హార్మూజ్ జలసంధిని మూసివేయడం అదే ప్రాంతాన్ని అమెరికా దిగ్బంధంలో ఉంచడం ఇవన్నీ యుద్ధకాంక్షతో ఒకరు, ఆత్మరక్షణలో మరొకరు దాడులు చేయించారన్న ఆరోపణను ఏ దేశమూ పెద్దగా పట్టించుకోలేదు. దాంతో మిక్కిలి నలిగిపోతున్నది గల్ఫ్ దేశాలే. ఈ నేపథ్యంలో గల్ఫ్‌దేశాలు తాము 'ఒపెక్' నీడన ఉండడం అనవసరమని భావించాయి. ఒపెక్‌లో పెద్దన్న పాత్ర వహిస్తూ ఇతర దేశాల మీద ఉత్పత్తి 'కోత'లు విధిస్తున్న సౌదీ అరేబియాపై అసంతృప్తితోనే యుఎఇ ఈ నిర్ణయం తీసుకుంది. అరవై ఏళ్ల అనుబంధాన్ని వదులుకోవాలనుకోవడం చెప్పుకోదగిన పరిణామమే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దాదాపు దెబ్బతింది. ఈ సందర్భంగా యుఏఇ ఈ నిర్ణయం తీసుకుంది. ముడి చమురు ఉత్పత్తిని కుదించాల్సి రావడంతో అసంతృప్తిగా ఉన్న యుఎఇ 'ఒపెక్'ను వదిలిపెట్టింది. తమ దీర్ఘకాలిక, వ్యూహాత్మక, ఆర్థిక ప్రాధాన్యతల రీత్యా ఇలా వ్యవహరించక తప్పలేదు. ఆ సంస్థ నుంచి బయటకు రావడమంటే 'గ్లోబల్ ఎనర్జీ' రాజకీయాల్లో జరుగుతున్న ఈ మార్పులను పరిశీలనగా గమనించాల్సిందే. 'ఒపెక్' కూటమి అనగానే అందులో ఉన్న దేశాల చమురు, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతుంది. చమురు ధరలను నియంత్రించడం, ఉత్పత్తి కోటాలను నిర్ణయించడం, ప్రపంచ మార్కెట్‌పై ప్రభావితం చూపే అంశాలను విశ్లేషించి విధానాలను నిర్ణయిస్తుంటుంది. 'ఒపెక్' పరిమితులు తమ ప్రయోజనాలను వ్యూహాలకు అడ్డంకిగా మారుతున్నాయని భావించి గల్ఫ్‌దేశాలు తమ ఆర్థిక వ్యవ్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా చమురుఆధార అభివృద్ధితోపాటు పర్యాటకం, ఫైనాన్స్, టెక్నాలజీ గ్యాస్ రంగాలలో పెట్టుబడులు పెడుతున్నాయి. కొన్ని దేశాలు చమురు కంటే సహజ వాయు ఉత్పత్తిలో ఎక్కువ దృష్టి పెడుతున్నాయి. 'ఒపెక్' చమురు ఉత్పత్తిపైనే దృష్టి పెడుతుండగా ఆయా దేశాలు మాత్రం గ్యాస్ ఆధారిత వ్యూహాలకు సరిపడే చేయూతను అందించలేకపోతున్నాయి. ఇవన్నీ పశ్చిమాసియా యుద్ధానికన్నా ముందుగా ఉన్న ఆలోచనలే. ఇరాన్ యుద్ధం వల్ల ఏర్పడిన ఇంధనం సంక్షోభం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్ని దెబ్బతిస్తోంది. యుఎఇ తీసుకున్న తాజా నిర్ణయం చమురు ఎగుమతి చేసే కూటమి. సౌదీ అరేబియాలమధ్య పెద్ద చిచ్చు ఏర్పడిందన్న అనుమానాలు లేకపోలేదు. ఒపెక్ సంస్థ ద్వారా గల్ఫ్‌దేశాలు చమురు వాణిజ్యంపై భారీగా ప్రభావితం చేశాయి. కానీ అమెరికా, ఇరాన్ దాడుల అనంతరం 'ఒపెక్' స్వరూపమే మారిపోయింది. ఈసంస్థఆయిల్ ఉత్పత్తిని నియంత్రిస్తూ ధరలను స్థిరంగా ఉంచాలి. కానీ సభ్యదేశాల మధ్య ఆసక్తులు ఆర్థికావసరాల మధ్య లక్ష్య సాధనలో భిన్నాభిప్రాయాలు వెలుగుచూశాయి. పైగా ఈ యుద్ధం తరుణంలో ఆయా దేశాల చమురు ఉత్పత్తుల ధరల క్రమబద్ధ విషయంలో బేధాభిప్రాయాలు పొడచూపాయి. కొన్ని గల్ఫ్‌దేశాలు తమ ఆర్థికాభివృద్ధి కోసం చమురు ఉత్పత్తిని పెంచాలనుకుంటున్న 'ఒపెక్' లక్ష్యాలతో సరిపోవడం లేదు. ప్రపంచంలో ఇంధన మార్పులు, పునరుత్పాదక శక్తివనరులు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో 'చమురు' భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి ఎంత వరకు దోహదపడుతుందనే అంశంలో కొన్ని సందేహాలున్నాయి. ఒపెక్ కూటమిలో కొన్ని పెద్ద దేశాల స్వార్థపూరిత విధానాలు చిన్నదేశాలపై పడుతోంది. ఈ నిర్ణయం వల్ల చమురు ధరల్లో అస్థిరత పెరుగుతుంది. అంటే త్వరలో పరోక్షంగా మరో చమురు సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి రావడం దుర దృష్టకరం. ప్రపంచానికి ఇంధన భద్రత కల్పించే కృషి నుంచి తాము ఎన్నటికీ వైదొలగబోమని యుఎఇ ప్రకటించింది. అంతేకాదు చమురు ఉత్పత్తిని పెంచుకుని మార్కెట్ పై పట్టుసాధించే దిశగా యుఎఇ అడుగులు వేసే యోచనలో ఉంది. యుఎఇ నిర్ణయం భారత్‌కు ఏ మేరకు ప్రయోజనం చేకూరుస్తుందన్నది కాలగమనంలో కానీ అంచనా వేయలేం. యుఎఇ తన చమురు ఉత్పత్తిని 2027 నాటికి రోజుకు 3.4 మిలియన్ బ్యారెళ్ల నుంచి 5 మిలియన్ బ్యారెళ్లకు పెంచుకోవాలనుకోవడమే ఒపెక్ నుండి దూరమవడానికి కారణం. ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గాలంటే ఉత్పత్తి పెరగడమే పరిష్కారం.

నిజమైన బలం అనేది శారీరక శక్తి కాదు. ఆత్మ జ్ఞానంలోనూ, మరణభయం నుంచి విముక్తి పొందడంలోనూ ఉంది.



మహాత్మా గాంధీ

అంతరాత్మ నీకు మంచి స్నేహితుడు. కావున తరచుగా తన మాట వినవలసిందే!



డేవిడ్ ఫ్రాస్ట్

## ప్రజావాక్కు



### న్యాయమూర్తులకు మనుస్మృతులతో ఏమి పని?

న్యాయవ్యవస్థ మీద గౌరవం తగ్గుతుంది. నిన్న ఒక న్యాయమూర్తి మనుస్మృతిలా విద్యార్థులకు బోధించాలి అని చెప్పడం చట్ట వ్యతిరేకం. తీర్పులు త్వరగా ఇవ్వాల అన్న ఆలోచన రావాలి. కోర్టు విచారణలు ఇంత ఆలస్యం అయితే ఎలా.. చనిపోయే లోపుగా తీర్పు వస్తది అన్న నమ్మకం కలగటంలేదు. ఇలా అయితే ఎలా? అన్ని వ్యవస్థల కంటే ఈరోజున్యాయవ్యవస్థ కొంచెం బాగుంది అనుకుంటున్నాము. అయితేకొంతమంది జడ్జీల వ్యాఖ్యలు తీర్పులు చూస్తుంటే , వాళ్ళు గతంలో ఇచ్చిన తీర్పులను తిరిగి విచారించాలి అన్న అలోచన వస్తుంది. మొన్న భోపాల్‌లోని ఒక జాతీయ లా కాలేజీ సభలో మద్రాస్ హైకోర్టుజస్టిస్ ఎస్ ఏధర్మాధికారిమాట్లాడుతూ, మనుస్మృతినులా విద్యార్థులకు బోధించాలి అనిచెప్పడం ఆయనకు ఉన్న మత దురభిమానాన్ని తెలియచేస్తుంది. ఒక న్యాయమూర్తి ఒక మతానికి చెందిన గ్రంథాన్ని విద్యార్థులకు బోధించాలని చెప్పడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం.

- నార్నెవెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### తగ్గిన మామిడి ఎగుమతులు

పశ్చిమాసియాలోని ఇతర దేశాలకు మామిడి పండ్లను లేదా దాని గుజ్జును ఎగుమతి చేయడంలో సంక్షోభం ఏర్పడడం ఆందోళన కలిగించే పరిస్థితి. 90 శాతం పల్ప్ స్టాక్‌లు గోడౌన్‌లు లేదాగోదాములలో ఉండిపోయినప్పుడు, ప్రాసెసింగ్ యూనిట్‌లు దిగుమతిదారుల నుండి చెల్లింపులను పొందలేకపోయాయి. చిత్తూరు జిల్లా దక్షిణ భారతదేశంలో మామిడి ఉత్పత్తికి గ్లోబల్ హబ్‌గా ఉంది. అయితే వ్యాపారంలో ముఖ్యంగా నిర్ణీత సెషన్‌లో లాభాలనుసాధించడానికి స్టాక్‌లకదలికలకు నివారణ చర్యలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తక్షణజోక్యం అవసరం.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### పట్టాలు ప్రదానం చేయాలి

ఆంధ్రయూనివర్సిటీ శతాబ్దిఉత్సవాలసందర్భంగా నగరం నడిబొడ్డు మీద యూనివర్సిటీ విద్యార్థిని విద్యార్థులు సినిమా పాటలకు డీజే పాటలకు డ్యాన్సులు వేయడం జుగుప్సాకరగా ఉన్నది. ఆంధ్రయూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అధికారులు వివిధ కారణాలవల్ల యూనివర్సిటీలో చేరి వాకి విభాగాల్లో చేరి కోర్సు పూర్తి చేయలేని వారికి ఒకే ఒక ప్రత్యేక పరీక్ష సింగిల్ సిటింగ్ లో నిర్వహించి పట్టాలు ప్రదానం చేస్తే బాగుంటుంది.

- వీరగంట రూపవతి, బొబ్బిలి

### ప్రజల ఆగ్రవేశాలకు గురికాక తప్పదు!

ఏయే దేశాల మధ్య యుద్ధం జరిగిన మొదటగా ప్రభావం అనేదిసామాన్య ప్రజల జీవితాలపై పడుతుంది. ఇప్పుడు అదే కథ పునరావృతమై ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం దాటికి దేశ వ్యాప్తంగా కూడా ఒకవైపు పెట్రోల్, డీజిల్ బ్యాంకుల దగ్గర పెట్రోల్, డీజల్ దొరక్క, మరో వైపు ఏటిఎం సెంటర్ల దగ్గర మనీ స్టాక్ లేక ప్రజలు తెగఇబ్బంది పడుతున్నారు. ఎందుకంటే సామాన్యుల రోజువారి జీవితాలలో ఏటిఎంలు ప్రధాన పాత్ర పోషిస్తూ ఉంటాయి. ఎలాగంటే జీతాల దగ్గర నుంచి, ఎవరైనావారికి డబ్బులు ఇవ్వాలన్న ఏటిఎంలనే ఆశ్రయిస్తుండటం ఓ షరామాములైన విషయంగా మారిపోయింది. ఇక గృహల్లో అయితే గృహిణులకు గ్యాస్ సిలిండర్ల రాక ఓ గగన కుసుమంగా మారి వారు గత్యంతరం లేక కట్టెల, కరెంటు పొయ్యి వంటి ప్రత్యామయ మార్గాలను వెతుకుంటున్నారు. ఇలా దేశ,ప్రపంచవ్యాప్తంగా అశేష ప్రజలు ఇంతగా సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోవడానికి ప్రధాన కారణం యుద్ధం.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా!

### కలిసివుంటే కలదు సుఖం

ఒకప్పుడు ఎక్కడ చూసినా ఉమ్మడి కుటుంబాలు కళకళాడుతుండేవి. అన్ని వయస్సులవారి ఆప్యాయతలు బాల్యం నుంచి అందుతూ ఎదుగుదల హాయిగా సాగేది. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటూ, ఐకమత్యమే గొప్పబలం అని చాటిచెప్పేవారు. ఇళ్లతోపాటు మనస్సు కూడా విశాలంగా ఉండేది. ముఖ్యంగా భార్యాభర్తల బంధం గట్టి పునాది అంటే అతిశయోక్తికాదు. రిలేషన్స్‌లో ఉక్కులా ఉండే ఆత్మవిశ్వాసం మెండుగా ఉంటుంది. కాలక్రమేణా సమష్టి కుటుంబాలు చాలా వరకు తగ్గిపోయాయి. వారాంతం పండుగలు పబ్బాలు జాతర్లలో కలుస్తూ కలిసి వుంటే కలదు సుఖం అంటూ ఉల్లాసంగా గడుపుతుండడం శుభసూచకం.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### గురుకులాలలో వైరింగ్ చేయాలి

గురుకులాలలో వేసవి సెలవులలో తప్పనిసరిగా వైరింగ్ చేయాలి. గత పది సంవత్సరాల క్రితం చేసిన వైరింగ్ స్విచ్ బోర్డులు వైర్లు వేలాడి ఉంటున్నాయి. గదులలో కరెంటు రావడం లేదు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ప్రతి గురుకులంలో ప్రతి గదిలో తప్పనిసరిగా వైరింగ్ చేయించాలి. మరమ్మత్తులు చేయకపోతే విద్యార్థులు విద్యుత్ షాక్‌కు గురి అయ్యే ప్రమాదం ఉంది. కొత్త బోర్డులు పెట్టాలి.

- రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# వరికి ప్రత్యామ్నాయం వైవిధ్య పంటలే!

**వ్యవసాయం ఇప్పటికే అనేక సవాళ్లను అధిగమించింది. ఇప్పుడు సమతుల్య,సుస్థిర మోడల్ వైపు మారడం ద్వారా మరింత ముందుకు సాగవచ్చు. ఇది రైతులు, ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తల సమన్వయంతో సాధ్యమవుతుంది. ఈ మహత్తర మార్పు ఒక్కసారిగా రాదు. చిన్న చిన్న ఆచరణలతోనే ఆరంభమవుతుంది. ప్రతి ఇంటి పెరటిలో ఒక కూరగాయ మొక్క నాటడం నుంచి, ప్రతి కుటుంబం ఒక పాడి పశువును ఆదరించడం, ప్రతి రైతు తన పొలంలో వైవిధ్య పంటలకు చోటివ్వడం ద్వారా ఈ పునరుజ్జీవనం మొదలవుతుంది. మనం సమష్టిగా అడుగులు వేస్తే, ఒకప్పుడు పంటల సిరి, పశుసంపద, పోషకాహారం, స్వయం సమృద్ధితో కళకళలాడిన ఆ పల్లె జీవనం మళ్లీ మన కళ్లముందు వికసిస్తుంది. భూమి సారం, కుటుంబ ఆరోగ్యం, గ్రామ ఆర్థిక బలం, ప్రకృతి సమతుల్యం అన్నీ కలిసిన ఆ సుసంపన్న గ్రామ సంస్కృతి తిరిగి పునర్జన్మిస్తుంది. చిన్న మార్పులే రేపటి గొప్ప వ్యవసాయ విప్లవానికి విత్తనాలు. మన చేతుల్లోనే మన పల్లె భవిష్యత్తు ఉంది.**



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

బియ్యం గోదాములు నిండితేనే భవిష్యత్తు భద్రమవదు.. భూమి సారం, నీటి సంరక్షణ, కుటుంబ పోషణ, రైతు స్వయం సమృద్ధి అన్నీ కలిసినప్పుడే నిజమైన వ్యవసాయ విజయం సాధ్యమవుతుంది. ఒకప్పుడు పంటల వైవిధ్యంతో, పశుసంపదతో, పెరటి తోటలతో పల్లె జీవనం పరి పూర్ణంగా ఉండేది. ఇప్పుడు వరి ఆధిపత్యం రైతుకు తాత్కాలికభరోసా ఇస్తున్నా, భవిష్యత్తుకు అనేక ప్రశ్నలు మిగులుస్తోంది. ఈ నేపథ్యంలో ఎక్కువ దిగుబడి కంటే సుస్థిర జీవన విధానం ఎంతో ముఖ్యం. మన భూమి, మన నీరు, మన ఆరోగ్యం, మన తరాల కోసం వైవిధ్య వ్యవసాయం ఎంతో అవసరం. తెలంగాణ రాష్ట్రంలో పప్పు ధాన్యాల (పల్సెస్) సాగు విస్తీర్ణం తగ్గడం,వరి (ప్యాడీ) సాగు ప్రతి సంవత్సరం పెరగడం ఒక సంక్లిష్టమైన వ్యవసాయ పరిణామం. ఇది రాష్ట్ర వ్యవసాయం, ఆర్థికత, నీటి వనరులు, పర్యావరణం, ఆహార భద్రత అన్ని కోణాల్లోనూ లోతైన ప్రభావాలను చూపుతోంది. గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత(2014-15 నుంచి) వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 2015-16లో వానకాలంలో సుమారు 18.5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే, 2023-24 నాటికి ఇది 65.9 లక్షల ఎకరాలకు చేరుకుంది. ఇది సుమారు 256 శాతం పెరుగుదల. ఉత్పత్తి కూడా ఇలాంటి ధోరణిని చూపించింది. అదే సమయంలో పప్పు ధాన్యాల సాగు తగ్గుతోంది. వానాకాలంలో పప్పుల సాగు విస్తీర్ణం 2015-16లో 9.21లక్షల ఎకరాల నుంచి 2023-24లో 5.09 లక్షల ఎకరాలకు తగ్గింది. ఇతర పంటలైన కూరగాయలు, పండ్లు, నూనె గింజలు,చిరుధాన్యాల సాగు కూడా తగ్గుతోంది. ఈ మార్పుకు బహుముఖ కారణాలున్నాయి. నీటి వనరుల అభివృద్ధి (మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు, ట్యాంకుల పునరుద్ధరణ), ఉచిత విద్యుత్ (24 గంటలు వ్యవసాయానికి) వంటి చర్యలు భూగర్భ జలాలు, కాలువల ద్వారా నీటి సౌకర్యం పెంచాయి. వరి నీటి ఆధారిత పంట కాబట్టి రైతులు దానిని ఎక్కువగా ఎంచుకుంటున్నారు. పప్పులు సాధారణంగా వర్షాధారిత లేదా మార్జినల్ భూముల్లో పండిస్తారు. నీటిసౌకర్యం పెరగడంతో ఆ భూములు కూడా వరికి మారుతున్నాయి. ఆర్థిక భద్రత కూడా ప్రధాన కారణం. వరికి కనీస మద్దతు ధర ఉంది. ప్రభుత్వం భారీగా కొనుగోలు చేస్తుంది. పప్పులకు కనీస మద్దతు ధర ఉన్నప్పటికీ, కొనుగోలు సమర్థవంతంగా లేదు. ధరల హెచ్చుతగ్గులు, మార్కెట్ రిస్క్ ఎక్కువ. రైతులు రిస్క్‌అవేయిడెంట్ కాబట్టి వరి వైపు మొగ్గు చూపుతారు. రైతు బంధు, ఉచితవిద్యుత్ వంటి స్కీములు కూడా ఈ ధోరణిని ప్రోత్సహిస్తున్నాయి. గతంలో తెలంగాణ పల్లెల్లో వ్యవసాయం ఒక పూర్తి జీవన వ్యవస్థగా విరాజిల్లేది. ఒక్క పెరటి తోటలోనే పప్పు గింజలు, నూనె గింజలు, వివిధ కూరగాయలు సాగవుతూ, ఆవులు, బర్రెలు, పాడి పశువుల మందలు, కోళ్లు, గొర్రెలు మేకలు అన్నీ ఒకే కుటుంబంలా సహజీవనం చేసేవి. పొలం నుంచి వచ్చిన గడ్డి పశువులకు ఆహారమై, వాటి పేడ,



మూత్రం మట్టిని బలోపేతం చేసి, మరలా ఆరోగ్యకరమైన పంటలను పండించేవి. ఇది కేవలం ఆదాయం కాదు. స్వయం సమృద్ధి, పోషకాహారం, కుటుంబ ఆరోగ్యం, మట్టి ఫలదీకరణం అన్నీ ఒక్కటిగా మెలిపెట్టిన సమతుల్య జీవితం. కానీ రాను రాను ఆ సుందర చిత్రం మాయమవుతోంది. ఉచిత విద్యుత్, కాలువలు, భారీ నీటి ప్రాజెక్టులు, వరికి హామీ ధరలు, రైతు బంధు వంటి ప్రోత్సాహకాలతో రైతులు కేవలం వరి పంట వైపే దృష్టి సారించారు. పెరటి తోటలు, పప్పులు, నూనె గింజలు, కూరగాయలు కనుమరుగయ్యాయి. పశువుల మందలు తగ్గి, కోళ్లగొర్రెలు దూరమయ్యాయి. ఇప్పుడు ఒకే పంట మీద ఆధారపడటం వల్ల మట్టి సారం క్షీణిస్తోంది, నీటి వనరులు ఎండిపోతున్నాయి, పోషకాలు లోపించిన ఆహారం మన కుటుంబాలను చేరుతోంది. రైతు బాధ్యత కేవలం బియ్యం ఉత్పత్తి కాదు. తన భూమిని, తన కుటుంబాన్ని, తన గ్రామాన్ని సమగ్రంగా పోషించడం. ఈ ధోరణి సానుకూల ప్రతికూలాలను కలిగి ఉంది. సానుకూలంగా, తెలంగాణ భారతదేశంలో వరి ఉత్పత్తిలో ముందంజలో ఉంది. రైతుల ఆదాయం స్థిరంగా పెరిగింది. కానీ ప్రతికూలంగా, నీటి సంక్షోభం తీవ్రమవుతోంది. వరి పంటకు నీరు ఎక్కువ అవసరం కాబట్టి భూగర్భ జలాలు హెచ్చరిక స్థాయిలో ఉన్నాయి. పంట వైవిధ్యం తగ్గడం వల్ల మట్టిసారం క్షీణిస్తోంది. తెగులు పెరుగుతోంది. పప్పులు నైట్రోజన్ ఫిక్సేషన్ చేసి మట్టిని మెరుగుపరుస్తాయి. వాటి తగ్గుదల మట్టి ఆరోగ్యానికి హాని. ఆహార సంతులనం తగ్గి, పోషకాహార భద్రత దెబ్బతింటోంది. పర్యావరణ ప్రభావం కూడా తీవ్రం. ఇది మన అందరి కనువిప్పు సమయం. వరి సాగు లాభదాయకమే కావచ్చు, కానీ దాని ఒంటరి ప్రయాణం దీర్ఘకాలికంగా మనను బలహీనపరుస్తుంది. గతంలో మన తాతలు అనుసరించిన ఆ సమగ్ర వ్యవసాయాన్ని మళ్లీ తీసుకురావాలి. పప్పులు,నూనె గింజలు, కూరగాయలు, పండ్లు పక్కన పెట్టి, పశువులను తిరిగి పెంచి, మట్టిని స్వాభావికంగా బలపరచి సాగు చేయడం ద్వారా మనం స్వయం సమృద్ధి, ఆరోగ్యం, స్థిరమైన ఆదాయం అన్నీ సాధించవచ్చు. రైతు బంధు సోదరులారా, మన భూమి మనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం. ఒక్క వరి కాదు, వైవిధ్యమే మన భవిష్యత్తు ఇది మన కుటుంబాలకు, మన రాష్ట్రానికి, మన తరువాతి తరాలకు చేసే నిజమైన సేవ. ఈ సమస్యను సమగ్రంగా పరిష్కరించాలంటే, పాలసీలు రైతు ఆదాయం, పర్యావరణ సమతుల్యం రెండింటినీ దృష్టిలో ఉంచాలి. పప్పులు/ఇతర పంటలకు ఎఫెక్టివ్ కనీస మద్దతు ధర,ప్రొక్యూర్‌మెంట్ హామీ, క్రాప్ డైవర్సిఫికేషన్ ఇన్సెంటివ్స్, నీటిసమర్థ పద్ధతులు (డిఎస్ ఆర్, మైక్రోఇరిగేషన్),రైతులకు శిక్షణ, మార్కెట్ లింకేజీలు అవసరం. తెలంగాణ వ్యవసాయం ఇప్పటికే అనేక సవాళ్లను అధిగమించింది. ఇప్పుడు సమతుల్య,సుస్థిర మోడల్ వైపు మారడం ద్వారా మరింత ముందుకు సాగవచ్చు. ఇది రైతులు, ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తల సమన్వయంతో సాధ్యమవుతుంది. ఈ మహత్తర మార్పు ఒక్కసారిగా రాదు. చిన్న చిన్న ఆచరణలతోనే ఆరంభమవుతుంది. ప్రతి ఇంటి పెరటిలో ఒక కూరగాయ మొక్క నాటడం నుంచి, ప్రతి కుటుంబం ఒక పాడి పశువును ఆదరించడం, ప్రతి రైతు తన పొలంలో వైవిధ్య పంటలకు చోటివ్వ డం ద్వారా ఈ పునరుజ్జీవనం మొదలవుతుంది. మనం సమష్టిగా అడుగులు వేస్తే, ఒకప్పుడు పంటల సిరి, పశు సంపద, పోషకాహారం, స్వయం సమృద్ధితో కళకళలాడిన ఆ పల్లె జీవనం మళ్లీ మన కళ్లముందు వికసిస్తుంది. భూమి సారం, కుటుంబ ఆరోగ్యం, గ్రామ ఆర్థిక బలం, ప్రకృతి సమతుల్యం అన్నీ కలిసిన ఆ సుసంపన్న గ్రామ సంస్కృతి తిరిగి పునర్జన్మిస్తుంది. చిన్న మార్పులే రేపటి గొప్ప వ్యవ సాయ విప్లవానికి విత్తనాలు. మన చేతుల్లోనే మన పల్లె భవిష్యత్తు ఉంది.

# యుద్ధ పర్యవసానాలకు పరిష్కారమేది?

చిలగాని జనార్ధన్

యుద్ధం వల్ల మన దేశం కూడా సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఆయిల్, గ్యాస్ వరకే పరిమితం కాకుండా అన్ని రంగాలపై ఈ ప్రభావం పడుతోంది. కరోన కాలం నాటి పరిస్థితులు ఎదురు కావచ్చని ప్రధాని నరేంద్ర మోడీ హెచ్చరించిన విషయం తెలిసిందే. సీఎంలతో వర్చువల్ సమావేశం నిర్వహించి పలు సూచనలు కూడా చేశారు. అయితే కేవలం పొదుపు మంత్రంతో సంక్షోభాన్ని ఎదుర్కోవడం సాధ్యం కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన కార్యచరణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రజా ప్రతినిధులు పొదుపును పాటిస్తూనే..పేద, మధ్య తరగతి వర్గాలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విచ్చల విడిగా పెట్రో నివినియోగం గ్యాస్, ఆయిల్ కొరత కారణంగా భవిష్యత్‌లో ఎదురయ్యే ప్రమాదం పొంచి ఉన్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం దాని ప్రభావం భారత్‌పై చూపుతోంది. పశ్చిమాసియ దేశాల మధ్య ఎగుమతులు దిగుమతులు నిలిచిపోయాయి. ప్రయివేటు ఆయిల్ కంపెనీ సైతం ధరలు పెంచిన విషయం తెలిసిందే. సరుకుల ధరలూ క్రమక్రమంగా పెరుగుతున్నాయి. ఈయుద్ధం ఇలానే సుదీర్ఘంగా కొనసాగితే ఉత్పత్తి, సేవా, ఉద్యోగ, ఉపాధి రంగాలు కుదేలయ్యే ప్రమాదం ఉంది. వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాకచక్యంగా వ్యవహరించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. కాని ప్రస్తుత పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రధానంగా పెట్రో వినియోగం భారీగా జరుగుతోంది. ప్రధాన మంత్రి మొదలుకొని సర్పంచ్ వరకు ప్రజా ప్రతినిధులు విచ్చలవిడిగా, అనవసరంగా వాహనాలనువినియోగిస్తున్నారు. విమానయాన ప్రయాణాలు, భారీ ప్రచార సభలు, వాహన ర్యాలీలు, వాహన కాన్వాయ్ వినియోగించడం వల్ల పెట్రోల్, డీజిల్ భారీగా ఖర్చుఅవుతోంది. అధి



కారులు సైతం వాహనాలను విరివిగా వాడుతున్నారు. ప్రధానంగా పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది అవసరం మేరకే వాహనాలు వినియోగిస్తే పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గే అవకాశాలున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలని తేడాలు లేకుండా పెట్రో పొదుపు పాటించాల్సిన సమయమిది. సైకిల్స్ వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రజాప్రతినిధులు చూడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2026-27 పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాల్లో యుద్ధం వల్ల కలిగే నష్టాలను చర్చించిన దాఖలాలు లేవు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాంపులు సంక్షోభాన్ని పెంచేలా ఉన్నట్లు స్పష్టమోతుంది. రూ. 53, 47, 315 కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.1, 51, 853 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్ కంటే 7 వేల కోట్లు తగ్గించింది. ఎరువుల రాయితీలకు సైతం 12,085 కోట్లు తగ్గించింది కేంద్రం. ఈ యుద్ధం వల్ల భవిష్యత్‌లో ఆహార సంక్షోభం ఎదురు కానుందని నిపుణులు, విశ్లేషకులు చెబుతున్నా..కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆయా రంగాలకు నిధుల కేటాయింపులు తగ్గించడం ఆందోళన కల్గిస్తోంది. పెట్రో ఉత్పత్తుల ప్రోత్సహకాలకూ అత్తెసరు నిధులే కేటాయించింది. వీటితో పాటు ఉపాధి హామీ,చిరు వ్యాపారులను ఆదుకునేలా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రభుత్వం సైతం వ్యవసాయం, వృత్తిదారులు, కూలీలు, చిరు వ్యాపారులను ఆదుకునేలా బడ్జెట్‌ను సవరించాల్సి ఉంది. గల్ఫ్ దేశాల్లో సుమారు కోటి మంది వరకు ప్రవాస భారతీయులున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. రెండు రోజుల క్రితం వరకు 4.5 లక్షల మందిని భారత్‌కు తీసుకొచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రానున్న కాలంలో భారీగా ఇండియాకు వచ్చే అవకాశాలున్నాయి. అత్యధికంగా యూఏఈ (దుబా యి)లో 43లక్షలు, సౌదీ అరెబియాలో 27లక్షలు, ఖతార్, కువైట్ ఇలా ఆయా దేశాల్లో లక్షల సంఖ్యలో మన భారతీయులు ఉద్యోగ, ఉపాధి పొందుతున్నారు. పొట్ట చేతపట్టుకుని గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయుల్లో ఎక్కువ మంది పేద, మధ్య తరగతికి చెందిన వారే ఉన్నారు. యుద్ధంలో కొందరు భారతీయులు మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. గల్ఫ్ నుండి ఇండియాకు వచ్చిన బాధితుల జీవన మనుగడ అత్యంత క్లిష్టంగా మారనుంది. భారత్‌కు వచ్చిన బాధితులకు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

# వ్యర్థాల పునర్వినియోగంతో పర్యావరణ పునరుద్ధరణ



శిరందాసు నాగార్జున

రాష్ట్రంలో పారిశ్రామిక రంగం విస్తరిస్తుండటంతో టన్నుల కొద్దీ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. సరైన నిర్వహణ లేకుండా ఈ వ్యర్థాలను ఇలా వదిలివేస్తే, భవిష్యత్తులో వీటిని ధ్వంసం చేయడానికి అయ్యే ఖర్చుపెరిగిపోతుంది. అంతే కాకుండా, పర్యావరణానికి, ప్రజారోగ్యానికి కూడా ప్రమాదకరం. ఈ సమస్యని పరిష్కరించడానికి పారిశ్రామిక వ్యర్థాలను ఆర్థిక ఉత్పాదకంగా, పర్యావరణానికి హాని కలుగకుండా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా,వాడి, విసిరి పారేసే విధానం నుంచి వాడిన తర్వాత పునరుద్ధరణ, పునర్వినియోగం వ్యవస్థకు మారడం దీని ప్రధాన లక్ష్యం. అంటే, వ్యర్థాల నుండి సంపద సృష్టించడం. దీనినే ప్రపంచవ్యాప్తంగా సర్కిల్ ఎకానమీ(వృత్తాకార ఆర్థిక వ్యవస్థ) అంటారు. ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఎకానమీ, వ్యర్థాల పునర్వినియోగం విధానం (4.0) (2025-30) అనే కొత్త పాలసీ ప్రకటించింది. దీనికి సంబంధించి, గత సంవత్సరం ఆగస్టు 24న ఓ జీఓ జారీ చేసింది. వ్యర్థాలను ఆదాయ వనరుగా మార్చడం, రీసైక్లింగ్ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా2047 నాటికి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఎదగాలన్న ఉద్దేశంతో ఈ పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. వ్యర్థాల నిర్వహణలో వినూత్న విధానాలు అవలంబిస్తోంది. వ్యర్థాల నుండి ఆదాయం సృష్టించడం, వ్యవసాయ, పారిశ్రామిక వ్యర్థాలతో సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు, రీసైక్లింగ్ పరిశ్రమలను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలు పెంచడం దీని ప్రధాన లక్ష్యం. ఈ పునరావృత ప్రక్రియ సాంకేతిక పురోగతులు, మార్కెట్ మార్పులు, కార్యాచరణ అభిప్రాయాలకు అనుగుణంగా విధానాన్ని రూపొందిస్తారు. ఏపీఐఐసీ, ఏపీపీసీబీ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలతోపాటు సంస్థలన్నింటిని సమన్వయంచేసుకుంటూ,పరిశ్రమల సంచాలకులు అవసరమైన చర్యలు తీసుకుంటారు. ప్రత్యేక ఆర్థిక మండళ్లు,సూక్ష్మ చిన్న,మధ్యతరహా పరిశ్రమల క్లస్టర్లు, ఎలక్ట్రానిక్, ఆహారం, దుస్తులు, ఔషధాల పరిశ్రమల కోసం ప్రత్యేక పార్కులు రాష్ట్ర పారిశ్రామిక



పర్యావరణ వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయి. అయితే, అధిక వనరులను వినియోగించే థర్మల్ పవర్, మెటలర్జీ, నిర్మాణం, వ్యవసాయ ప్రాసెసింగ్, ప్యాకేజీ, ఇంజినీరింగ్ వంటి రంగాల ద్వారా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు కొన్ని సవాళ్లను కూడా ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ రంగాల ద్వారా ఫ్లై యాష్, ఎర్ర మట్టి నుండి రాళ్ల దుమ్ము, పేపర్ వేస్ట్, ప్లాస్టిక్ స్క్రాప్, బయోమాస్ అవశేషాల వరకు భారీ స్థాయిలో పారిశ్రామిక వ్యర్థాలు పోగు పడుతుంటాయి. సర్క్యులర్ ఎకానమీ సూత్రాల ద్వారా, ఈ వ్యర్థ ప్రవాహాలను పారిశ్రామిక విలువ గొలుసులు (ఇండస్ట్రియల్ వాల్యూచైన్స్)గా తిరిగి విలీనం చేయడంతోపాటు ముడి వనరుల వినియోగాన్ని తగ్గించడం,కాలుష్యాన్ని తగ్గించడం, కొత్త గ్రీన్ ఎంటర్‌ప్రైజెస్‌లను సృష్టించవచ్చన్నది ప్రభుత్వ భావన. రాష్ట్రంలో పేరుకుపోతున్న వ్యర్థాల పర్యవేక్షణ, తరలిస్తున్న వ్యర్థాల వివరాల ప్రదర్శనకు,డేటా ఆధారంగా, పారదర్శకంగా ప్రజా నివేదికల కోసం రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ సర్క్యులారిటీ పర్యావరణ వ్యవస్థను నిర్మించడంతోపాటు ఏకీకృత ఇమ్యానిఫెస్ట్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించనుంది. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ),అర్బన్ లోకల్ బాడీస్(యూఎల్‌బీ)లు, ఆర్టీజీఎస్ (రియల్ టైమ్‌గవర్నమెంట్ సొసైటీ)లను సమగ్రపరిచేరియల్ టైమ్ సర్క్యులర్ ఎకానమీ డాష్‌బోర్డ్ ఏర్పాటు చేస్తారు. కొత్త సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థ, వ్యర్థాల పునర్వినియో విధానాన్ని తీసుకురావడానికి ప్రతిపాదనలను రూపొందించారు. పేరుకుపోయిన అన్ని రకాల వ్యర్థాలను పునర్వినియోగంలోకి తీసుకురావడంతో పర్యావరణ పునరుద్ధరణ జరుగుతుంది. 2047 నాటికి పూర్తి సర్క్యులర్ వ్యవస్థకు తీసుకెళ్లేందుకు వీలవుతుంది. స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు అనుగుణంగా సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. పరిశ్రమలు,వాణిజ్య శాఖ సమర్పించిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, నూతన సర్కిల్ ఆర్థిక వ్యవస్థ, వ్యర్థాల పునర్వినియోగ విధానం 4.0(2025-30)ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయిదు సంవత్సరాల పాటు లేదా కొత్త విధానం ప్రకటించే వరకు ఇది చెల్లుబాటులో ఉంటుంది. ఈ విధానంలో రీసైక్లింగ్ కేంద్రాలను ప్రోత్సహిస్తారు. రాష్ట్ర సర్క్యులారిటీ సెల్, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ త్రైమాసికానికి ఒకసారి సమావేశమై డాష్‌బోర్డ్, ఆడిట్ నివేదికలు,జిల్లా స్థాయి ర్యాంకింగ్‌ల సమీక్షిస్తాయి. ఈ సమీక్ష ఆధారంగా, విధానాలలోతాజాగా మార్పులు చేర్పులు చేస్తారు. ప్రోత్సాహక పథకాలను,సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను మెరుగుపరుస్తారు. వ్యర్థాల నిర్వహణ, వనరుల పునర్వినియోగం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం అవుతుంది. ఈ ప్రక్రియలో స్వచ్ఛ ఆంధ్రకార్పొరేషన్ అత్యంత కీలకంగా వ్యవహరిస్తోంది. పర్యావరణ అనుకూల విధానాలతో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఏపీఎదగడానికి అవకాశంఏర్పడుతుంది.

# విపక్షాల వికృతరూపం బట్టబయలు

- మహిళా బిల్లు ఓటమికి వారే కారణం
- యుపి అభివృద్ధికి గంగా ఎక్స్‌ప్రెస్ వే జీవనాడి
- రూ. 36,230 కోట్ల గంగా ఎక్స్‌ప్రెస్ వే జాతికి అంకితం
- హర్దోయ్ బహిరంగసభలో ప్రధాని మోడీ



బుధవారం హర్దోయ్ బహిరంగసభలో అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ, మంత్రులు

**హర్దోయ్, ఏప్రిల్ 29:** ఆధునిక ప్రగతి సాధిస్తున్న ఈ యుగంలో, గంగామాత సమీపంలో వెళ్లే ఈ ప్రాజెక్ట్ ఉత్తర ప్రదేశ్ అభివృద్ధికి 'కొత్త జీవనాడి'గా మారుతుందని ఆయన అన్నారు. దేశంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని వివరించారు. రూ.36,230 కోట్లతో నిర్మించిన గంగా ఎక్స్‌ప్రెస్‌వేను బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. అనంతరం హర్దోయ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, "నరసింహస్వామి యొక్క ఈ పవిత్ర భూమికి నేను నమస్కరిస్తున్నాను. ఇక్కడికి కొద్దిదూరంలోనే గంగామాత తన ఆశీస్సులను కురిపిస్తూ ప్రవహిస్తుంది,అందుకే ఈ ప్రాంతమంతా ఒక పుణ్యక్షేత్రం కంటే తక్కువ కాదు. యుపికి ఎక్స్‌ప్రెస్‌వేల వరం కూడా గంగామాత ఆశీస్సుల వల్లే లభించిందని నమ్ముతున్నా. ఇప్పుడు మీరు కేవలం కొన్ని గంటల్లోనే సంగమం చేరుకోవచ్చు.కాశీలోని బాబా ఆశీస్సులు పొందవచ్చు." అని అన్నారు. "మా గంగానది యుపికి, ఈ దేశానికి ఎలా జీవనాధారంగా ఉందో, అదే విధంగా ఈ ఆధునిక ప్రగతి యుగంలో, మా గంగానది సమీపంలోవెళ్లే ఈ ఎక్స్‌ప్రెస్‌వే యుపి అభివృద్ధికి ఒక కొత్త జీవనాధారంగా మారుతుంది," అని ఆయన అన్నారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ (సవరణ) బిల్లు ఓటమిని 'వేడుకగా జరుపుకోవడం'పై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌తో సహా ఇతర ప్రతిపక్ష పార్టీలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ ఘటన ప్రతిపక్షాల "నిజస్వరూపాన్ని, వికృత ముఖాన్ని" బట్టబయలు చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. "సమాజ్‌వాదీ పార్టీ కేవలం అభివృద్ధి వ్యతిరేకి మాత్రమే కాదు, మహిళా వ్యతిరేకి కూడా" అని ఆయన అన్నారు. ఇటీవలి రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష పార్టీల "నిజస్వరూపాన్ని, వికృత ముఖాన్ని" దేశం మరోసారి చూసిందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. "కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం పార్లమెంటులో 'నారీశక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు)ను ప్రవేశపెట్టింది. ఈ సవరణ బిల్లు ఆమోదం పొంది ఉంటే, 2029 ఎన్నికల నుంచే రాష్ట్ర శాసనసభల్లోనూ, లోక్‌సభలోనూ మహిళలకు రిజర్వేషన్లు లభించి ఉండేవి" అని ఆయన తెలిపారు. "మన తల్లులు, సోదరీమణులలో గణనీయమైన సంఖ్యలో వారు పార్లమెంటు సభ్యులుగానూ, శాసనసభ్యులుగానూ ఢిల్లీకి, లక్నోకు చేరుకునేవారు. సమాజంలోని ఏ ఇతర వర్గానికి కేటాయించిన సీట్ల సంఖ్యను తగ్గించకుండానే ఈ పరిణామం సాధ్యమయ్యేది. అయినప్పటికీ, సమాజ్‌వాదీ పార్టీ ఈ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసింది" అని ప్రధానమంత్రి అన్నారు. ఉత్తరప్రదేశ్‌కు ఎక్కువ సీట్లు లభిస్తాయని భావించి డిఎంకె వంటి పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయని, ఆ పార్టీల భావనలకు ఎస్‌పి, కాంగ్రెస్ పార్టీలు "మద్దతు" తెలిపాయని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. "కొత్తగా నిర్మించిన ఎక్స్‌ప్రెస్‌వేలు వికసిత్ భారత్‌కు జీవనాధారాలుగా పనిచేస్తాయి. నేడు, ఈ ఆధునిక జీవనాధారాలు భారతదేశ ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతున్నాయి," అని ఆయన నొక్కి చెప్పారు.

### గంగామాత ఆశీస్సుల నుంచి ఆధునిక రహదారుల వరకు...

ఉత్తరప్రదేశ్‌లో "పరివర్తనాత్మక" గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి తన దార్శనిక నాయకత్వాన్ని ప్రదర్శించారు. దాదాపు 600 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న, నియంత్రిత ప్రవేశం గల ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ కేవలం ఒక రహదారి మాత్రమే కాదు. ఇది ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రగతి పథంలో దూసుకుపోతున్న తీరుకు ఒక ప్రతీక. ప్రధాని మోడీ నాయకత్వంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి అపూర్వమైన వేగాన్ని, స్థాయిని అందుకుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇంత భారీ ప్రాజెక్టును ఐదేళ్లలోపే పూర్తిచేయడం విశేషం. ఇది ఆయన ప్రభుత్వ సామర్థ్యానికి, నిబద్ధతకు నిదర్శనమని విశ్లేషకులు అంటున్నారు. ఈ వేగమే నిర్ణయాత్మక, ఆశయాలు గల, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న 'నూతన భారతదేశాన్ని' నిర్వచిస్తుంది.

## ప్రాణత్యాగానికైనా సిద్ధం..శత్రువులకు తలొగ్గం!

### యుకెలో ఇరాన్ ఎంబసీ సంచలన పోస్టు


యుకె ఇరాన్ ఎంబసీ

**లండన్, ఏప్రిల్ 29:** యూకేలోని ఇరాన్ రాయబార కార్యాలయం, ఆ దేశంలో నివసిస్తున్న ఇరానీయులను ఉద్దేశించి చేసిన పోస్టు ఉద్రిక్తతలకు తావిచ్చింది. ఇరానీయులు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలని ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధంలో శత్రువులకు తలొంచవద్దని, దేశాన్ని వారికి అప్పగించే బదులు మనమంతా ప్రాణాలను అర్పిద్దామని యూకేలో నివసిస్తున్న తమ పౌరులకు పిలుపునిచ్చింది. దేశంకోసం ఆత్మబలిదానానికి సిద్ధంగా ఉండాలని, అలాంటివారు తమను సంప్రదించాలని కోరింది. అయితే ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టుపై విమర్శలు వస్తున్నాయి. ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టు అనుచితమైనదని, ఆందోళనకరమైనదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇరాన్ దౌత్య కార్యాలయం చేసిన పోస్టు, ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని యూకే అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పోస్టు చేసినందుకు ఆ దేశ రాయబారి సయ్యద్ అలీ మోసావినికి సమన్లు జారీ చేశారు. అయితే ఇరాన్ రాయబార కార్యాలయం తమ పోస్టును సమర్థించుకోవడం గమనార్హం. ఇది దేశభక్తికి, దేశంపై విధేయతకు సంబంధించినదని పేర్కొన్నారు. హింసను ప్రోత్సహిస్తున్నట్లు కాదని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానీయులు ఎల్లప్పుడూ తమ మాతృభూమి పరిరక్షణకు ముందుంటారని తెలిపింది. యుద్ధంలో ప్రాణత్యాగానికి తనతో సహా ఇరాన్ పౌరులు సిద్ధంగా ఉండాలని ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## బంగ్లాదేశ్‌లో మహమ్మారిగా మారిన మీజిల్స్!

**ఢాకా, ఏప్రిల్ 29:** బంగ్లాదేశ్‌లో మీజిల్స్ మహమ్మారి తీవ్రరూపం దాల్చింది. గతంలో ఎన్నడూ లేనంతగా విజృంభించి 250 మందికిపైగా ప్రాణాలను బలిగొంది. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులే ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అత్యంత వేగంగా వ్యాపించే ఈ వైరల్ వ్యాధి సరిహద్దులు దాటి భారత్, మయన్మార్ వంటి దేశాల్లోకి ప్రవేశించే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీచేసింది. భారత్‌లో వ్యాక్సినేషన్ కవరేజ్ బలంగా ఉన్నప్పటికీ, ఏమాత్రం అజాగ్రత్తగా ఉండకూడదని నిపుణులు హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లోని 64 జిల్లాలకు 58 జిల్లాల్లో తట్టుకేసులు తీవ్రంగా ఉన్నాయని డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. బంగ్లాదేశ్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం నమోదైన కేసుల్లో 91 శాతం ఒకటి నుంచి 14 ఏళ్లలోపు పిల్లలే ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అత్యవసర వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ప్రారంభించినప్పటికీ, వ్యాధి వ్యాప్తి అదుపులోకి రాకపోవడంతో సరిహద్దు దేశాల్లో ఆందోళన నెలకొంది. భారత్‌లోని పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశించే షోర్, నవాబ్‌గంజ్ వంటి సరిహద్దు రద్దీ ప్రాంతాలు బంగ్లాదేశ్‌లో ఉండటం, ఢాకా, చట్టోగ్రామ్ వంటి నగరాల నుంచి అంతర్జాతీయ రాక పోకలు ఎక్కువగా ఉండటంవల్ల వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఎక్కువగా ఉందని డబ్ల్యూహెచ్‌వో తన నివేదికలో పేర్కొంది.

బంగ్లాదేశ్‌లో పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పటికీ, భారత్‌లో మహమ్మారిగా మారే అవకాశాలు చాలా తక్కువని సీనియర్ వైరాలజిస్ట్, ఇండియా ఎక్స్‌పర్ట్ గ్రూప్ ఆన్ మీజిల్స్ రుబెల్లా కోఛైర్ డాక్టర్ జాకబ్‌జాన్ స్పష్టం చేశారు. 2026 చివరి నాటికి తట్టు, రుబెల్లా నిర్మూలనను భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం మీద భారత్‌లో అధిక వ్యాక్సినేషన్ కవరేజ్ రక్షణ కవచంలా ఉన్నప్పటికీ, పొరుగు దేశంలో పరిస్థితి తీవ్రంగా ఉన్నందున సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను పటిష్ఠం చేసి, అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు సూచిస్తున్నాయి.

# హార్ముజ్ దీర్ఘకాలం దిగ్బంధనం!

### కేబినెట్ సమావేశంలో సమీక్షించిన ట్రంప్


ట్రంప్ హార్ముజ్

**వాషింగ్టన్, ఏప్రిల్ 29:** హార్ముజ్ జలసంధిని సుదీర్ఘకాలం దిగ్బంధించాలన్న ఆలోచనలో ట్రంప్ ఇదే విషయాన్ని ఆయన తన క్యాబినెట్ మిత్రులకు చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్‌తో వార్ మూడో నెలలోకి ప్రవేశించింది. ఈ నేపథ్యంలో ఆ దేశంపై ఆర్థిక వత్తిడి తెచ్చే ఆలోచనలో అమెరికా ఉన్నది. ప్రభుత్వంలోని ముఖ్య, సన్నిహిత వ్యక్తులతో ట్రంప్ చర్చించారని, ఇరానీ ఇంధన ఎగుమతిపై ఆంక్షలు పొడిగించేందుకు నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ఆ పర్యవసానాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన తన బృందానికి చెప్పినట్లు తెలుస్తోంది. ఇరానీ పోర్టుల దిగ్బంధాన్ని మరింత కాలం పొడిగించాలని భావిస్తున్నట్లు ఆ మీటింగ్‌లో ట్రంప్ పేర్కొన్నట్లు తెలుస్తోంది.అయితే ఇరాన్‌పై బాంబు దాడుల కన్నా.. హార్ముజ్ జలసంధిని దీర్ఘకాలం దిగ్బంధించడమే తక్కువ రిస్క్‌తో కూడుకున్న అంశమని ట్రంప్ భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా తీసుకున్న నిర్ణయంతో దాదాపు ఇరాన్‌పై సైనిక చర్య ఆగినట్లే అవుతుంది. కానీ ఆ సంక్షోభానికి సంపూర్ణ పరిష్కారం దొరకనట్టు అవుతుంది. హార్ముజ్ జలసంధిని సుదీర్ఘకాలం దిగ్బంధించడం వల్ల అక్కడ ఉన్న ట్రాఫిక్ సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోనున్నది.ఇరానీ పోర్టుల నుంచి హార్ముజ్ ద్వారా ప్రయాణిస్తున్న షిప్‌లను అమెరికా అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ఇరానీ ఇంధన ఆదాయాన్ని దెబ్బతీయాలన్న ఉద్దేశంతో అమెరికా ఆ చర్యకు పూనుకున్నది. హార్ముజ్‌లో బ్లాకేడ్‌ను ఎత్తివేయాలని ఇరాన్ కోరుతున్నట్లు ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ఆయిల్, గ్యాస్ షిప్‌మెంట్లను ఓపెన్ చేయాలని టెహ్రాన్ కోరుతున్నదన్నారు. అయితే హార్ముజ్ అంశంలో అమెరికాతో ఇరాన్ తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయి.


బిజినెస్‌మేన్

## మహిళను ఢీకొట్టాడని బిజినెస్‌మాన్‌పై దాడి

### ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి

**వారణాసి, ఏప్రిల్ 29:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఒక సాధారణ రోడ్డు ప్రమాదం హింసాత్మకంగా మారింది. ఒక వ్యాపారి ప్రాణాలను బలితీసుకున్నది. కారుతో ఒక మహిళను ఢీకొట్టాడన్న ఆగ్రహంతో స్థానికులు మూకదాడికి పాల్పడి 38 ఏళ్ల వ్యాపారిని కొట్టి చంపారు. ఈ అమానుష ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మనీశ్ కుమార్‌సింగ్ అనే వ్యాపారి ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కారులో ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కారు రోడ్డు పక్కన నడుస్తున్న ఒక మహిళను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన మహిళను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.అయితే ప్రమాదం జరిగిన తర్వాత అక్కడి పరిస్థితి అదుపుతప్పింది. ఆగ్రహంతో ఊగిపోయిన స్థానికులు మనీశ్ కుమార్‌ను కారులో నుంచి బయటకు లాగి అత్యంత కిరాతకంగా దాడిచేశారు. తీవ్ర గాయాలపాలైన అతడిని బెనారస్ హిందూ యూనివర్సిటీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనపై గోమతి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) నీతూ కద్యాన్ మాట్లాడుతూ రాత్రి ఫ్యాక్టరీ నుంచి ఇంటికి వస్తుండగా మనీశ్ సింగ్ కారు ఒక మహిళను ఢీకొట్టింది. ఈ ఘటన తర్వాత పరిస్థితి ఉద్రిక్తంగా మారి, స్థానికుల దాడిలో మరణించాడని చెప్పారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఫూల్పూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో 8 మంది పేర్లను చేర్చగా మరో ఏడుగురిని గుర్తు తెలియని వ్యక్తులుగా పేర్కొన్నారు. పోలీసులు ఇప్పటివరకు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారని, మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలుచేపట్టినట్లు డీసీపీ తెలిపారు.

## హనీమూన్ హత్యకేసులో సోనమ్‌కు బెయిల్

### పోలీసుల తప్పిదం వల్లే నిందితురాలికి బెయిల్



**షిల్లాంగ్, ఏప్రిల్ 29:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘా లయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలి గా ఉన్న సోనమ్ రఘువంశీకి బెయిల్ మంజు రైంది. ఆమెకు బెయిల్ మంజూరు కావడంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నిందితు రాలికి బెయిల్ మంజూరు కావడానికి గల కారణం ఏమిటో తాజాగా బయటకు వచ్చింది. నిందితు రాలి అరెస్టు సమయంలో పోలీసులు చేసిన తప్పిదం కారణంగానే ఆమెకు బెయిల్ మంజూరైనట్లు తెలుస్తోంది. దీనిపై మృతుడు రఘువంశీ కుటుంబం మేఘాలయ హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతుంది. భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) ప్రకారం హత్యకు సంబంధించి నిందితులపై 103(1), 238(ఏ), 309(6) సెక్షన్‌లను విధించాలి.కానీ ఈ హనీమూన్ హత్య కేసుకు సంబంధించి సోనమ్ అరెస్టు ఎఫ్ఐఆర్‌లో సెక్షన్ 403(1) అని నమోదు చేశారు. బీఎన్‌ఎస్‌లో ఇలాంటి సెక్షనే లేకపోవడం గమనార్హం. సాంకేతిక తప్పిదంవల్ల ఇలా జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. అరెస్టు మెమోలోనే కాకుండా కేసుకు సంబంధించిన అన్ని పత్రాల్లోనూ ఇదే సెక్షన్ ప్రస్తావించడాన్ని షిల్లాంగ్ కోర్టు గుర్తించింది. దీంతో సాంకేతిక తప్పిదమని పోలీసులు చేసిన వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ క్రమంలో సోనమ్ అరెస్టుకి సరైన కారణాలు లేవని పేర్కొంది. అదేవిధంగా సోనమ్‌ను అరెస్టు చేసి తొలిసారి ఘాజీపూర్‌లోని కోర్టులో హాజరుపరిచినప్పుడు న్యాయవాదిని కలిసేందుకు ఆమెకు అనుమతులు ఇచ్చినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని కోర్టు వెల్లడించింది. ఈ కారణంతోనే సోనమ్ మొదట్లోనే తన అరెస్టును సవాల్ చేయలేకపోయిందని కోర్టు గుర్తించింది. ఈ తప్పిదాలే నిందితురాలికి అనుకూలంగా మారాయి. ఇదే సమయంలో విహాన్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హర్యానా 2025 కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా రూ. 50వేల వ్యక్తిగత పూచీకత్తుపై సోనమ్‌కు షిల్లాంగ్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అనుమతి లేకుండా సోనమ్ షిల్లాంగ్ జిల్లాను విడిచివెళ్లకూడదని షరతు విధించింది.

### విద్యుత్ కుంభకోణంపై సిబిఐ దర్యాప్తుకు హైకోర్టు ఆదేశం

**చెన్నై, ఏప్రిల్ 29:** విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో జరిగిన 397 కోట్ల కుంభకోణం గురించి దర్యాప్తు చేపట్టాలని మద్రాసు హైకోర్టు బుధవారం సీబీఐని ఆదేశించింది. విద్యుత్తు శాఖ మంత్రిగా వీ సెంథిల్‌బాలాజీ ఉన్న సమయంలో ఈ స్కామ్ జరిగింది. అయితే దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని, సీబీఐకి అన్ని రికార్డులు, డాక్యుమెంట్లను అందజేయాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొన్నది.కేసు విచారణకు సిట్ వేయాలని అరప్పోర్ ఇయ్యక్కమ్ పిటీషన్ వేశారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు జరగాలని అన్నాడీఎంకే అడ్వకేట్లు డిమాండ్ చేశారు. 2021 నుంచి 2023 వరకు విద్యుత్‌మంత్రిగా సెంథిల్‌బాలాజీ ఉన్నారు. ఆ సమయంలో 45 వేల ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేశారు. కానీ 397 కోట్ల నష్టం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ స్కామ్ గురించి దర్యాప్తు చేపట్టాలని మద్రాసు హైకోర్టు సీబీఐని కోరింది. చీఫ్ జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారి, జస్టిస్ జీ అరుల్ మురుగన్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఈ కేసులో ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్ర సర్కారు అన్ని రకాలుగా సీబీఐకి సహ కరించాలని తన ఆదేశాల్లో కోర్టు స్పష్టంచేసింది. ఇన్వెస్టిగేషన్ ఇంచార్జ్ ఆఫీసర్‌కు అన్ని ఫైళ్లను ట్రాన్స్‌ఫర్ చేయాలని డీవీఏసీని కోర్టు ఆదేశించింది.

## వర్చువల్ విచారణలో పోర్న్ వీడియోలు హల్‌చల్

### విచారణ నిలిపివేసిన హైకోర్టు న్యాయమూర్తి




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** ఢిల్లీ హైకోర్టులో షాకింగ్ ఘటన చోటుచేసుకున్నది. వర్చువల్‌గా వాదనలు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా అశ్లీల వీడియో ప్లే అయ్యింది. చీఫ్ జస్టిస్ కోర్టురూమ్‌లోనే ఈ ఘటన చోటుచేసుకున్నది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వింటున్న సమయంలో ఈ ఘటన జరిగింది. పలుమార్లు వీడియో కాన్ఫరెన్స్ మధ్యలో పోర్న్ వీడియో ప్లే అయినట్లు తెలుస్తోంది. ఈ ఘటన పట్ల కోర్టు న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వర్చువల్ కోర్టు వాదనలను నిలిపివేశారు.

వర్చువల్ హియరింగ్ జరుగుతున్న సమయంలో రెండుసార్లు ఈ సమస్య ఎదురైనట్లు తెలిసింది. రెండుసార్లు అభ్యంతరకర పోర్న్ కాంటెంట్ ప్లే అయినట్లు చెప్పారు. అయితే వర్చువల్ ప్రోసీడింగ్స్‌ను కొనసాగించేందుకు వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను షట్‌డౌన్‌చేసి మళ్లీ స్టార్ట్ చేశారు. తొలిసారి సమస్య రాగానే సిస్టమ్‌ను రీస్టార్ట్ చేశారు. కాసేపు బాగానే వీడియో కాన్ఫరెన్స్ వాదనలు జరిగాయి. అయితే మళ్లీ పోర్న్ ప్లే కావడంతో వీసీ సిస్టమ్‌ను పూర్తిగా షట్‌డౌన్ చేశారు. పోర్న్ వీడియో ప్లే అవుతున్న సమయంలో మీ సిస్టమ్ హ్యాక్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అయితే హ్యాక్ అయిన విషయాన్ని ఆటోమెటిక్ వాయిస్ ద్వారా కూడా వినిపించినట్లు చెబుతున్నారు. దీంతో ఢిల్లీ హైకోర్టు వీడియో కాన్ఫరెన్స్‌లో సైబర్ అటాక్ జరిగినట్లు పుకార్లు వ్యాపించాయి. నిందిత వ్యక్తి వీసీ స్క్రీన్‌ను షేర్ చేసుకుని, పోర్న్ వీడియోలు ప్లే చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. శ్రీధర్ సర్నా బాత్, షిట్‌జీత్ సింగ్ అకౌంట్ల నుంచి ఆ వీడియోలు ప్లే అయినట్లు అనుమానిస్తున్నారు.

# ట్రంప్ చిత్రం, సంతకంతో అమెరికా పాస్‌పోర్టులు



ట్రంప్ పాస్‌పోర్టు

**వాషింగ్టన్, ఏప్రిల్ 29:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మరో అసాధారణ నిర్ణయంతో వార్తల్లో నిలిచారు. ప్రభుత్వ సంస్థలపై తనదైన ముద్ర వేస్తున్న ఆయన, ఇప్పుడు అమెరికన్ పాస్‌పోర్టులపైనా తన ఫొటో, సంతకాన్ని ముద్రించనున్నారు. ఈ చర్యతో దశాబ్దాలుగా పాటిస్తున్న ఓ సంప్రదాయానికి తెరదించినట్టయింది. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకు 250 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రత్యేక పాస్‌పోర్టులను విడుదల చేయనున్నట్టు యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ధ్రువీకరించింది. ఈ కొత్త పాస్‌పోర్టు లోపలి పేజీల్లో రెండు చిత్రాలు ఉంటాయి. ఒక చిత్రంలో అమెరికా స్వాతంత్ర్య ప్రకటన పత్రంపై ట్రంప్ అధికారిక ఫొటో, దాని కింద బంగారు రంగులో ఆయన సంతకం ఉంటాయి. రెండో చిత్రంలో అమెరికా జాతిపితల చారిత్రక పెయింటింగ్ ఉంటుంది. జులైలో అమెరికా 250వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని పరిమిత సంఖ్యలో ఈ ప్రత్యేక పాస్‌పోర్టులను విడుదల చేస్తున్నట్టు స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి టామీ పిగోట్ తెలిపారు. ఈ లిమిటెడ్ ఎడిషన్ పాస్‌పోర్టులను అదనపు రుసుము లేకుండా కేవలం వాషింగ్టన్‌లో మాత్రమే అందుబాటులో ఉంచుతామని, స్టాక్ ఉన్నంతవరకే ఇవి లభిస్తాయని ఓ అధికారి వెల్లడించారు. ప్రజాస్వామ్య దేశాల్లో అధికారంలోఉన్న నేతల చిత్రాలను పాస్‌పోర్టులపై ముద్రించడం అత్యంత అరుదు. చాలా దేశాలు తమ చారిత్రక ప్రదేశాలు, ప్రకృతి సౌందర్యం లేదా జాతీయ చిహ్నాలను ఉపయోగిస్తాయి. ప్రస్తుత అమెరికా పాస్‌పోర్టుల్లో కూడా స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, చంద్రుడిపై కాలు మోపిన చారిత్రక ఘట్టం వంటి చిత్రాలు ఉన్నాయి. గతేడాది అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ట్రంప్ ప్రభుత్వ సంస్థలపై తన వ్యక్తిగత ముద్రవేస్తున్నారు. రాజధానిలోని పలు ప్రభుత్వ భవనాలపై ఆయన బ్యానర్లు ఏర్పాటు చేశారు. కెన్నడీ సెంటర్‌కు కూడా ఆయన పేరును జోడించారు. గత నెలలో డాలర్ నోట్లపై ట్రంప్ సంతకం కూడా ముద్రించనున్నట్టు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకటించడం సంచలనంగా మారింది.

# వాణిజ్యప్రయోజనాలకు ఓపెన్ ఎఐ ఆసక్తి

### ఓక్‌ల్యాండ్ కోర్టులో టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ ఆరోపణలు


మస్క్ ఓపెన్ ఎఐ

**ఓక్‌ల్యాండ్ (యుఎస్ఎ), ఏప్రిల్ 29:** ప్రముఖ కృత్రిమ మేధస్సు సంస్థ ఓపెన్‌ఏఐ, సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌పై టెస్లా, ఎక్స్‌ఏఐ సీఈవో ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓపెన్‌ఏఐ తన వ్యవస్థాపక లాభాపేక్ష రహిత లక్ష్యాన్ని విడిచిపెట్టి, పూర్తిగా వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాలోని ఓక్‌లాండ్ ఫెడరల్‌కోర్టులో జరుగుతున్న ఈ కీలక విచారణలో మస్క్ తన వాంగ్మూలాన్ని వినిపించారు. మానవాళి ప్రయోజనాల కోసం సురక్షితమైన ఏఐని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఓపెన్ ఏఐ ప్రారంభమైందని, అది ఇతర టెక్ దిగ్గజాలతో పోటీపడుతూ లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తోందని మస్క్ తన వాదనలో పేర్కొన్నారు. సంస్థ ప్రారంభ దశలో తాను ఆర్థికంగా మద్దతు ఇచ్చింది, అది ఒక లాభాపేక్ష రహిత సంస్థగా, పారదర్శకంగా ఉంటుందనే నమ్మకంతోనే అని ఆయన స్పష్టం చేశారు. ఒక స్వచ్ఛంద సంస్థను దోచుకోవడం సరైందేనని కోర్టు తీర్పు ఇస్తే, అది అమెరికాలోని దాతృత్వ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ భద్రతపై గూగుల్ పెద్దగా దృష్టి పెట్టడం లేదనే భావనతోనే తాను ఓపెన్‌ఏఐ ఏర్పాటులో పాలుపంచుకున్నట్లు వివరించారు. సంస్థ ప్రారంభంలో ప్రతిభావంతులను నియమించుకోవడంలో, ఇతర టెక్ భాగస్వాములతో సంబంధాలు నెలకొల్పడంలో తాను కీలక పాత్ర పోషించానని మస్క్ కోర్టుకు తెలిపారు. మరోవైపు ఓపెన్‌ఏఐ ఈ ఆరోపణలను ఖండించింది. అధునాతన ఏఐ పరిశోధనలకు అయ్యే భారీ ఖర్చులను భరించడానికే పరిమితలాభాల నమూనాకు మారాల్సి వచ్చిందని వివరించింది. సంస్థపై తుది నియంత్రణ ఇప్పటికీ లాభాపేక్ష రహితవిభాగం చేతిలోనే ఉందని స్పష్టం చేసింది. 2015లో ఓపెన్‌ఏఐ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న మస్క్, 2018లో సంస్థ నుంచి బయటకు వచ్చారు. ఆ తర్వాతే ఓపెన్‌ఏఐ వాణిజ్య విభాగాన్ని ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల నుంచి భారీగా పెట్టుబడులు ఆకర్షించింది. చాట్‌జీపీటీ విజయంతో ప్రపంచ ఏఐ రంగంలో అగ్రగామిగా నిలిచింది. ఓపెన్‌ఏఐతో విభేదించిన తర్వాత మస్క్ సొంతంగా మరో ఏఐ సంస్థను ప్రారంభించారు. ఈ కేసులో తనకు ఎలాంటి ఆర్థిక పరిహారం అవసరం లేదని, ఓపెన్‌ఏఐలో కేవలం వ్యవస్థాగత మార్పులనే కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

వార్త, వరంగల్, గురువారం 30, ఏప్రిల్ 2026

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్‌దే అధికారం

**పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్**
**దివ్యాంగుల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్లు:**
**స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క**
**నిజామాబాద్ కాంగ్రెస్ కార్యాలయ**
**భవన నిర్మాణానికి భూమి పూజ**





నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మహేష్ గౌడ్, సీతక్క తదితరులు(ఇన్‌సెట్) బ్యాటరీ సైకిళ్ళు పంపిణీ చేస్తున్న సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల మీదుగా నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి మహేష్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని పదవిని కూడా రాహుల్ గాంధీ త్యాగం చేశారని.. దేశం మొత్తం ఆయనవైపు చూస్తోందన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ.. కుల, మతాల చిచ్చు రేపుతోందని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు రావటం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. కేసీఆర్ పాలన తెలంగాణను 50 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిందని మహేష్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మరో పార్టీ పోటీ లేదన్నారు. మంచి నమూనాతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు నిర్మిస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదని మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎంతో అభివృద్ధి చేసిందని.. ఏడాది కాలంలో 4 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొన్నారు.

**దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ**

నిజామాబాదు జిల్లా రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో దివ్యాంగులకు ట్రై మోటరైజ్డ్ స్కూటీలు, బ్యాటరీ సైకిళ్ళు, బిజినెస్ ఎంపవర్ కార్డులు, బిజినెస్ ఆటోలు, మోటార్ సైకిళ్ళు, ల్యాప్ ట్యాపులు, సహాయ ఉపకరణాలను మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య పంపిణీ చేశారు. దాదాపు 140 మంది దివ్యాంగ లబ్ధిదారులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు. ప్రధానంగా 75 మందికి స్కూటీలు అందజేశారు. మిగిలిన వారికి బ్యాటరీ వీల్ చైర్లు, బిజినెస్ ఎంపవర్ కార్డులు, ల్యాప్ టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించాలన్న ప్రభుత్వ లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి వారి పేరు మీదనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ దివ్యాంగులకు ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేకంగా జాబ్ పోర్టల్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంగ వైకల్య నిర్ధారణ ప్రక్రియను మరింత శాస్త్రీయంగా చేసేందుకు అత్యాధునిక పరికరాల కొనుగోలు నిమిత్తం రూ.20 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, పైడి రాకేష్‌రెడ్డితోపాటు నగర మేయర్ ఉమారాణి ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నీటి పారుదల ప్రాజెక్టుల ప్రతిపాదనలను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

**ప్రాణహిత-చేవెళ్ల**

# నిర్మించి తీరుతాం

**ఇప్పటికే డిపిఆర్ కూడా సిద్ధమైంది**
**రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ మేరకు ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధం చేశామన్నారు. డిపిఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ మేరకు బుధవారం సిఎంతో నీటిపారుదలశాఖ సమీక్షా సమావేశానికి ముందు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ ఉన్నతాధికారులతో చర్చించారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నామన్నారు. తుమ్మిడి హట్టి నుంచి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామన్నారు. ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ సమిష్టిగా 4 ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణకు అవసరమైన పరీక్షలను వచ్చే వర్షాకాలం సీజన్ లోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రతి 1.5 మీటర్ దూరంలో ఎస్పీటీ టెస్టులు, 3 మీటర్ల పెర్మిబులిటీ టెస్టులు జరపనున్నామన్నారు. బ్యారేజీల పునరుద్ధరణ కోసం నియమించిన సమన్వయ కమిటీ సందర్శన టైమ్ లైన్ ను ఫిక్స్ చేసుకోవాలన్నారు. ప్రతిప్రతిపాదనకు అయ్యే ఖర్చు, అను కూల, ప్రతీ కూలతలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. బోర్లు వేస్తున్న సమయంలో రాయి వచ్చినప్పటికీ రాయి లోపటికి 5 మీటర్లు లోతుగా బోర్లు వెయ్యాలన్నారు. సిడబ్ల్యుపిఆర్ఎస్ డైరెక్టర్ క్షేత్ర స్థాయిలో ఉంటూ పునరుద్ధరణకు అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. పునరుద్ధరణ కోసం జరుగుతున్న పురోగతి పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్‌డిఎస్‌కు సమగ్రంగా సమాచారం అందించాలని అధికారులకు సూచించారు.

## తెలంగాణ ఎస్.ఎస్.సి-2026 ఫలితాల్లో

# మరోసారి టాప్ మార్క్‌తో చరిత్ర సృష్టించిన నారాయణ!



**హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ ఎస్.ఎస్.సి- 2026 ఫలితాల్లో నారాయణ హవా కొనసాగింది. ఎప్పటిలాగే నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో పైచేయి సాధించారు. స్టేట్‌లోనే టాప్ మార్కులతో నారాయణ విద్యార్థి మేథాన్ శ్రీరామ 597 మార్కులతో చరిత్ర సృష్టించాడు. అదేవిధంగా శోభిత కొప్పారపు 596 మార్కులు, మన్నే చంద్రహాస్ 596 మార్కులు, తూముల నిశ్చయ్ ప్రణవ్ 596 మార్కులు, కిలారి లలిత్ 596 వంటి టాప్ మార్కులతో సంపూర్ణ ఆధిపత్యం కొనసాగించారు. అలాగే 595 మార్కులు ఆరుగురు విద్యార్థులు, 594 మార్కులు 8 మంది విద్యార్థులు, 593 మార్కులు 8 మంది విద్యార్థులు, 592 మార్కులు 19 మంది విద్యార్థులు, 591 మార్కులు 30 మంది విద్యార్థులు, 590 మార్కులు 40 మంది విద్యార్థులు సాధించగా, 590 ఆపైన 116 మంది విద్యార్థులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ, పి.శరణి నారాయణ, నారాయణ విద్యాసంస్థల కోర్ కమిటీ సభ్యురాలు రమా నారాయణ తెలిపారు. మ్యాథ్స్ సబ్జెక్టులో ఎ గ్రేడ్స్ సాధించిన విద్యార్థులు 7334, సైన్స్ సబ్జెక్టులో ఎ గ్రేడ్స్ సాధించిన విద్యార్థులు 7558, సోషల్ సబ్జెక్టులో ఎ గ్రేడ్స్ సాధించిన విద్యార్థులు 8022, ఇంగ్లీష్ సబ్జెక్టులో ఎ గ్రేడ్స్ సాధించిన విద్యార్థులు 7475, ఫస్ట్ లాంగ్వేజ్‌లో ఏ గ్రేడ్లు సాధించిన విద్యార్థులు 6574, సెకండ్ లాంగ్వేజ్‌లో ఎ గ్రేడ్లు సాధించిన విద్యార్థులు 7259 మొత్తంగా ఏ గ్రేడ్‌లు 44222 విద్యార్థులు సాధించినట్లు తెలిపారు.

నారాయణ మొత్తం విద్యార్థుల సగటు మార్కు 530.26గా ఉందన్నారు. తెలంగాణాలో 530.26 సగటు మార్కు సాధించిన ఏకైక విద్యాసంస్థ నారాయణ మాత్రమేనని పేర్కొన్నారు. తెలంగాణలో 8935 మంది విద్యార్థులలో 99.66 శాతం ఉత్తీర్ణతా శాతం సాధింపజేసిన ఘనత ఒక్క నారాయణకే దక్కిందన్నారు. 80 బ్రాంచీలలో 100శాతం పాస్ పర్సంటేజ్ సాధించినట్లు తెలిపారు. అదే సమయంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీపరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను తమ రోజు వారి సిలబస్ భాగంగా బోధించటం ద్వారా నారాయణ విద్యార్థులు అంతర్జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. నారాయణ సిఓ-స్పార్క్, ఒలింపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ ప్రోగ్రామ్స్‌తో బోధన చేయటం కారణంగానే ఘనవిజయాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

## తెలంగాణ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో

# శ్రీచైతన్య రికార్డు స్థాయి ఫలితాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో శ్రీ చైతన్య రికార్డు స్థాయి ఫలితాలు సాధించిందని యాజమాన్యం ప్రకటించింది. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో, శ్రీచైతన్య స్కూల్ అద్భుతమైన 597 మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీచైతన్య విద్యార్థుల సంఖ్యను కూడా ఆమె ప్రకటించారు. 580 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 829 మంది, 570 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 2,303 మంది, 560 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 3,954 మంది, 550 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 5,521 మంది అని తెలిపారు. శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సాధించిన సబ్జెక్టుల వారీ ఏ గ్రేడ్ల సంఖ్య .. ఫస్ట్ లాంగ్వేజ్ ఏ గ్రేడ్లు: 11,302, సెకండ్ లాంగ్వేజ్ ఏ గ్రేడ్లు: 12,380, ఇంగ్లీష్‌లో ఏ గ్రేడ్లు : 13,821, గణితంలో ఏ గ్రేడ్లు: 12,226, సైన్స్‌లో ఏ గ్రేడ్లు: 13,273, సోషల్‌లో ఏ గ్రేడ్లు: 14,737, మొత్తం ఏ గ్రేడ్‌లు : 77,739. గరిష్టంగా 600 మార్కుల్లో శ్రీ చైతన్య స్కూల్ సుమారు సగటు మార్కులు 532 సాధించిందని, మొత్తం ఉత్తీర్ణత శాతం 99.7 శాతంగా నమోదైందని ఆమె తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్‌కి చెందిన 132 బ్రాంచ్‌లు 100 శాతం ఉత్తీర్ణతను సాధించాయని పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా 100/100 మార్కులు సాధించిన వారి సంఖ్య మాథ్స్ 1,647, సోషల్ 357, ఫస్ట్ లాంగ్వేజ్ 259, సెకండ్ లాంగ్వేజ్ 105, వివిధ సబ్జెక్టులలో 2,441 మంది 100/100 మార్కులు సాధించడం జరిగిందని తెలిపారు. శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ.. శ్రీ చైతన్య స్కూల్ బ్రాంచ్‌లు ఉన్న మెజారిటీ జిల్లాల్లో, మండలాల్లో, పట్టణాలు/నగరాల్లో శ్రీ చైతన్య స్కూల్ టాప్ మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కూడా ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు 100 లోపు 12 ర్యాంకులు, 1000 లోపు 77 ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో, శ్రీ చైతన్య స్కూల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులు 499/500 మార్కులు సాధించారని, మెజారిటీ రాష్ట్రాల్లో టాప్ మార్కులతో పాటు, ఓవరాల్ గా 100 శాతం పాస్ సాధించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంతటి భారీ విజయానికి మరే ఇతర విద్యాసంస్థ కూడా సమీపంలో లేదన్నారు. ఈ గొప్ప విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధనా సిబ్బందిని ఆమె అభినందించారు.

# కిశోర బాలికలకు 2 నుంచి సమ్మర్ క్యాంపులు

**ప్రతి గ్రామంలో నిర్వహణ**
**మంత్రి సీతక్కకు శ్రీనివాస రామానుజన్ ఉత్తమ సేవా పురస్కారం**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** కిశోర బాలికల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కిశోర బాలికల (15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు) కోసం స్నేహ సమ్మర్ క్యాంపులను మే 2 నుండి జూన్ 10 వరకు నిర్వహించనున్నారు. బాలికల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని రూపొందించిన ఈ ప్రత్యేక కార్యక్రమం విద్య కొనసాగింపు, ఆరోగ్య పరిరక్షణ, భద్రతపై అవగాహన, జీవన నైపుణ్యాల పెంపు, బాల్య వివాహాల నివారణ వంటి ముఖ్య అంశాలపై దృష్టి సారిస్తుంది. స్నేహ సమ్మర్ క్యాంపులో భాగంగా ప్రతి రోజుకు ప్రత్యేక థీమ్‌లతో కార్యాచరణ రూపొందించారు.

బాలికల పరస్పర పరిచయం నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాలుజజ బాల్య వివాహాల దుష్పరిణామాలపై అవగాహన, ఎనిమియా(రక్తహీనత) తదితర ఆరోగ్య సమస్యలపై చర్చలు, గ్రామస్థాయిలో భద్రతా ప్రణాళికల రూపకల్పన, సామాజిక బాధ్యత పెంపు వంటి అంశాలపై చర్చిస్తాయి. ఆర్థిక నిర్వహణ, క్రీడలు, సైబర్ భద్రత, విద్య ప్రాముఖ్యత, కెరీర్ మార్గదర్శనం, సైక్లింగ్, ఇతర నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్యాంపుల ముగింపు సందర్భంగా గ్రామ స్థాయిలో బాలికల గ్రామసభలు నిర్వహించి బాల్య వివాహాల నిరోధం, బాలికల భద్రత, విద్య కొనసాగింపు వంటి అంశాలపై తీర్మానాలు చేస్తారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఒక కిశోర బాలికను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీ నిర్వహించనున్నారు. ఈ మేరకు సెర్ప్ సిఇఒ దివ్యా దేవ రాజన్ మార్గదర్శకాలు జారి చేశారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి మండలంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని, ఫీల్డ్ స్థాయి సిబ్బంది సక్రమంగా మార్గదర్శకాలను అనుసరించాలని ఆదేశించారు. కాగా.. స్నేహ సమ్మర్ క్యాంపుల ద్వారా బాలికల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించి, సమాజంలో సురక్షితమైన, సమాన అవకాశాలు కలిగిన వాతావరణాన్ని సృష్టించడమే లక ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

సమాజంలో బాలికలు ఆత్మవిశ్వాసంతో ఎదగడానికి ఇటువంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాలికల భవిష్యత్తును బలోపేతం చేయడం



ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, విద్య, పోలిస్, పంచాయతీరాజ్, మహిళాశిశు సంక్షేమశాఖల సమిష్టి కృషితో ఈ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

**మంత్రి సీతక్కకు ఉత్తమ సేవా పురస్కారం..**
**అందజేసిన మాజి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క శ్రీనివాస రామానుజన్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మంత్రి సీతక్కకు పురస్కారాన్ని అందజేశారు. వేలాది మంది విద్యార్థుల సమక్షంలో మంత్రి సీతక్క ఈ గౌరవాన్ని అందుకోవడం విశేషంగా నిలిచింది. ప్రజాసేవలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం మంత్రి సీతక్క అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొని మంత్రి సీతక్క సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడ గౌరవంగా భావిస్తున్నానని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజాసేవలో సుదీర్ఘ అనుభవం కలిగిన వెంకయ్యానాయుడు గారంటే అందరికీ గౌరవమని, ఆయన సూచనలు దేశానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సాధనతోనే విజయాలు సాధ్యమని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని కృషి చేయాలని సూచించారు. పదో తరగతితో చదువు ఆపిన తాను తరువాత మళ్లీ విద్యను కొనసాగించి ఎల్.ఎల్.బి, ఎల్.ఎల్.ఎం, పీహెచ్‌డీ పూర్తి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖతోపాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

## సురేష్ కత్రావత్ ఆత్మహత్యపై సిబిసిఐడిచే విచారణ జరిపించాలి

**పౌర హక్కుల సంఘం డిమాండ్**

**సైఫాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ఉస్మానియా ఆసుపత్రిలో పిజి విద్యార్థి డాక్టర్ సురేష్ కత్రావత్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సిబిసిఐడిచే విచారణ జరిపించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు మాట్లాడుతూ సురేష్ కత్రావత్ ఆత్మహత్యకు కారణమైన వారిపైన కఠినంగా చర్యలు తీసుకోవాలని, ఎన్ఎంసి నిబంధనలు వైద్య వృత్తికి ప్రతిబంధకమైతే వాటిని వెంటనే మార్చాలని కోరారు. ఇటీవల తమ సంఘం సభ్యులు ఒక నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి ఉస్మానియా మెడికల్ కాలేజీని సందర్శించి సురేష్ ఆత్మహత్యపై నిజ నిర్ధారణ చేపట్టడం జరిగిందన్నారు. ఎస్టీ రిజర్వేషన్ కోటాలో ఫ్రీ సీటు సంపాదించుకున్న సురేష్ కత్రావత్‌పై సినీయర్స్ పనిభారం పెంచడం, హేళనగా చూడటం వల్లనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. అతను ఆత్మహత్య చేసుకోవడానికి బలమైన కారణం ఆదేనని తామ భావిస్తున్నామన్నారు. ఎన్ఎంసి ద్వారా వచ్చిన పిజి సీటును వదులుకోవడం వల్ల 50 లక్షలు కట్టాలని మూడేళ్ళవరకు పిజికి అర్హుడు కాదనే నిబంధనలు ఒక వైపు కారణమని స్టాఫ్ చెపుతున్నారని వారన్నారు. అతను ఫ్రీ సీటు తెచ్చుకున్నందుకే కొనసాగిన హేళన, వివక్ష, ఒతి ్తడుల మూలంగానే ఆత్మహత్య చేసుకున్నారని తమ సంఘం భావిస్తున్నదన్నారు. ఈ సమావేశంలో సురేష్ తల్లి నాగమణి కత్రావత్, సంఘం నాయకులు పి.శ్యామలరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పశు సంవర్ధకశాఖ ఉద్యోగులుగా గుర్తించండి

**- రాష్ట్ర ప్రభుత్వానికి గోపాలమిత్రల వినతి**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** పశుసంవర్ధకశాఖ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని గోపాలమిత్రలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఇలంబర్తికి గోపాలమిత్రల అసోసియేషన్ వినతిపత్రం సమర్పించింది. జివో 89కి సవరణ చేసి పశు సంవర్ధకశాఖ ఏఐ టెక్నిషియన్‌గా గోపాలమిత్రలను గుర్తించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సింగరాజు, చెరుకు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వెంకన్న కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా దశాబ్దాలుగా 1530 మంది గోపాల మిత్రలు పశుసంవర్ధకశాఖలో సేవలందిస్తున్నా ఇప్పటి వరకు కనీసం వేతనం చెల్లించడం లేదని, కనీసం ఆరోగ్య బీమా సదుపాయం కూడా కల్పించడం లేదని వినతిపత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. చాలిచాలని జీతాలతో గోపాలమిత్రల కుటుంబాలు పూట గడవలేని స్థితిలో ఉన్నాయని విన్నవించారు. విధి నిర్వహణలో చనిపోయిన గోపాలమిత్రల కుటుంబాలను ఆదుకుని కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

…………………………………

## పెట్రో, డీజిల్ సరఫరాపై పకడ్బందీ నిఘా

**-కొరత లేకుండా ప్రత్యేక చర్యలు**
**-అవసరం లేకున్నా కొనుగోలు చేయొద్దు**
**- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** పెట్రోల్ , డిజీల్ సరఫరాపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజలు పెట్రోల్, డీజిల్ సరఫరాపై ఆందోళన చెందవద్దని సూచించారు. రాష్ట్రంలో కావాల్సినంత ఇందనం అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ధరలు పెరుగుతాయనే వదంతుల నేపథ్యంలో ప్రజలు అవసరానికి మించి ఇందనాన్ని నిల్వ చేసుకుంటున్నారని, దాంతో బంకుల వద్ద భారీగా రద్దీ నెలకొంటుందని చెప్పారు. వదంతులను నమ్మి ఆందోళన చెందొద్దని ప్రజలకు సూచించారు. ఆందోళన చెంది అవసరానికి మించి ఎక్కువ ఇందనాన్ని నిల్వ చేసుకోవడం వల్ల పలు బంకుల్లో నో స్టాక్ బోర్డులు వేలిసినట్లు మంత్రి ఉత్తమ్ చెప్పారు. అయితే పరిస్థితిని చక్కదిద్దుతున్నట్లు తెలిపారు. ఇందన సరఫరాను సాధారణ స్థాయి కంటే 126 శాతం పెంచినట్లు ప్రకటించారు. సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1967ను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. అంతరాష్ట్ర సరిహద్దుల్లో నిఘా ఉంచామన్నారు. జిల్లాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ అవసరాలకు డీజిల్ సరఫరా చేస్తామని హామి ఇచ్చారు.

## ఉచిత విద్యుత్ డిస్కంకు కొత్త రిక్రూట్ చేయాలి

**ఇప్పటికే సిబ్బంది కొరతతో పంపిణీ సంస్థలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** ఇప్పటికే పదవీ విరమణ, మరణాల కారణంగా సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న దక్షిణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల నుండి 2 వేల మంది సిబ్బందిని మూడో కొత్త ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు బదిలీ చేయాలనే నిర్ణయాన్ని ఉద్యోగవర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో పనిచేస్తున్న వారిలో 1,000 మంది అధికారులు, మరో 1,000 మంది కార్మికులను కొత్తగా ఏర్పాటు చేసిన ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు బదిలీ చేయడం వల్ల వాటి పరిస్థితి మరింత దిగజార్చుతుందని పలువురు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

పంట భూములకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం పరిమిత సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను నడపడం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. మరోపక్క సమన్వయ లోపాల కారణంగా వినియోగదారులకు అసౌకర్యం కలిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

ప్రస్తుతం ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థలు ఖాళీగా ఉన్న పోస్టులతో సతమతమవుతుండగా, ఇదే సమయంలో కొత్త సబ్‌స్టేషన్లకు ఆపరేటర్లు లేరని, ఇందువల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అంటున్నారు. కొత్త ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు కావాల్సిన అధికారులు, సిబ్బందిని కొత్తగా నియామకం చేపట్టినట్లయితే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఇప్పటికే ఉన్న పంపిణీ సంస్థల్లో కొరత మరింత తీవ్రతరం కాకుండా నిరోధించవచ్చని స్పష్టం చేస్తున్నారు,

**వ్యవసాయ విశ్వ విద్యాలయంలో**

# హార్టికల్చర్ కోర్సులు వద్దు

**వర్సిటి విద్యార్థుల నిరసన**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో హార్టికల్చర్ కోర్సుల నిర్వహణకు ప్రత్యేకంగా యూనివర్సిటీ ఉండగా అదనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోనూ ఉద్యాన కోర్సులకు సీట్లు కేటాయించడం సరైన నిర్ణయం కాదని విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు. ఈచర్యలతో హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రాముఖ్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజి తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటిలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరంనుంచి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో 30 బిఎస్సి హార్టికల్చర్ సీట్లు, 8 ఎంఎస్సి సీట్లు కేటాయించే ప్రతిపాదనలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల అవకాశాలు తగ్గిపోతాయని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని విద్యార్థి నాయకులు హెచ్చరించారు. హార్టికల్చర్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించిసముచిత నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో రెసోనెన్స్ అద్భుత ప్రతిభ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 29:** తెలంగాణ ఎస్ఎస్‌సి- 2026 ఫలితాలలో రెసోనెన్స్ స్కూల్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ప్రతి నలుగురిలో ముగ్గురు 500 పైగా మార్కులు సాధించడం విశేషం. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ సందర్భంగా మాదాపూర్ లో ఉన్న ఆశ్రయ కన్వెన్షన్ లో పదో తరగతి ఫలితాల విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావు నర్రా మాట్లాడుతూ.. తెలంగాణ ఎస్ఎస్‌సి ఫలితాలు 2026లో మా విద్యార్థులు సాధించిన విజయంపై మాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ముఖ్యంగా ప్రతి నలుగురిలో ముగ్గురు 500 పైగా మార్కులు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇది విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనమన్నారు. తల్లిదండ్రుల విశ్వాసం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. మాధాపూర్, పటాన్‌చెరువులోని క్యాంపస్‌లు గత కొన్ని సంవత్సరాల మాదిరిగానే ఈసారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. నగరవ్యాప్తంగా మరింత మందికి అందుబాటులో ఉండేలా మా స్కూల్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తొమ్మిది మంది విద్యార్థులు 580 మార్కులు, అంతకంటే ఎక్కువ సాధించారు. 47 మంది విద్యార్థులు 550 నుంచి 579 మార్కుల మధ్య సాధించారు. 60 మంది విద్యార్థులు 500 నుంచి 549 మార్కుల మధ్య సాధించారు. మొత్తం విద్యార్థుల్లో 71 శాతం మంది 500కు పైగా మార్కులు సాధించారు. మొత్తం విద్యార్థుల్లో 93 శాతం మంది 450కు పైగా మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన వారు.. సుస్మితా సింగ్ 587/600, గడ్డే ప్రజున్ 586/600,జీ వేద సమ్విత 585/600 కే సహస్ర 585/600, దేవహర్ష బమ్మిడి 584/600, ఏ ధాన్వి 583/600, కూర రాంసాయి రిషిత్ రెడ్డి 580/600, బండి ఆశ్రిత్ రామ్ 580/600, అన్విత రెడ్డి 580/600.

## బరోడా బ్యాంక్ జోనల్ హెడ్‌గా సుధాకర్ బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** బ్యాంక్ ఆఫ్ బరోడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి జోనల్ హెడ్‌గా ఎంవీఎస్ సుధాకార్ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని జోనల్ కార్యాలయానికి జనరల్ మేనేజర్‌గా సుధాకర్‌ను నియమించింది. దీంతో ఆయన బుధవారం కార్యకలాపాలను ప్రారంభిచారు. కాగా సుధాకర్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్‌లలో 30 సంవత్సరాలకు పైగా విస్తారమైన బ్యాంకింగ్ అనుభవం ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా నిబంధనల పాటింపుతో కూడిన వ్యాపారం, శాఖల విస్తరణ, డిజిటల్ బ్యాంకింగ్, ఇంకా రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ రంగాలను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా సుధాకర్ తెలిపారు.

## టిజి20 క్రికెట్ లీగ్ లోగో ఆవిష్కణ

**హైదరాబాద్, ఏప్రిల్ 29,ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, టిజి20 గవర్నింగ్ కౌన్సిల్ సహకారంతో, తెలంగాణ క్రికెట్ వ్యవస్థను రూపాంతరం చెందించే లక్ష ్యంతో హెచ్‌సిఏ టిజి20 అనే కీలకమైన లీగ్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈమేరకు బుధవారం పార్కుహయత్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లీగ్ లోగోను తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్, అంబటి రాయుడు, హీరో వెంకటేష్ దగ్గుబాటి, సంగీత దర్శకుడు ఎస్. తమన్, హెచ్.సి.ఏ. సింగిల్ మెంబర్ సూపర్వైజరీ కమిటీ ఛైర్మన్ న్యాయమూర్తి పి. నవీన్ రావు (విరమణ) అలాగే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అదనంగా బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వి. చాముండేశ్వర నాథ్, మాజీ బీసీసీఐ అధ్యక్షుడు శివలాల్ యాదవ్, మాజీ అంతర్జాతీయ క్రికెటర్లు, హెచ్.సి.ఏ. అపెక్స్ కౌన్సిల్ సభ్యులు, టిజి20 గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, మాజీ క్రికెటర్లు, ప్రస్తుత హెచ్.సి.ఏ. రంజీ ఆటగాళ్లు హాజరయ్యారు.

# తేజస్వి మాటలపై పార్లమెంట్‌లో అగ్గిలేపింది కాంగ్రెస్ ఎంపీలే

**ఆయన వ్యాఖ్యలను సమర్థించిన బిజెపి వాళ్లను ఎందుకు అనలేదు?**

**బిజెపి,బిఆర్ఎస్‌కు అంతర్గతంగా రహస్య ఒప్పందం ఉందని తేలింది**

**కాంగ్రెస్ ఎంపీలపై వ్యాఖ్యలు సరికాదు, కెసిఆర్...నిజాలు తెలుసుకో**

**తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్ డాక్టర్ మల్లు రవి ఆగ్రహం**



**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ ఇష్టం వచ్చినట్టుగా కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీల్ని అవమాన పరుస్తూ మాట్లాడటం సహేతుకం కాదని తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్ డాక్టర్ మల్లు రవి ఆగ్రహంవ్యక్తం చేశారు. బీజేపీ తేజస్వి సూర్య, పార్లమెంట్లో మాట్లాడుతూ... తెలంగాణ- ఆంధ్ర విభజనను బ్రిటీషర్లు ఇండియా-పాకిస్థాన్ విడగొట్టిన విధానంతో పోల్చారని,.ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఇండైరెక్ట్‌గా మన్మోహన్ సింగ్‌ని, సోనియా గాంధీని నిందిస్తూ మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాట్లాడేటప్పుడే పార్లమెంట్లో తాను తెలంగాణ ఎంపీల కన్వీనర్‌గా, తెలంగాణ ఎంపీగా దాన్ని అడ్డుకొని... ఆ మాట ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశామని, ఆయన నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల్ని అవమాన పరుస్తూ మాట్లాడటాన్ని తప్పుపట్టినట్లు పేర్కొన్నారు.ఆ రోజునే ప్రధాని మన్మోహన్ సింగ్ గురించి, సోనియా గాంధీ గారి గురించి తాను సభలోనే చెప్పినట్టు వివరించారు. తాను మాట్లాడిన వెంటనే కిషన్ రెడ్డి లేసి, తేజస్వి సూర్య మాట్లాడిన దాన్ని సపోర్ట్ చేస్తూ మాట్లాడారని విమర్శించారు. అప్పుడు తాము... "మీరు ఒక తెలంగాణ ఎంపీగా, మినిస్టర్ గా ఉండి ఆయన మాట్లాడిన దాన్ని ఖండించకపోగా, మీరు దాన్ని సపోర్ట్ చేస్తూ మాట్లాడారు. ఆయన కూడా క్షమాపణ చెప్పాలి, తేజస్వి సూర్య కూడా క్షమాపణ చెప్పాలి" అని హౌస్ లో మాట్లాడినట్టు గుర్తు చేశారు. అది రికార్డుల్లో కూడా ఉందన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్యకి అవకాశం వచ్చినప్పుడు... ఆమె కూడా ఈ అంశాన్ని తీవ్రంగా ఖండించారని చెప్పారు. అదే విధంగా ఎంపీ చామల కిరణ్ రెడ్డి గారు కూడా ఖండిస్తూ ప్రసంగించారన్నారు. మొత్తం ఎనిమిది మంది ఎంపీలం తేజస్వీ సూర్య మాట్లాడిన దానికి నిరసన తెలియజేస్తూ... మెయిన్ గేట్ వద్ద పార్లమెంట్ లోపల తాము ఎనిమిది మంది ఎంపీలం కూర్చొని 10 గంటల నుంచి 10:45 వరకు ధర్నా చేశామన్నారు. తేజస్వి సూర్య క్షమాపణ చెప్పాలి, అదే రకంగా కిషన్ రెడ్డి కూడా క్షమాపణ చెప్పాలని మేము స్లోగన్స్ ఇచ్చి... దాదాపు 45 నిమిషాలు ఫ్లెక్సీలు ప్రదర్శించి ఉద్యమించినట్టు వివరించారు. అంతేగాక తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్రం మీద "పాకిస్తాన్ ఇండియా లాగా విడిపోయినయిట్లుగా" అనే మాటని రికార్డు నుంచి తొలగించాలని స్పీకర్ ఓంబిర్లాకు లేఖ కూడా ఇచ్చినట్టు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ వెధవలు అడ్డుకోలేదని కేసీఆర్ మాట్లాడటం సరికా దన్నారు. ఇవన్నీ తెలుసుకోకుండా మాట్లాడినటువంటి కేసీఆర్ ని ఏమనాలో ప్రజల విజ్ఞతకే వదిలి పెడుతున్నామన్నారు. తేజస్వీ సూర్య మాటలను సమర్థించిన బిజెపి పార్టీని గాని, కిషన్ రెడ్డిని గాని పల్లెత్తు మాట కేసీఆర్ ఎందుకు అనలేదో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీని... తెలంగాణ తరపున మాట్లాడి, ధర్నా చేసి, నిరసన తెలియజేసి, ఆ రికార్డు నుంచి ఆ పేరు తీసేయడానికి పనిచేసిన ఎంపీలను వెధవలని తిట్టడటం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తేజస్వి సూర్య మాట్లాడిన దాంట్లో తప్పు లేదని సమర్థిస్తూ తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీ, తెలంగాణ నుంచి మినిస్టర్ గా ఉన్న ఎంపీ మాట్లాడిన వ్యక్తి మీద... పల్లెత్తు మాట మాట్లాడలేదంటే వారికి బిజెపీకి, బిఆర్ఎస్ కి అంతర్గతంగా రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. వారు ఇద్దరూ కలిసే పని చేస్తున్నా రన్నారు. ఇప్పటికైనా రికార్డు తెప్పించుకొని చూడాలన్నారు. కిషన్ రెడ్డి మాట్లాడిన మాటలు, ఆ తేజస్వి సూర్యకి సపోర్ట్ చేసి చేసిన మాటలను చూసి ఖండించాలని సూచించారు. పార్లమెంటరీ డెమొక్రసీలో ఏ రకంగా నిరసన తెలియజేయాలో, ఏ రకంగా పార్లమెంట్ వేదికగా మాట్లాడాలన్నది తమకు తెలుసన్నారు.'బీఆర్ఎస్ ఎంపీలు ఉంటే రణరంగం చేసేవాళ్లు అంటే... ఏ రణరంగం చేస్తారు మీరు? అసలు మీ రణరంగం అని చెప్పే మాట వల్ల, మీరు కాంగ్రెస్ ని వెధవలని తిట్టడం వల్ల మీకు బుద్ధి తెచ్చే విధంగా తెలంగాణ ప్రజలు 2023లో మిమ్మల్ని పదవి నుంచి దించారని వ్యాఖ్యానించారు.

# ఉద్యోగుల బయిలు రూ.వెయ్యి కోట్లు విడుదల

**రూ.700 కోట్ల నుండి రూ.వెయ్యి కోట్లకు పెరిగిన చెల్లింపులు**



**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర సర్కార్ మరో కీలక ముందడుగు వేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు, ఉద్యోగుల పెం డింగ్ బకాయిల కోసం రూ.1000 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా బుధవారం నిధుల విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గత ఏడాది ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల సందర్భంగా ప్రభుత్వం నెలకు రూ..700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారంగా మార్చి 2026 వరకు ప్రతినెల ఉద్యోగులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం అమలు చేసింది.

అయితే, ఉద్యోగుల ఆర్థిక అవసరాలను, వారు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ మొత్తాన్ని రూ.1000 కోట్లకు పెంచాలని నిర్ణయించింది.ఇందులో భాగంగానే ఈ నెలకు సంబంధించిన రూ.వెయ్యి కోట్లను విడుదల చేయడం ప్రారంభించారు. ఇదే సమయంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అత్యంత సానుకూలంగా స్పందించింది. అక్టోబర్ 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జిపిఎఫ్ బకాయిలన్నింటినీ పూర్తిగా క్లియర్ చేశారు. తమ పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరటనిచ్చే అంశం. ఉద్యోగుల ఆరోగ్య అవసరాలకు సంబంధించి మెడికల్ బిల్లులను ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా, ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు చెల్లించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం మెడికల్ బిల్లుల చెల్లింపులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని డిప్యూటీ సీఎం కార్యాలయం వెల్లడించింది.

**మెడికల్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లకూ మోక్షం**

ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడకూడదని ప్రభుత్వం నిర్ణయించింది.

ఒక్క రోజు కూడా జాప్యం లేకుండా మెడికల్ బిల్లుల చెల్లింపులు రెగ్యులర్‌గా జరిగేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగ స్వాములు. వారి సమస్యలను పరిష్కరించడం మా బాధ్యత అనే నినాదంతో సర్కార్ ముందుకు వెళ్తోంది. పెంచిన నిధులు, క్లియర్ అయిన జిపిఎఫ్ బకాయిలు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని హాల్ టికెట్లు ఆపితే కఠిన చర్యలు

**నిబంధనలను తప్పకుండా అమలు చేయాలి**

**ప్రైవేటు కాలేజీలకు ఉన్నత విద్యా మండలి హెచ్చరిక**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 29:** రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు కాలేజీలు ఫీజురీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం నుంచి రాలేదని విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు రాయడానికి హాల్ టికెట్లను ఇవ్వకుండా నిరాకరిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఉన్నత విద్యా మండలి హెచ్చరించింది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని చెప్పి కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా, పరీక్షలకు హాజరుకావడాన్ని అడ్డుకుంటున్నాయని ఉన్నత విద్యా మండలి బుధవారం జారీ చేసిన ప్రకటనలో పేర్కొంది. అనుమతులు లేని (అనధికార) కాలేజీలు ఎలాంటి గుర్తింపు లేకుండానే వివిధ కోర్సుల్లో అడ్మిషన్లను కల్పిస్తున్నాయని తెలిపింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదనే కారణంతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకపోవడం, పరీక్షలకు అడ్డుకోవడం పూర్తిగా తప్పని, ఇది నిబంధనలకు విరుద్ధమని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు కాలేజీలు వెంటనే జాగ్రత్త వహించాలని, ఏ విద్యార్థినైనా పరీక్షలు రాయకుండా ఆపకూడదని, ఇలా చేస్తే సంబంధిత కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అడ్మిషన్ తీసుకునే ముందు ఆ కాలేజీ ప్రభుత్వం నుంచి యూనివర్సిటీ నుంచి సంబంధిత సంస్థల గుర్తింపు ఉందో, లేదో తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. అనుమతులు లేని కాలేజీల్లో తీసుకున్న అడ్మిషనక్లు పూర్తిగా విద్యార్థులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, అటువంటి కాలేజీలు ఇచ్చే డిగ్రీలు, సర్టిఫికెట్లు ఉద్యోగం, పై చదువులు, స్కాలర్‌షిప్‌లకు చెల్లుబాటు కాకపోవచ్చని తెలిపారు. ఇటువంటి తప్పులు చేసే కాలేజీలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పుడు ప్రకటనలు, మోసపూరిత హామీలకు మోసపోవద్దని వారు ప్రకటనలో సూచించారు.

**ప్రభుత్వ విభాగాల పనితీరు మెరుగుపడేందుకు**

## విజిలెన్స్ శాఖ ఆన్‌లైన్ పోర్టల్ ఆవిష్కరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** ప్రభుత్వ విభాగాల్లో అంతర్గత సామర్థ్యం పెంపొందించేందుకు, సాటి విభాగాలతో సమన్వయంగా మెలిగేందుకు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కొత్తగా ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డి జి శిఖా గోయల్ బుధవారం బిఆర్‌కె భవన్‌లో గల తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిఖా గోయల్ మాట్లాడుతూ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ప్రభుత్వ విభాగాల్లో అంతర్గత విజిలెన్స్ నివేదికలకు సకాలంలో స్పందనలు లభిస్తాయని అన్నారు. దీంతో పాటు ఆయా విభాగాల పనితీరు మరింత మెరుగు పడుతుందని, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనేది అధికారులు, సిబ్బంది సులభంగా తెలుసుకునేందుకు వీలుంటుందని ఆమె తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిని గుర్తించేందుకు వీలుగా కొత్తగా రూపొందించిన జాకెట్‌ను శిఖా గోయల్ ఈ సంద ర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ నెలకు సంబంధించి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆయా విభాగాలలో చేబట్టిన తనిఖీ ల వివరాలను డిజి శిఖా గోయల్‌కు డైరక్టర్ ఏ.ఆర్ శ్రీనివాస్ అందించారు. ఈ నెలలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు మంజీర నదిలీ తవ్వకాలను నిరోధించామని ఏ.ఆర్ శ్రీనివా స్ తెలిపారు. 115 మెట్రిక్ టన్నుల ఇసుకను జప్తు చేయడంతో పాటు తొమ్మిది వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, నలుగురిని అరెస్టు చేశామని ఆయన తెలిపారు. దీంతో పాటు అటవీ, పౌర సరఫరాలు, మైనింగ్, గనులు, రవాణా శాఖల్లోనూ తనిఖీలు నిర్వహించి, అక్కడ జరుగుతున్న అక్రమాలను రట్టు చేశామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిఐజి అభిషేక్ మొ హంతితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గాల స్వయం ఉపాధికి 80 వేల దరఖాస్తులు

**మంజూరు కానున్న యూనిట్లు మాత్రం 10,497**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వయం ఉపాధి పథకాలకు యువత నుండి భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. పైలెట్ ప్రాజెక్టు కింద 10 వేల మందికి ఆయా పథకాలు అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.219 కోట్లు కేటాయించింది. సాంఘిక సంక్షేమ శాఖ అధికవర్గాల వివరాల ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా వివిధ స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి మొత్తం 10,497 యూనిట్లను పంపిణీ చేయాలని అధికారులు నిర్ధేశించారు. ఇందు కోసం ఎస్సీ యువత నుండి దరఖాస్తులను అహ్వానించారు. ఈ నేపథ్యంలో స్వయం ఉపాధి యూనిట్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 80,087 మంది యువతీ, యువకులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ స్వయం ఉపాధి పథకాల యూనట్లలో భాగంగా ఎలక్ట్రిక్ బైక్‌ల కోసం రాష్ట్రం మొత్తం మీద 5,016 యూనిట్లు అందుబాటులో ఉండగా, ఇందుకు గాను 30వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో పాటు, ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల కోసం కూడా గట్టి పోటీ నెలకొంది. ఈ ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల నిమిత్తం 2500 యూనిట్లకు గాను సుమారు 35వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే, గేదెల యూనిట్‌కు ధర రూ.2.40 లక్షలు ఉండగా, ఇందులో 70శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఈ గేదెల యూనిట్ల కోసం కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన చూస్తే స్వయం ఉపాధి పథకాలకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఒక్కో యూనిట్ కోసం సగటున 8 మంది పోటీపడుతుండటం విశేషం. కాగా దరఖాస్తుల ప్రక్రియ పూర్తి కావడంతో లబ్ధిదారుల ఎంపికపై సాంఘిక సంక్షేమ శాఖ అధికార యంత్రాంగం దృష్టి సారించింది. మండల స్థాయి అధికారుల పరిశీలన అనంతరం అర్హుల జాబితాను కలెక్టర్ల ద్వారా హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి పంపనున్నారు. ఎంపికైన లబ్ధిదారులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున మంజూరు పత్రాల పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

## జీడీపీ నుండి ఉత్పాదకత వైపు దృష్టి

**నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** సమ్మిళిత, సరళేతర మరియు ఉత్పాదకత ఆధారిత వృద్ధికి చోదకంగా దేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయాణంలో తదుపరి దశను నిర్దేశించే వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను నీతి ఆయోగ్ ప్రారంభించింది. నీతి ఆయోగ్ సీఈఓ నిధి చిబ్బర్ సమక్షంలో వైస్ చైర్మన్ సుమన్ బెరీ ఈ రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. ఈ రోడ్‌మ్యాప్ దేశ డిజిటల్ పరివర్తన కోసం రెండు దశల మార్గాన్ని నిర్దేశిస్తోంది. పెద్ద ఎత్తున జీవనోపాధి ఆధారిత వృద్ధిని సాధించడానికి డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) 2025-2035, ఆ తర్వాత విస్తృత ఆధారిత శ్రేయస్సును సాధించడానికి 2035-2047 వరకూ అమలు చేయనుంది.

ఈ సందర్భంగా నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ మాట్లాడుతూ, దృష్టి జీడీపీ నుండి ఉత్పాదకత వైపు మళ్లిందన్నారు. అధిక నాణ్యత గల ఉపాధి, బలమైన ఆదాయాలు మరియు మెరుగైన జీవన ప్రమాణాలు పెరుగుతున్న ఉత్పాదకతపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. దేశం ఈ స్థాయికి చేరుకోవడానికి నెట్‌వర్క్‌లను సద్వినియోగం చేసుకోవడమే అని ఈ రోడ్‌మ్యాప్ ఆ మార్పును స్పష్టం చేస్తుందన్నారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్, డిపిఐ లను కేంద్ర స్థానంలో నిలిపి, వికసిత్ భారత్ 2047కు పునాది వేయడంలో సహాయపడటం ద్వారా, అభివృద్ధి యొక్క తదుపరి దశ రూపుదిద్దుకుంటుందని వివరించారు.

రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందితే, దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాల సమ్మిళిత వృద్ధిని వేగవంతం చేయడంలో డిపిఐ ఒక ముఖ్యమైన సాధనంగా మారగలదని స్పష్టం చేశారు. అత్యాధునిక సాంకేతికతలను పటిష్టమైన శాస్త్రీయ పద్ధతులు మరియు రక్షణలతో అనుసంధానించాలన్నారు. దేశం తన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే శక్తివంతమైన నిర్మాణాత్మక ప్రయోజనంతో ఈ తదుపరి దశలోకి ప్రవేశిస్తోందని వెల్లడిం చారు. డీపీఐ, ఏఐ, వ్యవస్థాపకతను కలపడం ద్వారా, భారతదేశం జీవితాలను మెరుగుపరిచే, జీవనోపాధిని బలోపేతం, కీలక రంగాలలో ఉత్పాదకతను పెంచే సమ్మిళిత, స్థానిక, జనాభా స్థాయి ఏఐ స్వీకరణ నమూనాను నిర్మించగలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, ముఖ్య ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ విశిష్ట ఫెలో శ్రీమతి దేబ్జానీ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నాగర్ కర్నూల్ రెండో స్థానం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నాగర్కర్నూల్ జిల్లా రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. మొత్తం 10641 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 10538 మంది విద్యార్థులు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు. ఓవరాల్‌గా 99.03 పాస్ పర్సంటేజీ తో రాష్ట్రంలో రెండో స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా నిలిచింది. 5192 మంది బాలురు 5346 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించగా, 99.31 ఉత్తీర్ణత శాతంతో బాలికలు పై చేయి అందుకున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో 14వ స్థానంలో నారాయణపేట జిల్లా, 19వ స్థానంలో వనపర్తి జిల్లా, 26వ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, 29వ స్థానంలో జోగులాంబ గద్వాల జిల్లా నిలిచాయి.

## నేటి నుంచి దోస్త్-2026 వెబ్ ఆప్షన్లు

**ఇంకా పూర్తికాని యూనివర్శిటీల అనుబంధ గుర్తింపు ప్రక్రియ**

**నేడు, రేపో కాలేజీల లిస్టు ప్రకటించే అవకాశం**

**ఇప్పటి వరకు సుమారు 70వేల మంది రిజిస్ట్రేషన్**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 29:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2026లో భాగంగా నేటి(గురువారం) నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే యూనివర్సిటీలు ఇప్పటి వరకు తమ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు ఇవ్వాల్సిన అనుబంధ గుర్తింపును ఇంకా పూర్తి చేయలేదు. ఉన్నత విద్యా మండలి కొత్త కోర్సులను ప్రవేశ పెట్టిన నేపథ్యంలో కొత్త కోర్సులను తమ కాలేజీల్లో కొనసాగించాలని కోరుకున్న కాలేజీలకు ఇప్పటి వరకు తనిఖీలు పూర్తి చేసి అనుబంధ గుర్తింపు ఇవ్వడంలో ఆలస్యమవుతోంది. రాష్ట్రంలోని 6 సాంప్రదాయక డిగ్రీ కోర్సులను అందిస్తున్న యూనివర్సిటీల్లో ఎక్కువ అనుబంధ కాలేజీలు ఉస్మానియా, కాకతీయ, మహాత్మాగాంధీ యూనివర్సిటీల పరిధిలో ఉన్నాయి. వీటితోపాటు మిగిలిన యూనివర్సిటీల్లోనూ ప్రైవేటు కాలేజీలకు అనుబంద గుర్తింపు ఇవ్వడం కోసం తనిఖీల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ప్రధానంగా కోర్సు కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న కాలేజీలు, కొత్త కోర్సులను ప్రారంభించాలనుకున్న కాలేజీల తనిఖీల్లో ఆలస్యమవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అనుబంధగుర్తింపు ఆలస్యం అవుతుందని.. నేడు, రేపటిలోగా కాలేజీల వివరాలను అందుబాటులోకి తీసుకొస్తామని యూనివర్సిటీలు చెబుతున్నాయి. అయితే వెబ్ ఆప్షన్లు నేటి నుంచి ప్రారంభం అవుతున్నప్పటికీ.. మే 8 వరకు అవకాశం ఉంటుందని విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దోస్త్ నోటిఫికేషన్‌ను ఈ నెల 13న ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ నెల 15 నుంచి విద్యార్థులు రిజిస్ట్రేషన్స్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు సుమారు 70వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలుస్తోంది. ఫేజ్-1 రిజిస్ట్రేషన్లను ఈ నెల 15 నుంచి మే 7వరకు అవకాశమిచ్చారు. అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నేటి(ఏప్రిల్30) నుంచి మే 8 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 14న తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం మే 15 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 15 నుంచి మే 25 వరకు కొనసాగనుంది. రాష్ట్రంలో మొత్తం 969 కాలేజీల్లో 4,40,107 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

## మే 21 నుండి సరస్వతీ అంత్య పుష్కరాలు

**-అన్నిశాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి**

**- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ**

**పది రోజుల ముందే ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలి**

**- మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** సరస్వతీ అంత్య పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో ఐటీ, పరిశ్రమలశాఖమంత్రి శ్రీధర్‌బాబు తో కలసి సరస్వతి అంత్య పుష్కరాలు పోస్టర్, అధికారిక టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... ఈ సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పుష్కరాలకు రూ. 30.63 కోట్లతో 162 అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో భక్తులు పుష్కర స్నానం, స్వామి దర్శనం చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. అంత్య పుష్కరాలకు 30 లక్షల భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సరస్వతి నది పుష్కరాలతోపాటు సమ్మక సారలమ్మ జాతరను అత్యంత ఘనంగా నిర్వహించామని చెప్పారు. ప్రస్తుతం సరస్వతి అంత్య పుష్కరాలు, వచ్చే సంవత్సరం రానున్న గోదావరి పుష్కరాలకు కూడా పనులను కూడా ప్రారంభించామని తెలిపారు.

అనంతరం.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పది రోజుల ముందే పుష్కరాల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య కలగకుండా పోలీసు యంత్రాంగం, ఇతర శాఖల సమన్వయంతో పని చేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి పుష్కరాలను విజయవంతం చేయాలని కోరారు. కాళేశ్వరం దేవస్థానం పునర్నిర్మాణానికి రూ. 198 కోట్లను కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ...పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుష్కరాల మొదటి రోజు ఉదయం 5 గంటల 43 నిమిషాలకు ప్రారంభ పుష్కర స్నానాన్ని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజేంద్ర సరస్వతీ స్వామి చేస్తారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్‌ను ఆహ్వానించామన్నారు. ప్రతి రోజు ఒక పీఠాధిపతి ఉదయం పుష్కర స్నానం చేసే విధంగా ఏర్పాట్లు చేశామని వివరించారు. ప్రతి రోజు త్రివేణి సంగమం వద్ద సాయంత్రం 6.30 ఘనంగా కాశి పండితులు హారతి నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, కాళేశ్వర ఆలయ ట్రస్ట్ చైర్మన్ మోహన్‌శర్మ, దేవాదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌ఎస్ అధికారుల బదిలీ

**12మంది అధికారులకు స్థానచలనం**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అటవీశాఖలోని ఐఎఫ్ఎస్, ఎస్ఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలతోపాటు పోస్టింగ్ ఇచ్చినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అటవీ సంరక్షణాధికారి ఎస్. రమేష్‌ను హైదరాబాద్‌లో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (రిసెర్చ్, డెవలప్మెంట్ సర్కిల్)గా నియమించారు. బి. ప్రవీణను ములుగు ఫారెస్ట్ కాలేజ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డీన్‌గా పోస్టింగ్ ఇచ్చారు. సీహెచ్. బాలమణిని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ అధికారిగా బదిలీ చేశారు. బొగా నిఖితను వరంగల్ డిఎఫ్‌వోగా నియమించారు. వికాస్ మీనా ములుగు జిల్లాకు, సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. శివ్ ఆశీష్‌సింగ్ మహబూబ్‌నగర్‌లో, రాహుల్ కిషన్‌జాదవ్ మంచిర్యాలలో పోస్టింగ్ పొందారు. అనుజ్ అగర్వాల్ ఖమ్మం జిల్లాకు, నీరజ్ కుమార్ తిబ్రేవాల్ కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఎస్. సత్యనారాయణ రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు డిఎఫ్ఒగా నియమితులయ్యారు. జి. జ్ఞానేశ్వర్‌ను హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్సెస్ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

## ముంబయి ఇండియన్స్‌పై ఆరెంజ్ ఆర్మీ జయభేరి

**ఆరు వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్ గెలుపు**

**ముంబయి, ఏప్రిల్ 29:** ఐపిఎల్ సీజన్‌లో వాంఖడే స్టేడియంలో జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన ముంబయి ఇండియన్స్ ఐదు వికెట్ల నష్టానికి 243 పరుగులుచేసి ప్రత్యర్థి సన్‌రైజర్స్‌కు 244 పరుగుల లక్ష్యం విధించింది.

తదనంతరం బ్యాటింగ్‌చేపట్టిన ఆరెంజ్ ఆర్మీ పరుగులతో దుమ్ము దులిపింది. ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో ముంబయి ఇండియన్స్‌పై విజయంసాధించింది. నాలుగు వికెట్ల నష్టానికి 249 పరుగులుచేసి లక్ష్యం సునాయాసంగా ఛేదించింది. ట్రావిస్ హెడ్ 76, క్లాసెన్ 65 పరుగులతో అదరగొట్టారు. అభిషేక్‌శర్మ 45, నితీష్‌కుమార్‌రెడ్డి 21 పరుగులతో పర్వాలేదనిపించారు. ఇషాన్‌కిషన్ డకౌట్ కాగా సలీల్ అరోరా 30 పరుగులతో చివరిలో వేగంగా పరుగులు సాధించాడు. అంతకుముందు ముంబయి బ్యాటింగ్‌లో ర్యాన్ రికెల్టన్ కేవలం 55 బంతుల్లో పది ఫోర్లు, 8 ఇక్సులతో 223 స్ట్రైక్‌రేట్‌తో 123పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆతడికి తోడుగా విల్‌జాక్స్ 22 బంతుల్లో 46 పరుగులుచేసి మంచి ఓపెనింగ్ ఇచ్చాడు. మధ్యలో సూర్యకుమార్‌యాదవ్ సత్వరమే ఔట్ అయినా నామన్‌ధీర్ 22 పరుగులుచేసి ఇన్నింగ్స్ ర్యాలీ తీసాడు. ఇక కెప్టెన్ హార్ధిక్ పాండ్య 15 బంతుల్లో 31 పరుగులతో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. బౌలర్లపరంగా ప్రఫుల్ హింగే 4 వోర్లలో 54 పరుగులిచ్చి రెండు వికెట్లు తీసాడు. ఇషాన్‌మలింగా 4 ఓవర్లలో 29 పరుగుల ఇచ్చి ఒక వికెట్‌తీసాడు. షాకిబ్ హుస్సేన్; నితిష్‌కుమార్‌రెడ్డి తలో వికెట్‌తీసినా పరుగులు కట్టడిచేయలేకపోయారు. కెప్టెన్ ప్యాట్‌కమిన్స్‌కూడా 4 ఓవర్లలో 39 పరుగులు ఇచ్చి వికెట్ తీయలేకపోయాడు.




## అన్ని పంటలు కొనుగోలు చేయాలి

**సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి : హైదరాబాద్, ఏప్రిల్29:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది మరొకటని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చెప్పిన రైతు డిక్లరేషన్ పెద్ద బోగస్ అని ఆరోపించారు. ఈ మేరకు? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుధవారం బహిరంగ లేఖ రాశారు. పంటల కొనుగోళ్లలోనూ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని లేఖలో పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా, ఇంకా కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. 20 రోజులుగా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కేంద్రం కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు పంట పావు వంతు మాత్రమేనని అన్నారు. మిగిలిన 1.20 లక్షల క్వింటాళ్లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఆసుపత్రి ప్రహారీగోడ కూలి ఏడుగురు మృతి

**బెంగళూరులో ఘోర ప్రమాదం**



**బెంగళూరు, ఏప్రిల్ 29:** నగరంలోని బౌరింగ్ అండ్ లేడి కర్జన్ ఆసుపత్రి సమీపంలోని ప్రహారీ గోడ కూలిపోవడంతో ముగ్గురు చిన్నారులు సహా ఏడుగురు చనిపోయిన సంఘటన అందరినీ కలిచివేసింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం సిఎం కార్యాలయం ఏడుగురు చనిపోయినట్లు ప్రకటన విడుదలచేసింది. పోలీస్ కమిషనర్‌తో మాట్లాడానని, పరిస్థితిని అడిగి తెలుసుకున్నామని, ప్రస్తుతం స్పాట్‌కు వెళుతున్నట్లు తెలిపారు. సాధ్యమైనంతగా మృతుల కుటుంబాలకు సాయం అందేటట్లు చూస్తామన్నారు. ఎర్త్‌రిమూవర్‌లతో అత్యవసర పోలీసు సిబ్బంది సంఘటనప్రాంతానికి వెళ్లారు. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు ఈప్రాంతంలో ఎక్కువ కురిసాయి. దీనివల్లనే పాతదయిన ప్రహారీగోడ కూలిపోయినట్లు పోలీసులు చెపుతున్నారు. స్పాట్‌లోనే ఏడుగురు చనిపోయారని తేలింది. మృతులంతా చిరువ్యాపారులేనని పోలీసులు ధృవీకరించారు. ముఖ్యమంత్రి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.



## ఐటిటిఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో
# భారత్ విజయం

**న్యూఢిల్లీ:** ఐటీటీఎఫ్ ప్రపంచ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు ట్యునీషియాను ఓడించింది. భారత పురుషుల టేబుల్ టెన్నిస్ జట్టు లండన్‌లో జరిగిన ఈ ప్రపంచ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో ట్యునీషియాపై 3-0 తేడాతో విజయం సాధించి తమ ప్రయాణాన్ని ప్రారంభించింది. స్టేజ్ 1బిలోని గ్రూప్ 7 పోరులో గుజరాత్‌కు చెందిన మానవ్ థక్కర్, మనుష్ షా, హర్మీత్ దేశాయ్ ముగ్గురూ తమ తమ సింగిల్స్ మ్యాచ్‌లలో విజయం సాధించారు. ఈ పోటీలో ఒక గేమ్ కోల్పోయిన ఏకైక భారత ఆటగాడు షా. అతను ఎస్సిద్ వసీమ్‌ను 3-1 తేడాతో ఓడించాడు. మరోవైపు, ఠక్కర్, దేశాయ్ తమతమ మ్యాచ్‌లను 3-0 తేడాతో గెలుచుకోవడంతో, ఈ టైలో భారత్ ట్యునీషియాను చిత్తుగా ఓడించడంలో సహాయపడింది. అంతకుముందు, ఉగాండా వాకోవర్ ఇవ్వడంతో భారత మహిళల జట్టు 3-0 తేడాతో విజయం సాధించింది. మణికా బాత్రా, యశస్విని ఘోర్పడే, సుతీర్థ ముఖర్జీ, దియా చితాలే, సింగ్రెలా దాస్‌లతో కూడిన భారత జట్టు ఏ మ్యాచ్ ఆడాల్సిన అవసరం రాలేదు. భారత పురుషుల జట్టు తమ రెండవ గ్రూప్ మ్యాచ్‌లో స్లోవేకియాతో తలపడనుండగా, మహిళల జట్టు ఉక్రెయిన్‌తో పోటీపడనుంది.



# మాండ్రిక్ ఓపెన్‌లో సబలెంకాకు పరాభవం
## అత్యంత జూనియర్ హేలీ చేతిలో ఓటమి

**న్యూఢిల్లీ:** మాడ్రిడ్ ఓపెన్ సెమీఫైనల్స్‌లో అమెరికాకు చెందిన హేలీ బాప్టిస్ట్, ప్రపంచ నంబర్ 1 అరీనా సబలెంకాను ఓడించి సంచలనం సృష్టించింది. ఈ మ్యాచ్‌లో 24 ఏళ్ల క్రీడాకారిణి ఒక సెట్ వెనుకబడినప్పటికీ, ఆరు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుంది. చివరకు 2 గంటల 30 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో 2-6, 6-2, 7-6(6) తేడాతో హేలీ విజయం సాధించింది. ఈ గెలుపు ఆమె కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలవడమే కాకుండా, టూర్‌లో సబలెంకా కొనసాగిస్తున్న 15మ్యాచ్‌ల విజయ పరంపరకు కూడా ముగింపు పలికింది. మ్యాచ్ ప్రారంభంలో సబలెంకా పూర్తి నియంత్రణలో కనిపించింది. సర్వ్‌పైనా, బేస్‌లై పైనా తన ఆధిపత్య ప్రదర్శనతో తొలి సెట్‌ను సునాయాసంగా కైవసం చేసుకుంది. టాప్ సీడ్ అయిన ఆమె హేలీ ఆటను శాసించి ఆ సెట్‌ను సునాయాసంగా గెలుచుకుంది. అయితే, రెండవ సెట్‌లో హేలీ తన ఆటతీరును పెంచి, దూకుడుగా షాట్లు కొడుతూ సబలెంకాను ఇబ్బంది పెట్టడంతో ఆట గమనం మారింది. బెలారసియన్ క్రీడాకారిణి చేసిన వరుస తప్పిదాలు హేలీకు పట్టు సాధించే అవకాశం కల్పించాయి. ఆమె ఆరంభంలోనే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని మ్యాచ్‌ను సమం చేసింది. ఇక నిర్ణయాత్మక సెట్ ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా సాగింది. సబలెంకా మొదటి బ్రేక్ సాధించి, ఆ తర్వాత మ్యాచ్ కోసం సర్వ్ చేస్తున్నప్పుడు పలు మ్యాచ్ పాయింట్లు సంపాదించి, విజయానికి ఒక గేమ్ దూరంలో నిలిచింది. అయితే ఒత్తిడిలో హేలీ అద్భుతమైన సంయమనం ప్రదర్శించి సెట్‌ను టైబ్రేక్‌కు తీసుకువెళ్లింది. టైబ్రేక్‌లో, సబలెంకా మళ్ళీ మ్యాచ్ పాయింట్‌ను సాధించినప్పటికీ, హేలీ పట్టుదలతో వరుసగా 3 పాయింట్లు గెలుచుకుని విజయాన్ని ఖాయం చేసుకుంది.

## ఐపిఎల్ ప్లేఆఫ్స్ రేసు నుంచి
# 5 జట్లు అవుట్!

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ సగం ముగిసేసరికి సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఐపీఎల్ 2026 రసవత్తరంగా సాగుతున్న తరుణంలో, దిగ్గజ జట్లు సైతం నిలకడ లేని ప్రదర్శనతో వెనుకబడుతున్నాయి. కొన్ని జట్లు అగ్రస్థానంలో దూసుకుపోతుండగా, మరికొన్ని జట్లు టోర్నీ నుండి నిష్క్రమించే స్థితికి చేరుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఐదు జట్లు ప్లేఆఫ్స్ అవకాశాలను దాదాపు కోల్పోయే ప్రమాదంలో ఉండటం అభిమానులను కలవరపెడుతోంది.

ఛాంపియన్లకే చాంపియన్ గా నిలిచిన ముంబై ఇండియన్స్ గత రెండు సీజన్ల నుండి పేలవ ప్రదర్శనతో వెనుకబడిపోయింది. అలాగే ప్రస్తుత సీజన్ కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ఏమాత్రం కలిసి రావడం లేదు. కోల్‌కతా ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో వెనుకబడింది. మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లోనూ గెలిస్తేనే ఆ జట్టుకు అవకాశాలు ఉంటాయి. అయితే, ఫామ్‌లో ఉన్న హైదరాబాద్, బెంగళూరు జట్లతో తదుపరి మ్యాచ్‌లు ఉండటం కోల్‌కతాకు పెద్ద సవాల్‌గా మారింది. లక్నో పరిస్థితి కూడా భిన్నంగా ఏమీ లేదు. రిషబ్ పంత్ నాయకత్వంలోని ఈ జట్టు అంచనాలను అందుకోలేకపోయింది. ఒక్క ఓటమి ఎదురైనా లక్నో టోర్నీ నుంచి అధికారికంగా తప్పుకోవాల్సి ఉంటుంది. ఐదుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ఏడు మ్యాచ్‌ల్లో కేవలం రెండు విజయాలతో తొమ్మిదో స్థానంలో ఉన్న ముంబై, ప్లేఆఫ్స్ చేరాలంటే మిగిలిన ఏడు (29వ తేదీ మ్యాచ్‌తో సహా) మ్యాచ్‌ల్లో కనీసం ఆరింటిలో గెలవాలి. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో 103 పరుగుల తేడాతో ఓటమి చెందడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. మరోవైపు, ఢిల్లీ క్యాపిటల్స్ ప్రదర్శన అత్యంత విచిత్రంగా ఉంది. ఒక మ్యాచ్‌లో 264 పరుగులు చేసిన అదే జట్టు, తర్వాతి మ్యాచ్‌లో 75 పరుగులకే కుప్పకూలడం ఆశ్చర్యకరం. ఎనిమిది మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఉన్న ఢిల్లీ, ఇకపై ప్రతి మ్యాచ్‌ను నాకౌట్‌లా భావించాల్సి ఉంటుంది. ఇక చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఈ సీజన్ అగ్నిపరీక్షగా మారింది. యువ ఆటగాడు ఆయుష్ మాత్రే అందుబాటులో లేకపోవడం జట్టు సమతుల్యతను దెబ్బతీసింది.

ఎనిమిది మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఆరో స్థానంలో ఉన్న చెన్నై, తదుపరి మ్యాచ్‌ల్లో ముంబై, హైదరాబాద్ వంటి బలమైన జట్లను ఎదుర్కోవాలి. సంజు శాంసన్ వ్యక్తిగత ప్రదర్శనపైనే జట్టు ఆధారపడుతుండటం ఆందోళన కలిగించే అంశం. వరుస విజయాలు సాధించకుంటే ఛాంపియన్ జట్టు లీగ్ దశలోనే ఇంటికి వెళ్లక తప్పదు. ఇలా కేవలం అద్భుతాలు జరిగితే తప్ప ఈ ఐదు జట్లు ప్లేఆఫ్స్ చేరడం అసాధ్యమని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో ఇక జరిగే మ్యాచ్‌లు ప్రతి జట్టు భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.














## సింబైన్ క్లాసిక్ లాంగ్ జంప్‌లో..
# శ్రీశంకర్‌కు టైటిల్

**న్యూఢిల్లీ:** సింబైన్ క్లాసిక్ 2026లో భారత్‌కు చెందిన మురళీ శ్రీశంకర్ పురుషుల లాంగ్ జంప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియాలో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ సిల్వర్ లెవెల్ మీట్‌లో, శ్రీశంకర్ 8.12 మీటర్ల అత్యుత్తమ లీప్ నమోదు చేసి, దక్షిణాఫ్రికాకు చెందిన దివాన్ మాన్యుయెల్ (8.07 మీ)ను అధిగమించి పోడియంపై అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. శ్రీశంకర్ విజయం సాధించిన జంప్, 1.0 మీ/సె గాలి వేగంతో నమోదైంది. అంటే, అతను ఎదురుగాలిలో దూకాడు. ఈ సీజన్‌లో శ్రీశంకర్‌కు ఇది రెండవ పోటీ. ఈ నెల ప్రారంభంలో బెంగళూరులోని శ్రీ కంఠీరవ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ సిరీస్ 1లో 8.15 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో అతను ఈ ఏడాదిని ప్రారంభించాడు. రెండు సంవత్సరాల క్రితం 2024 పారిస్ ఒలింపిక్స్‌కు కొద్ది రోజుల ముందు శ్రీశంకర్ తీవ్ర గాయానికి గురవ్వడంతో, అతను ఆ ప్రపంచ పోటీకి దూరమవ్వాల్సి వచ్చింది. అతను గత సంవత్సరం టోక్యోలో జరిగే 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడానికి సమయానికి కోలుకున్నాడు, కానీ క్వాలిఫికేషన్ రౌండ్‌ను దాటడంలో విఫలమయ్యాడు. ఈ ఏడాది చివర్లో జరగనున్న 2026 ఆసియా క్రీడలు, 2026 కామన్వెల్త్ క్రీడల నేపథ్యంలో, శ్రీశంకర్ వరుసగా ఐచినగోయా, గ్లాస్గోలలో అత్యుత్తమ ప్రదర్శన చేయాలని పట్టుదలతో ఉన్నాడు.

## ఆసియా బీచ్ గేమ్స్‌లో..
# ప్రియా, పుష్పకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా బీచ్ గేమ్స్ 2026, రెజ్లింగ్‌లో ప్రియా మాలిక్, పుష్పా యాదవ్‌లు స్వర్ణం గెలుచుకున్నారు. దీంతో 2026 ఆసియా బీచ్ ఛాంపియన్‌షిప్‌లో 3 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యంతో సహా 6 పతకాలతో భారత్ ముగించింది. చైనాలోని సాన్యాలో బుధవారం జరిగిన చివరి రోజు బీచ్ రెజ్లింగ్ పోటీలో భారత రెజ్లర్లు నాలుగు పతకాలను కైవసం చేసుకున్నారు. ప్రియా మాలిక్ (70+ కేజీలు), పుష్పా యాదవ్ (60 కేజీలు) స్వర్ణ పతకాలను కైవసం చేసుకోగా, సిద్ధార్థ్ (70 కేజీలు), జస్‌ప్రీత్ కౌర్ (70 కేజీలు) వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. మరోవైపు, లైట్‌వెయిట్ 50 కేజీల కాంస్య పతక పోరులో ప్రియాన్షి ప్రజాపత్ గాయపడటంతో జపాన్‌కు చెందిన ఫునా యానో చేతిలో ఓటమిని అంగీకరించింది. మాజీ ఆసియా ఛాంపియన్‌షిప్ పతక విజేత ప్రియా మాలిక్ మంగోలియాకు చెందిన జోరిగ్ట్‌ను ఓడించగా, పుష్పా యాదవ తమతమ ఫైనల్స్‌లో చైనాకు చెందిన ప్రస్తుత ఆసియా ఫ్రీస్టైల్ ఛాంపియన్ షీ మెంగూపై విజయం సాధించారు. ఇద్దరు రెజ్లర్లు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించి, గ్రూప్, ఆ తర్వాత నాకౌట్ దశ అంతటా అజేయంగా నిలిచి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. ఇక సెమీఫైనల్స్‌లో వియత్నాంకు చెందిన డాంగ్ థి నిన్ చేతిలో ఓడిపోయిన జప్రీత్ కౌర్ (70 కేజీలు), కాంస్య పతక పోరులో కజఖ్ రెజ్లర్‌ను 2-0 తేడాతో ఓడించి బలంగా పుంజుకుంది. అంతకు ముందు మిగిలిన ముగ్గురు భారత రెజ్లర్లు, సచిన్ మోర్ (80 కేజీ), ఆర్యన్ (90 కేజీ), జస్పూరన్ సింగ్ (90+ కేజీలు) క్వార్టర్ ఫైనల్స్‌లో నిష్క్రమించారు.



# బ్లూచిప్ కంపెనీల షేర్ల ర్యాలీ

## వాణిజ్యం



## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 29:** అంతర్జాతీయ ఉద్రిక్తతలు, అనిశ్చితుల మధ్యకూడా దేశీయస్టాక్ మార్కెట్ల సూచీలులాభాల్లోనే ముగిసాయి. ఆసియా మార్కెట్ల నుండి అందిన సానుకూల సంకేతాలు, బ్లూచిప్ కంపెనీల ఆకర్షణీయమైన త్రైమాసిక ఫలితాలు వెరసి దలాల్ స్ట్రీట్‌లో బుల్ రన్‌కు దారితీశాయి. ప్రధానంగా ఐటీ రంగం, రిలయన్స్ బ్లూచిప్ ఇండస్ట్రీస్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్ల మద్దతు మార్కెట్‌ను లాభాల బాటలో నడిపించాయి. సెన్సెక్స్ సుమారు 609 పాయింట్లు పెరిగి 77,496 వద్ద ముగియగా, నిఫ్టీ 181 పాయింట్లు లాభపడి 24,177 స్థాయిని అందుకుంది. చివరి గంటలో ఇన్వెస్టర్లు కొంత లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వల్ల గరిష్ట స్థాయిల నుండి స్వల్పంగా వెనక్కి తగ్గింది. మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేసిన కీలక అంశాలను పరిశీలిస్తే రంగాల వారీగా ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ రంగాలు మంచి పనితీరును కనబరిచాయి. ముఖ్యంగా ఐటీసీ షేరు దాదాపు 3.79 శాతం పెరిగి సెన్సెక్స్‌లో టాప్ గెయినర్‌గా నిలిచింది. టెక్ మహీంద్రా, మారుతి, అదానీ పోర్ట్స్ వంటి షేర్లు కూడా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించాయి. మరోవైపు, విస్తృత మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించింది; స్మాల్‌క్యాప్ సూచీ లాభపడగా, మిడ్‌క్యాప్ స్వల్ప నష్టాలను చవిచూసింది. ఇండెక్స్ హెవీవెయిట్ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనుగోళ్లు మార్కెట్ స్థిరత్వానికి సూచీగా నిలిచాయి. అంతర్జాతీయ పరిణామాలు ఈ ట్రేడింగ్ సెషన్‌లో కీలక పాత్ర పోషించాయి. ఒకవైపు ఒపెక్ కూటమి నుండి యూఏఈ వైదొలుగుతున్నట్లు ప్రకటించడం చమురు మార్కెట్లలో కలకలం రేపింది. మే 1 నుండి అమలులోకి రానున్న ఈ నిర్ణయం ప్రపంచ చమురు సరఫరా సమీకరణాలను మార్చే అవకాశం ఉంది. అమెరికాఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన కారణంగా హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం కొనసాగుతుండటంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 111 డాలర్ల మార్కును దాటింది. పెరిగిన చమురు ధరలు ద్రవ్యోల్బణ భయాలను పెంచుతున్నప్పటికీ, భారత మార్కెట్లు ప్రస్తుతానికి కంపెనీల ఆదాయ వృద్ధిపైనే ఎక్కువ నమ్మకాన్ని ఉంచాయి. బిఎస్ఇలోమొత్తం 2120 షేర్లు లాభపడగా 2112 షేర్లు క్షీణించాయి. 177 షేర్లుమాత్రం స్థిరంగానే కొనసాగాయి.ఇక డాలరుతోరూపాయి మారకం విలువలు 94.85కి చేరింది. ముందురోజు 904.68గాట్రేడ్ అయితే బుధవారం మరింతగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ 0.62శాతం క్షీణించి రూ.1,49,099గా కొనసాగింది. బ్రెంట్‌ముడి చమురు కూడా జూన్ సెటిల్‌మెంట్ల ధరలు 3.55 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 114.81 డాలర్లుగా కొనసాగిం ది. అమెరికా మార్కెట్ల విషయానికొస్తే వాల్ స్ట్రీట్‌లో ఏఐ కంపెనీల ఆదాయ వృద్ధిపై ఆందోళనలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఓపెన్‌ఏఐ ఫలితాల ప్రభావంతో మంగళవారం నాస్‌డాక్ నష్టపోయింది. బుధవారంఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో కొంత కోలుకోవడం భారత మార్కెట్లకు ఊరటనిచ్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లందరూ అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకోబోయే నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ముడి చమురు ధరల హెచ్చుతగ్గుల మధ్య, మార్కెట్ మరికొంత కాలం అస్థిరంగానే ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# మేనెలలో 12 రోజులు బ్యాంకులకు సెలవు

**ముంబయి, ఏప్రిల్ 29:** మే నెలకు సంబంధించి రిజర్వుబ్యాంకు దేశంలో మొత్తం బ్యాంకుల సెలవుల కేలండర్‌నుప్రకటించింది. దేశవ్యాప్తంగా చూస్తే మొత్తంగా శని, ఆదివారాలతో కలిపి 12 రోజులు బ్యాంకులకు సెలవు ఉంది. తెలుగు రాష్ట్రాల్లో మహారాష్ట్ర దినోత్సవం, బక్రీద్ సందర్భంగా బ్యాంకులకు హాలిడే ఉంది. ఇతర రాష్ట్రాల్లో వీటితో పాటు రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వంటి ఇతర సెలవులు ఉన్నాయి. మే 1 మహారాష్ట్ర దినోత్సవం,బుద్ధపూర్ణిమ, అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం నేపథ్యంల. రెండు తెలుగు రాష్ట్రాలు సహా చెన్నై, భోపాల్, ముంబై, ఢిల్లీ, శ్రీనగర్, పట్నా ఇలా పలు ప్రధాన ప్రాంతాల్లో బ్యాంక్ హాలిడే ఉంది. ఈరోజున గుజరాత్, ఒడిశా, చండీగఢ్, సిక్కిం, రాజస్థాన్, నాగాలాండ్, మేఘాలయ వంటి చోట్లలో బ్యాంకులు తెరిచే ఉంటాయి. మే 9 ఈ రోజున రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి. అదే రోజున రెండో శనివారం కాబట్టి వెస్ట్ బెంగాల్ సహా అన్ని ప్రాంతాల్లో బ్యాంక్ హాలిడే ఉంది. మే 16 సిక్కిం రాష్ట్ర దినోత్సవం సందర్భంగా ఆ రోజున సిక్కింలో బ్యాంకుకు హాలిడే ఉంది. మిగతా ప్రాంతాల్లో యథావిధిగా పనిచేస్తాయి. మే 26 కాజీ నజ్రుల్ ఇస్లామ్ బర్త్‌డే నేపథ్యంలో త్రిపురలో బ్యాంక్ సెలవుఉంది. మే 27 బక్రీద్ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలు సహా మధ్యప్రదేశ్, చండీగఢ్, ఉత్తరాఖండ్, అసోం, జమ్ముకశ్మీర్, కేరళ, నాగాలాండ్, వెస్ట్ బెంగాల్, ఉత్తర్ ప్రదేశ్, న్యూ ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ ఇలా పలు ప్రాంతాల్లో సెలవు ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, సిక్కిం,రాజస్థాన్, గోవా బిహార్‌లో యథావిధిగా పనిచేయనున్నాయి. మే 28 మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు,రాజస్థాన్, శ్రీనగర్, గోవా, బిహార్ రాష్ట్రాల్లో బక్రీద్ గురువారం నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడమే 28న సెలవుఉంది. మిగతా వీకెండ్స్ విషయానికి వస్తే నాలుగో మే 23, ఆది వారాలు మే 3, 10, 17, 24, 31 బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. ఇలా మొత్తంగా 12 సెలవులు వస్తున్నాయి. కస్టమర్లు ఆన్‌లైన్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ సేవలు పొందొచ్చు. ఈ కార్యకలాపాలు అన్నీ అందుబాటులోనే ఉంటాయి. ఇంకా ఏటీఎంలు, డిపాజిట్ మెషీన్లు తెరిచే ఉంటాయి.

# 6%కి దిగివస్తున్న భారత్ జిడిపి వృద్ధి




**న్యూఢిల్లీ,ఏప్రిల్ 29:** భారత్ జిడిపి వృద్ధి ఆరుశాతానికి దిగివస్తుందని, రిటైల్‌ద్రవ్యోల్బణం కొంతమేర పెరగడవచ్చని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరుశాతానికి అటూ ఇటూగా ఉంటుందనిఆర్బీఐ ఇప్పటికే అంచనా వేసింది. ఈ ప్రభావం ఆర్థికవృద్ధిపై ఉంటుందని ఎర్నెస్ట్‌యంగ్ ఇండియా ప్రకటించింది. ముడిచమురు కూడా రానున్న రోజుల్లో బ్యారెల్‌కు 120 డాలర్లకు పెరగవచ్చని ఈవై ఇండియా చీఫ్ పాలసీ సలహాదారు డికె శ్రీవాస్తవ వెల్లడించారు. రెపోరేట్‌ను కొంతమేర ఎగువకు తీసుకెళ్లాలిస ఉంటుందని, సవరణలు అనివార్యం అవుతాయని చెప్పారు. ముడిచమురు సరఫరా కొరత కారణంగా ధరలు మరింతగాపెరుగుతాయని, పశ్చిమాసియా సంక్షోభం మరింతగా కొనసాగే అవకాశం ఉన్నందున ధరలు 120 డాలర్లవరకూ వెళ్లవచ్చని అంచనావేసారు. ఇండియన్ క్రూడ్ బాస్కెట్ ధరల్లో సగటున 2027 ఆర్థికసంవత్సరంలో బ్యారెల్‌కు 120 డాలర్లవరకూ ఉంటుందని తేలింది. ఈపరిణామాలతో భారత్ జిడిపి వృద్ధి ఆరుశాతానికి దిగిపోవచ్చని తేలింది. అలాగే రిటైల్ ద్రవ్యోల్బణం కూడా ఆరుశాతంగా ఉంటుందని ఆర్థికలోటుపై ప్రతికూల ప్రభావం తగ్గుతుందని కూడా అంచనావేసింది. పెరుగుతున్న ఇంధన ధరలు రిటైలర్లపైకే వెళతాయని ఎర్నెస్ట్ యంగ్ ప్రకటించింది. అమెరికా ఇంధన సమాచార పాలనావిభాగం ఇఐఎ స్వల్పకాలిక ఇంధన సమీక్షలోబ్రెంట్‌ముడిచమురుధరలు సగటున బ్యారెల్‌కు 81 డాలర్లుగా తొలిత్రైమాసికంలో ఉంటే రెండోత్రైమాసికంలో బ్యారెల్‌కు 115 డాలర్లవరకూ ఉంటాయని తేలింది. ఐఎంఎఫ్ భారత ఆర్థికవృద్ధిని 6.5శాతంగా అంచనావేస్తే ఆసియా అభివృద్ధిబ్యాంకు 6.9శాతం, ప్రపంచ బ్యాంకు 6.6శాతంగా జిడిపి వృద్ధిని అంచనావేసాయి.అయితే భారత రిజర్వుబ్యాంకు మాత్రం జిడిపి వృదిథ 6.9శాతంగాఉంటుందని ద్రవ్యోల్బణం 4.6శాతంగా ఉంటూ రెండుశాతం అటూఇటూగా పెరగవచ్చని అంచనావేసింది. పశ్చిమాసియా సంక్షోభం అంచనాలకు మించి పెరుగుతోందని యుద్ధం ముగిసినా గ్లోబల్ ముడిచమురుసరఫరాకు మరికొంత సమయం దుతుందని అంచనావేసారు. 2027ఆర్థికసంవత్సరంలో ప్రపంచ వృద్ధికంటే మెరుగ్గానే ఉంటుందని భౌగోళిక ఉద్రిక్తతలున్నప్పటికీ సవాళ్లను భారత్ అధిగమించే సామర్థ్యంతో ఉందని రేటింగ్ సంస్థలు అంచనావేస్తున్నాయి.

# వచ్చేనెలనుంచి సిగరెట్ ధరల్లో పెంపు



**ముంబయి, ఏప్రిల్ 29:** మే 1 నుంచి సిగరెట్ల ధరలు ఏకంగా 17 శాతం పెరగవచ్చన్న అంచనాలతో కంపెనీల స్టాక్స్ మార్కెట్‌లో విపరీతంగా పెరిగాయి. ఐటీసీ షేర్లు 4 శాతం లాభపడగా, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేర్లు ఏకంగా 6.5 శాతం పుంజుకున్నాయి. సిగరెట్ల ధరల పెంపు వల్ల కంపెనీల లాభాలు పెరుగుతాయన్న అంచనాతో ఇన్వెస్టర్లు ఈ షేర్ల కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఫలితంగా నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ సూచీ కూడా 2 శాతం మేర ఎగబాకింది. ఈ ధరల పెంపు కేవలం ప్రీమియం ఉత్పత్తులకే పరిమితం కాకుండా, సామాన్యులు వాడే తక్కువ ధర కలిగిన వాల్యూఎండ్ బ్రాండ్‌లకు కూడా వర్తించనుంది. ప్రస్తుతం రూ.115 ఉన్న ఐటీసీ గోల్డ్‌ఫ్లేక్ ప్రీమియం ప్యాక్ ధర మే నెల నుంచి రూ.135 కి చేరే అవకాశం ఉంది. అంటే సగటున ప్రతి సిగరెట్‌పై రూ.2 నుంచి రూ.3 వరకు భారం పెరగనుంది. కింగ్ సైజ్ సిగరెట్లపై ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపించనుంది. ఈ ఏడాది ఆరంభంలో పార్లమెంట్ ఆమోదించిన సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025 ఈ పెంపునకు ప్రధాన కారణం. పొగాకు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం భారీగా ఎక్సైజ్ సుంకాలను పెంచింది. ప్రతి 1,000 సిగరెట్లపై వాటి పొడవును బట్టి రూ.2,050 నుంచి రూ.8,500 వరకు ఎక్సైజ్ డ్యూటీ విధిస్తున్నారు. ఈ ఎక్సైజ్ డ్యూటీకి అదనంగా మరో 40 శాతం జీఎస్టీ కూడా అమల్లో ఉంటుంది. ఫిబ్రవరి 1 నుంచే ఈ సుంకాలు అమల్లోకి వచ్చినప్పటికీ, కంపెనీలు ఇప్పుడు ఆ భారాన్ని వినియోగదారులపైకి మళ్లించడానికి సిద్ధమయ్యాయి. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ప్రకారం 75 మి.మీ కంటే ఎక్కువ పొడవు ఉన్న సిగరెట్లు ఐటీసీ మొత్తం అమ్మకాల్లో 16 శాతం వాటాను కలిగి ఉన్నాయి. సుంకల పెంపు వల్ల ఈ విభాగంలో ఖర్చు 2228 శాతం పెరిగింది. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ మాట్లాడుతూ ధరలు పెరిగినప్పుడు ప్రారంభంలో అమ్మకాలు కొద్దిగా తగ్గినట్లు అనిపించినా, సిగరెట్ కంపెనీలకు ఉన్న ధరల నిర్ణయ సామర్థం వల్ల అవి తిరిగి లాభాలను సంపాదిస్తాయని పేర్కొన్నారు. పన్నులు ఎంత పెరిగినా కంపెనీల లాభదాయకతకు డోకా లేదని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు.

# ఐడిబిఐలో వాటా విక్రయానికి ఎల్ఐసి, కేంద్రం రెడీ..




**ముంబయి, ఏప్రిల్ 29:** ఐడీబీఐ బ్యాంకులో వాటా విక్రయం కోసం కేంద్రం ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం, ఎల్ఐసీకి కలిపి మొత్తం 90 శాతం వరకు వాటా ఉంది. దీంట్లో భాగంగా ఎల్ఐసీ 30.24 శాతం, ప్రభుత్వం 30.38 శాతం చొప్పున మొత్తం 60 శాతానికిపైగా వాటాను విక్రయిం చనున్నాయి. ఈ ప్రక్రియ ఆగిపోయినట్లు వార్తలు వచ్చాయి. ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వ్ ధరల కంటే చాలా తక్కువ ధరకు బిడ్డర్లు కోట్స్ చేయడంతో వాయిదా వేసింది. బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రక్రియలో ఈ ఐడీబీఐ బ్యాంక్ విక్రయ ప్రక్రియ కీలకంగా ఉంది.బిడ్స్ అంచనాల కంటే తక్కువగా ఉండటం ఇంకా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల తరుణంలో విక్రయ ప్రక్రియ ఆలస్యమైంది. కేంద్ర కేబినెట్ కార్యదర్శి టీవీ. సోమనాథన్ ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల కమిటీ తాజాగా సమావేశమైంది. ఐడీబీఐ బ్యాంక్ వాటా విక్రయంపై సరికొత్త వ్యూహాన్ని సమీక్షించింది. ఇప్పుడు మార్కెట్ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విలువను నిర్ణయించడంతో పాటుగా టైమ్‌లైన్‌ను మళ్లీ సెట్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్తగా మళ్లీ విలువను నిర్ణయించే ప్రక్రియ ప్రారంభించింది. ఇది ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు తగ్గట్లుగా రియలిస్టిక్‌గా ఉండేలా చూస్తోంది.

# బజాజ్‌ఫైనాన్స్ నికరలాభం రూ.4839.50 కోట్లు

**ముంబయి, ఏప్రిల్ 29:** ప్రైవేటునాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్‌సంస్థ బజాజ్‌ఫైనాన్స్ బుధవారం నికరలాభాలనుప్రకటించింది.నాలుగోత్రైమాసికంలో 23శాతం లాభం పెరిగి 4839.50 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. గత ఏడాది ఇదేకాలంలో 3940.44కోట్లనుంచి ఈ ఏడాది 23శాతంపెంచుకోగలిగింది.మొత్తం రాబడులు ఈ త్రైమాసికంలో రు.18,430.64 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది 15,469.91 కోట్లనుంచి భారీ వృద్ధిని నమోదుచేసింది. పన్నులచెల్లింపులకు ముందు లాభాలురూ.6484.34కోట్లుగా ఉన్నాయి. మొత్తం వ్యయాలు కూడా రూ.11,946.30 కోట్లుగా ఉన్నట్లు తేలింది.పూర్తి ఆర్థిక సంవత్సరానికిగాను బజాజ్‌ఫైనాన్స్‌నికరలాభం గత ఏడాది రూ.16,661.50 కోట్లనుంచి రూ.17,803.87కోట్లకు పెరిగింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.